ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం 31.10.2026 | సంపుటి:13 సంచిక : 101 | పేజీలు :12 వెల:రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

మూడేళ్లలో.. రూ. లక్షన్నర కోట్ల భూముల్ని కాపాడాం

మియాపూర్‌లోని 550 ఎకరాలను కొట్టేసేందుకు కేసీఆర్ ప్రయత్నించారు

కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత తెలంగాణలో ఎక్కడైతే అత్యంత విలువైన ప్రభుత్వ భూములున్నాయో వాటిని తన కుటుంబ సభ్యులు, అనుచరుల మీదకు బదిలీ చేసి కొట్టేసేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. కానీ మా ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటన్నింటితో పాటు మియాపూర్‌లోని రూ.50 వేల కోట్ల విలువైన ఆస్తి(550 ఎకరాలు)ని న్యాయస్థానాల్లో పోరాటం చేసి కాపాడాం” -ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

గతంలో భూ కబ్జా వ్యవహారాలపై నేను పోరాడితే కక్షతో జైలుకు పంపారు: సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): మియాపూర్‌లోని 550 ఎకరాల భూములను కొల్లగొట్టేందుకు కేసీఆర్, ఆయన బంధువులు అనేక రకాలుగా ప్రయత్నించారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. భూములను కొట్టేసేందుకు గోల్డ్‌స్టోన్ ప్రసాదరావు ప్రయత్నించారన్న ఆయన ఈ భూముల విషయంలోనే బీఆర్ఎస్ రాజ్యసభ ఎంపీ దామోదరరావుకు ప్రసాదరావు ఖరీదైన కారు బహుమతిగా ఇచ్చారని అన్నారు.

కేసీఆర్ సర్కారు ఏ ప్రయత్నం చేయలేదు

కొందరు అధికారులను అడ్డంపెట్టుకుని భూములు కొట్టేయాలని బీఆర్ఎస్ నేతలు చూశారన్న సీఎం రేవంత్ రెడ్డి ఈ వివాదంలో ఆ అధికారులు కూడా అరెస్టయ్యారని తెలిపారు. మియాపూర్‌లోని 550 ఎకరాలను కాపాడేందుకు కేసీఆర్ సర్కారు ఏ ప్రయత్నం చేయలేదని అన్నారు. తాము అధికారంలోకి వచ్చాక ఈ కేసుపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలిపారు. సుప్రీంకోర్టులో బలమైన వాదనలు వినిపించి రూ.50 వేల కోట్ల ఆస్తిని కాపాడుకోగలిగామని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పు రాగానే ఈ భూములు స్వాధీనం చేసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు.

మిగతా 2లో..

హైస్పీడ్ రైళ్ల మార్గాల పనులు వేగవంతం చేయండి

- నూతన రైలు మార్గాల మంజూరుకు అనుమతులు ఇవ్వండి
- అనంతారంలో మెగా ఫ్రైట్ మెయింటెనెన్స్ డిపో ఏర్పాటు చేయండి
- రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి

2లో..

బ్యాగు బ్రాండెడ్.. లోపల రేషన్..!

పేదల బియ్యంతో దందా?

- పాలిష్ చేసి సన్న బియ్యం పేరుతో విక్రయం..
- కిలో రూ.90-100 వరకు ధర
- 25-26 కిలోల బస్తా పేరుతో 22 కిలోలేనా?
- హైదరాబాద్ సహా పలు ప్రాంతాల్లో
- పౌరసరఫరాలు, విజిలెన్స్ సోదాలు

హైదరాబాద్(జనంసాక్షి): కర్మన్‌ఘాట్, అంబర్‌పేట, ఖైరతాబాద్, సికింద్రాబాద్, మెహిదీపట్నం, నాంపల్లి, ఇబ్రహీంపట్నం పరిసరాల్లోని రైస్ మిల్లులు, హోల్‌సేల్, రిటైల్ బియ్యం డిపోలపై పౌరసరఫరాల శాఖ, విజిలెన్స్ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. సుమారు 10-12 వ్యాపార సంస్థలను గుర్తించి నమూనా లు సేకరించినట్లు సమాచారం. ఈ తనిఖీల్లో వెలుగుచూసిన అంశాలపై పూర్తిస్థాయి విచారణ జరగాల్సి ఉంది. లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని సేకరించి, మిల్లులకు తరలించి, పాలిష్ చేసిన అనంతరం బ్రాండెడ్ సన్న బియ్యం సంచుల్లో ప్యాక్ చేసి మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కిలో బియ్యాన్ని రూ.90 నుంచి రూ.100 వరకు విక్రయిస్తున్నట్లు కొన్ని కథనాలు పేర్కొన్నాయి. ఈ బియ్యం ఏయే బ్రాండ్ల పేర్లతో మార్కెట్‌లోకి వస్తోంది? సరఫరా వ్యవస్థలో ఎక్కడ లోపాలు జరుగుతున్నాయి? ఈ అక్రమ వ్యాపారంలో ఎవరెవరి పాత్ర ఉంది? అన్నది తేలాల్సి ఉంది. బియ్యం సంచుల బరువులోనూ వినియోగదా రులు మోసపోతున్నారన్న ఆరోపణలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. 25-26 కిలోల బస్తా పేరుతో విక్రయిస్తూ, కొన్ని సందర్భాల్లో 22 కిలోల బియ్యమే ఉం టున్నట్లు వార్తా కథనాల్లో పేర్కొన్నారు. ఈ తేడా లను అధికారిక తూకం, పంచనామా వివరాలతో ధ్రువీకరించాల్సి ఉంది. నిజమని తేలితే, వినియోగదారుల హక్కులను ఉల్లంఘించినట్లే. ప్రభుత్వం పేదల ఆహార భద్రత కోసం పంపిణీ చేస్తున్న బియ్యం అక్రమ మార్గాల్లోకి మళ్లితే, అర్హులైన లబ్ధిదారులకు అన్యాయం జరుగు తుంది. మరోవైపు, బ్రాండెడ్ బియ్యం పేరుతో అధిక ధరలు చెల్లించే వినియోగదారులు కూడా నష్టపోయే ప్రమాదం ఉంది. రేషన్ బియ్యం ఎక్కడ సేకరించారు? ఏ మిల్లుల్లో పాలిష్ చేశారు? ఎవరు ప్యాకింగ్ చేశారు?

మిగతా 2లో..

పేదల కడుపు నింపాల్సిన రేషన్ బియ్యం అక్రమ వ్యాపారులకు కాసుల వర్షం కురిపిస్తోందా? చౌకగా సేకరించిన రేషన్ బియ్యానికి పాలిష్ పట్టించి, బ్రాండెడ్ సన్న బియ్యం సంచుల్లో నింపి అధిక ధరలకు విక్రయిస్తున్న వ్యవహారం హైదరాబాద్‌లో కలకలం రేపుతోంది. పేదలకు అందాల్సిన బియ్యం పక్కదారి పట్టడమే కాకుండా, వినియోగదారులకు నాణ్యమైన సన్న బియ్యం పేరుతో నాసిరకం బియ్యం అంటగడుతున్నారన్న ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి.

ఢిల్లీ మార్చ్‌కై కదలిరండి

విపక్షాలు ఐక్యంగా ఉన్నాయి: రాహుల్ గాంధీ

భారీ వర్షం కారణంగా ‘సీఈసీ’పై ప్రజా అభిశంసన కార్యక్రమం వాయిదా

న్యూఢిల్లీ(జనంసాక్షి): జ్ఞానేశ్ కుమార్‌పై ‘ఇండీ’ కూటమి తలపెట్టిన ప్రజా అభిశంసన కార్యక్రమం దిల్లీలో భారీ వర్షం కారణంగా శనివారానికి వాయిదాపడింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసం వెలుపల కూటమి నేతలతో కలిసి నిర్వహించిన మీడియా సమావే శంలో రాహుల్ గాంధీ ఈ మేరకు ఓ ప్రకటన చేశారు. ఏకాభిప్రాయంతో ప్రజాఅభిశంసన కార్యక్రమాన్ని వాయిదావేసినట్లు తెలిపారు. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా, సీఈసీ జ్ఞానేష్ కుమార్

మిగతా 2లో..

బియ్యం ధరల దోపిడీపై ఉక్కుపాదం

అక్రమ నిల్వలు, బ్లాక్‌మార్కెటింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

- బీపీటీ బియ్యం కిలో రూ.66కు మించకుండా నియంత్రణ చర్యలు
- ఐదు శాఖల సమన్వయంతో ముమ్మర దాడులు.. ఇప్పటికే 12 కేసులు
- ధరలు స్థిరపడే వరకు రాష్ట్రవ్యాప్తంగా కొనసాగనున్న తనిఖీలు
- మిల్లర్లు, వ్యాపారులకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరిక
- సరిపడా బియ్యం నిల్వలు ఉన్నాయి.. ప్రజలు ఆందోళన చెందొద్దని వినతి

హైదరాబాద్ (జనంసాక్షి): బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసినా, బ్లాక్‌మార్కెట్‌కు తరలించినా, అధిక ధరలకు విక్రయించి ప్రజలపై భారం మోపినా కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. వినియోగదారుల అవసరాలను ఆసరాగా చేసుకుని అడ్డగోలుగా లాభాలు సంపాదించాలనుకునే వారిని ప్రభుత్వం ఉపేక్షించబోదని స్పష్టం చేశారు. పెరుగుతున్న బియ్యం ధరలను అదుపులోకి తీసుకొచ్చి ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలను ముమ్మరం చేసినట్లు తెలిపారు. బియ్యం ధరల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బేగంపేట కుందన్ బాగ్ లోని తన క్యాంపు కార్యాలయంలో పౌర సరఫరాల శాఖాధికారులతో శుక్రవారం సమీక్షించారు. టోకు, చిల్లర వ్యాపారులు, రైస్‌మిల్లర్లతో పౌర సరఫరాల శాఖ అధికారులు జరిపిన చర్చల వివరాలను తెలుసుకున్నారు. అక్రమాల నిరోధానికి చేపట్టిన ప్రత్యేక చర్యలు, తనిఖీల పురోగతిని పౌర సరఫరాల

మిగతా 2లో..

దేశభక్తి గీతం.. కల్తీ రాగం!

- పుల్లారెడ్డి స్వీట్స్ తయారీ కేంద్రం లైసెన్స్ సస్పెన్షన్
- ముడిసరుకుల గదుల్లో ఎలుకల మలం, బొద్దింకలు ఉన్నట్లు అధికారుల గుర్తింపు
- రూ.15.03 లక్షల విలువైన 3,133 కిలోల ఆహార పదార్థాల ధ్వంసం
- నగరంలో పలు స్వీట్స్ తయారీ కేంద్రాలపై ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ దాడులు

2లో..

కూలిన హెలికాప్టర్..

ఆరుగురి గల్లంతు

ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లాలో దుర్ఘటన

చమోలీ(జనంసాక్షి): ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లాలో ఓ హెలికాప్టర్ కుప్పకూలింది. బద్రీనాథ్ నుంచి డెహ్రాడూన్‌కు వెళ్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ‘ట్రాన్స్ భారత్’ ఏవియేషన్ సంస్థకు చెందిన చాపర్‌లో పైలట్ సహా ఆరుగురు వ్యక్తులు ఉన్నట్లు సమాచారం. వీరిలో ఓ మహిళ ఉన్నట్లు తెలుస్తోంది. జేపీ పవర్

మిగతా 9లో..

దేశవ్యాప్తంగా జనగణన జనవరి 25 నుంచి

ప్రక్రియ నుంచి జమ్ముకశ్మీర్, లద్దాఖ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలకు మినహాయింపు

న్యూఢిల్లీ(జనంసాక్షి): 2027 జనవరి25 నుంచి ఫిబ్రవరి 28 వరకు దేశవ్యాప్తంగా జనగణనజరుగుతుం దని కేంద్ర ప్రకటించింది. ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో, మంచు కురిసే జమ్ముకశ్మీర్, లద్దాఖ్, హిమాచల్‌ప్ర దేశ్‌లో ఉండదని స్పష్టం చేసింది. భారతదేశ వ్యాప్తంగా 2027 జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు జనగ ణన మొదలవుతుందని కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. అయితే ఎన్నికలు జరిగే ఉత్తరప్రదేశ్, మణిపుర్, గోవా, పంజాబ్, ఉత్తరాఖండ్‌లో జనగణన ఉండదని స్పష్టం చేసింది. అలాగే మంచు కురిసే జమ్మూకశ్మీర్, లద్దాఖ్, హిమాచల్‌ప్రదేశ్‌లోనూ జనగణన ఉందని పేర్కొంది. భారత రిజిస్ట్రార్ జనరల్, సెన్సస్ కమిషనర్ మృత్యుంజయ కుమార్ నారాయణ్ జారీ చేసిన ప్రకారం, జనాభా గణనకు రిఫరెన్స్ తేదీగా 2027 మార్చి 1 అర్ధరాత్రి 12 గంటలుగా నిర్ణయించారు. ఆర్‌జీఐ ప్రకారం, జనగణన ప్రక్రియలో భాగంగా 2027 మార్చి 1 నుంచి మార్చి 5 వరకు ‘సవరణ దశ’ ఉంటుంది. ఇంటింటికీ తిరిగి జనాభాను లెక్కించే ప్రక్రియ ప్రారంభం కావడానికి ముందు, అంటే 2027 జనవరి 10 నుంచి జనవరి 24 వరకు ప్రజలు స్వయంగా తమ వివరాలను నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తారు. భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత జరుగుతున్న 8వ జనగణన ఇది. దీనిని రెండు దశల్లో నిర్వహిస్తారు. మొదటిది గృహాల

మిగతా 2లో..

ఇరాన్‌పై దాడులకు రంగం సిద్ధం

ప్లాన్‌పై ట్రంప్‌నకు బ్రీఫింగ్

- మమ్మల్ని లొంగదీసుకోవాలని చూసినా ఎటువంటి లాభంలేదు
- చర్చల్లో పురోగతి రావాలంటే షరతులకు అమెరికా అంగీకరించాల్సిందే..: ఇరాన్
- సీమైన్లను ఢీకొన్న నాలుగు ట్యాంకర్లు

వాషింగ్టన్(జనంసాక్షి): అమెరికాలో మధ్యంతర ఎన్నికల తర్వాత ఇరాన్‌పై మరోసారి దాడులు చేయడానికి ఇజ్రాయెల్‌తో కలిసి ట్రంప్ ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. టెహ్రాన్‌పై దాడులు ఎలా చేయబోతున్నాం?.. ఏ ప్రాంతాల్లో సైనికులు, యుద్ధ విమానాలను మోహరించాలనేదానిపై అమెరికా ఉన్నత సైనికాధికారులు ట్రంప్‌నకు బ్రీఫింగ్ ఇచ్చారు. వైట్ హౌస్‌లో రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్, జాయింట్ చీఫ్స్ ఛైర్మన్ జనరల్ డాన్ కెయిన్‌లతో పాటు.. పశ్చిమాసియాలోని అమెరికా ఉన్నత కమాండర్ అడ్మిరల్ బ్రాడ్ కూపర్‌తో ట్రంప్ సమావేశమయ్యారు. దాడుల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని.. సైనిక

మిగతా 2లో..

హైదరాబాద్‌లో జోరువాన

పలు చోట్ల ట్రాఫిక్ జామ్

ఆఫీసుల నుంచి ఇళ్లకు వెళ్లే ఉద్యోగులు, వాహనదారులు ఇబ్బందులు

నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మణికొండ, రాయదుర్గం, షేక్‌పేట, తుర్కయంజాల్, మన్నెగూడ, కాప్రా, కీసర, నాగారం, టోలిచౌకి, కార్వాన్, రాజేంద్రనగర్, మెహదీపట్నం, యూసుఫ్‌గూడా, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఖైరతాబాద్, నాంపల్లి, ఉప్పల్, ఎల్బీనగర్, అబ్దుల్లాపూర్‌మెట్ తదితర ప్రాంతాల్లో వర్షం పడింది. దీంతో ఆఫీసుల నుంచి ఇళ్లకు వెళ్తున్న ఉద్యోగులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వర్షం కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ అయింది. కుత్బుల్లాపూర్ చౌరస్తా నుంచి సూరారం వరకు, షాపూర్ నుంచి గాజులరామారం వరకు ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి.

మరోమారు అధికారమివ్వండి

యూపీలో ఉమ్మడి పౌరస్మృతి అమలు చేస్తాం: అమిత్ షా

2లో..

ఇరాన్‌పై దాడులకు రంగం సిద్ధం..

బలగాలను సిద్ధంగా ఉంచుకోవాలని గల్ఫ్ దేశాలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు. ఈ మేరకు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.మరోసారి జరపనున్న దాడుల్లో ఇరాన్ మౌలిక సదుపాయాలు, పీకాక్స్ పర్వతం సహా పలు అణు స్థావరాలను లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దాడుల ప్లాన్‌ను ట్రంప్ ఆమోదించిన వెంటనే సైనిక చర్య అమల్లోకి రానుంది. ఈ ప్రణాళిక గురించి ఇటీవల డెమోక్రటిక్ సెనెటర్ క్రిస్ మర్ఫీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ.. ఇరాన్‌పై మరోసారి విరుచుకుపడడానికి ట్రంప్ యంత్రాంగం సిద్ధమయ్యిందన్నారు. అందుకోసం చేసిన యుద్ధ ప్రణాళికల గురించి తమలో కొంతమందికి వివరించారని తెలిపారు. అయితే ఆ ప్రణాళికలతో ఎటువంటి లక్ష్యాలు సాధించలేమని.. ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం ఉందని క్రిస్ మర్ఫీ హెచ్చరించారు.

మమ్మల్ని లొంగదీసుకోవాలని చూసినా ఎటువంటి లాభంలేదు

టెహ్రాన్(జనంసాక్షి):తమతో ఒప్పందానికి అంగీకరించకపోతే ఇరాన్‌పై సైనిక చర్య చేపడతామని ఇటీవల ట్రంప్ చేసిన హెచ్చరికలపై ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ గాలిబఫ్ తీవ్ర విమర్శలు చేశారు. నయానో భయానో తమను లొంగదీసుకోవాలని చూసినా అగ్రరాజ్యానికి ఎటువంటి లాభం ఉండబోదన్నారు. శాంతి చర్చల్లో పురోగతి రావాలంటే తాము పెట్టిన ఏడు షరతులకు అమెరికా అంగీకరించి తీరాల్సిందేనని స్పష్టం చేశారు. హర్మూజ్‌లో ప్రయాణిస్తున్న నాలుగు చమురు ట్యాంకర్లు సీమైన్లను ఢీకొన్నట్లు ఐఆర్‌జీసీ ప్రకటించింది. నిబంధనలు ఉల్లంఘించిన నౌకలకు ఈ పరిస్థితే ఎదురవుతుందని హెచ్చరించింది. అయితే ఈ నౌకలు ఏ దేశాలకు చెందినవి?, ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్తున్నాయనే వివరాలు మాత్రం తెలియరాలేదు.

దేశవ్యాప్తంగా జనగణన జనవరి 25 నుంచి..

జాబితా తయారీ, గృహ గణన, రెండోది జనాభా లెక్కింపు. ప్రతి పదేళ్లకు ఒకసారి జరిగాల్సిన ఈ ప్రక్రియ ఈసారి కాస్త లేటయ్యింది. వాస్తవానికి జగగణన 2021లోనే జరగాల్సి ఉండగా, కోవిడ్-19 మహమ్మారి కారణంగా వాయిదా పడింది. ఈ భారీ జనాభా గణన ప్రక్రియ కోసం కేంద్ర మంత్రివర్గం రూ.11,718 కోట్లు కేటాయించింది. వాస్తవానికి, గతంలోనే మణిపూర్‌లో 2027 జనాభా గణనకు సంబంధించి గృహాల జాబితా తయారీ ప్రక్రియను వాయిదా వేస్తున్నట్లు ఖీఉఎ జారీ చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.భారతదేశంలో చివరిసారిగా 2011లో జనాభా గణన జరిగింది. అప్పుడు దేశ జనాభా 121 కోట్లుగా నమోదైంది; ఇందులో 62.32 కోట్ల మంది పురుషులు, 58.75 కోట్ల మంది మహిళలు ఉన్నారు. ఆ సమయంలో దేశంలో 24.95 కోట్ల కుటుంబాలు ఉన్నాయి.

మొదట సాన్నిహిత్యంగా ఉండి ఆ తర్వాత అత్యాచారమంటే కుదరదు

దానిని నేరంగా పరిగణించలేం: సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ(జనంసాక్షి):అత్యాచార ఆరోపణలతో నమోదైన కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. మొదట సమ్మతితో కొనసాగించిన బంధంలో విభేదాలు ఏర్పడితే.. ఆ సాన్నిహిత్యాన్ని అత్యాచారంగా పరిగణించలేమంది. కేరళకు చెందిన ఓ వ్యక్తిపై నమోదైన అత్యాచారం, మోసం కేసు విచారణ సందర్భంగా జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. సంబంధాలు విఫలమైన తర్వాత క్రిమినల్ కేసులు పెట్టే ధోరణి సమాజంలో పెరిగిపోతోందని ఈ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం ఆందోళన వ్యక్తం చేసింది.అత్యాచారం, మోసం అనే రెండు ఆరోపణల మధ్య తేడాను గుర్తించాల్సిన అవసరం ఉందని సుప్రీం కోర్టు తెలిపింది. "ఓ జంట మధ్య బంధం సజావుగా సాగుతున్నప్పుడు వారి మధ్య ఉన్న సాన్నిహిత్యాన్ని.. ఆ బంధం చెడిపోయిన తర్వాత అత్యాచారంగా ముద్ర వేయలేం. పరస్పర అంగీకారంతో ఉన్న సంబంధాన్ని నేరంగా పరిగణించి.. ఓ వ్యక్తి స్వేచ్ఛ, గౌరవాన్ని హరించే విధంగా చర్యలు తీసుకోలేం. విఫలమైన బంధాలను క్రిమినల్ కేసులుగా మార్చే ధోరణి సాధారణమైపోయింది" అని వ్యాఖ్యానించింది. ఇది వరకే జరిగిన వివాహాన్ని దాచి ఓ వ్యక్తి తనను రెండో వివాహం చేసుకున్నాడని బాధితురాలు ఆరోపించారు. విషయం తెలిసిన తర్వాత అతడి నుంచి విడాకులు తీసుకున్నట్లు తెలిపారు. మోసం చేసి తనను రెండో పెళ్లి చేసుకున్నందుకు గానూ అతడిపై అత్యాచారం, మోసం, నమ్మకద్రోహం ఆరోపణలతో కేసు పెట్టారు. ఈ కేసును విచారించిన ధర్మాసనం పైవిధంగా స్పందించింది.

భూటాన్‌లో హిమానీనద సరస్సు విస్ఫోటం..

- భారత్‌లో హై అలర్ట్

ఖాట్మండు(జనంసాక్షి):నేపాల్ మెరుపు వరదలు మరవకముందే.. భూటాన్‌లో హిమానీనదం విస్ఫోటం చెందింది. వాయవ్య భూటాన్‌లోని గాసా జిల్లాలోని షింటాఫు సరస్సు ఉప్పొంగింది. దాంతో భారీ వరద సంభవించింది. భారత్‌లో ముందస్తు హెచ్చరికలు జారీ అయ్యాయి. పశ్చిమ బెంగాల్, అస్సాంలోని పలు ప్రాంతాల్లో మెరుపు వరదలు రావొచ్చన్న అంచనాలతో ఆ రాష్ట్రాలను హైఅలర్ట్‌లో ఉంచారు.ఇక, గాసా జిల్లాలోని మో చు నది పరివాహక ప్రాంతంలో ఉన్న వేడినీటి బుగ్గ గాసా త్సాచు వద్ద ఉన్న అన్ని సౌకర్యాలు కొట్టుకుపోయాయి. ముందుగానే అక్కడ ప్రజలను ఖాళీ చేయించడంతో ప్రాణనష్టం తప్పింది. ప్రస్తుతం వరదనీరు దిగువ ప్రాంతాలవైపు ప్రవహిస్తోంది. శ్రీగాంగ్ ప్రాంతాన్ని దాటింది. దాంతో అస్సాంలోని ధుబ్రి, పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్‌లోని కొండ ప్రాంతాలు, అలాగే అలీపుర్‌దువార్, జల్‌పాయిగురి జిల్లాలకు వరద ముప్పు పొంచి ఉంది ఇప్పటికే ఈ రాష్ట్రాలను భూటాన్ అప్రమత్తం చేసింది. సకోశ్ నది పరివాహక ప్రాంతంలో ఉన్న ప్రజలను పశ్చిమ బెంగాల్‌లోని కూచ్‌బెహార్ స్థానిక యంత్రాంగం అలర్ట్ చేసింది. హిమాలయాల్లో 17 ప్రమాదకర హిమానీనద సరస్సుల్లో షింటాఫు కూడా ఒకటి. మో చు నది ప్రారంభమయ్యే చోటే ఈ సరస్సు ఉంది. 2021లో మో చు నది తన ప్రవాహ మార్గాన్ని మార్చుకోవడంతో గాసా త్సాచు వేడినీటి బుగ్గ వద్ద ఏర్పాటు చేసిన సౌకర్యాలన్నీ కొట్టుకుపోయాయి. హిమానీనద సరస్సు విస్ఫోటం చెందడం వల్ల సంభవించే వరదను గ్లేషియల్ లేక్ అవుట్‌బరస్ట్ ఫ్లడ్‌గా పిలుస్తారు. పర్వత ప్రాంతాల్లో హిమానీ నదాలు కరగడం వల్ల సరస్సు గట్లు ఒక్కసారిగా బద్దలై దిగువప్రాంతాలకు నీరు ఉద్ధృతంగా ప్రవహిస్తుంటుంది. దీంతో దిగువ ప్రాంతాల్లో వినాశకరమైన వరదలు సంభవిస్తుంటాయి.

బియ్యం అక్రమ నిల్వలపై అధికారుల మెరుపు దాడులు

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో బియ్యం ధరలకు రెక్కలొస్తున్న నేపథ్యంలో అక్రమ నిల్వపై ప్రభుత్వం కొరడా ఝుళిపిస్తోంది. వరసగా హైదరాబాద్‌లో రెండో రోజు కూడా పలు ప్రాంతాల్లో అక్రమ బియ్యం నిల్వలపై పౌరసరఫరాల శాఖ, విజిలెన్స్ విభాగం, మెట్రలాజికల్ విభాగం, జీఎస్‌టీ అధికారులు మెరుపు దాడులు చేశారు. టాస్క్‌ఫోర్స్ టీమ్ హెడ్ శశిధర్ రాజు నేతృత్వంలో మంగళహాట్, మలక్‌పేట, అమీర్‌పేట తదితర ప్రాంతాల్లో తనిఖీలు సాగాయి. కృష్ణా నగర్ కమలాపురి కాలనీలో నీలం రైస్ డిపోలో నిర్వహించిన సోదాల్లో విస్తుపోయే అక్రమాలు వెలుగు చూశాయి.

సౌతర్న్‌పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్

టెండర్ నోటీస్ నం.06/2026-27(పేపర్ నోటిఫికేషన్)

'ఎస్‌పీఈసీ నం. సీవీఎల్-01/26-27' కొరకు అనుభవం కలిగిన కాంట్రాక్టర్ల నుండి టీజీఎస్‌పీడీసీఎల్ టెండర్లు ఆహ్వానించడమైనది.హబ్సీగూడ సర్కిల్ కీసర డివిజన్‌లో టీ&డీ సివిల్ పనుల కింద ఈడీఈ/ఐసీఎస్‌సీ/కీసర యొక్క కొత్తగా స్థాపించబడిన ఇంటెగ్రేటెడ్ కన్స్యూమర్ సర్వీస్ సెంటర్ (ఐసీఎస్‌సీ)కు అల్యూమినియం పార్టీషియన్ చేయుట. (జనరల్ కేటగిరీ) సివిల్ డివిజన్ మరియు కీసర డివిజన్. 'ఎస్‌పీఈసీ.నం.ఓకేఎస్‌ఆర్-112&113/2026-27-జనరల్ కేటగిరీ, ఎస్‌పీఈసీ నం.ఓకేఎస్‌ఆర్ 114/2026-27 - ఎస్‌సీ కేటగిరికి రిజర్వుచేయబడినది. హబ్సీగూడ కీసర డివిజన్‌లో మిగతా పనులు చేయాల్సిఉంటుంది. మిగతా వివరాలకు www.tgsouthernpower.comలో సంప్రదించగలరు.

సం/- పి.వెంకన్న
సూపరింటెండింగ్ ఇంజినీర్
ఆపరేషన్, హబ్సీగూడ సర్కిల్

DIPR No.12775-PP/CL/ADVT/2026-27

మూడేళ్లలో లక్షన్నర కోట్ల భూముల్ని కాపాడాం

అవసరమైతే ఈ భూములను వేలం వేసి దళిత, బహుజనుల కోసం ఖర్చు చేస్తామని ప్రకటించారు.

కక్షతో జైలుకు పంపారు

గతంలో తాను ఎంపీగా ఉన్నప్పుడు భూ కబ్జా వ్యవహారాలపై పోరాడితే, జైలుకు పంపారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. భూములను విక్రయించి నీటిపారుదల, విద్యా, వైద్యం వంటి తదితర రంగాలకు కేటాయిస్తామన్నారు. ఈ అంశంపై క్యాబినెట్ లో చర్చిస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ. 1.50 లక్షల కోట్ల విలువైన భూములు రక్షించినట్లు వెల్లడించారు.

ఎమ్మెల్యేకు నజరానాగా అప్పగిస్తే

బీఆర్‌ఎస్ నాయకులు కంచె గచ్చిబౌలి, మామిడిపల్లి భూములను కొట్టేసేందుకు ప్రయత్నిస్తే న్యాయ పోరాటంలో గెలిచామని సీఎం అన్నారు. గుర్రంగూడలో అటవీ భూములను కేటీఆర్ అనుచరులు కబ్జాకు ప్రయత్నిస్తే సుప్రీం కోర్టుకు వెళ్లి కాపాడినట్లు తెలిపారు. మంచిరేవులలో 143 ఎకరాల భూమిని కేటీఆర్ రాయలసీమ బిల్డర్స్‌తో కలిసి కబ్జాకు ప్రయత్నిస్తే దానిని రక్షించామన్నారు. అందులో ప్రస్తుతం పోలీసుల పిల్లల కోసం స్కూల్ నిర్మించినట్లు తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 400 ఎకరాల అటవీ భూమిని బీఆర్‌ఎస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేకు నజరానాగా అప్పగిస్తే స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

హరీశ్ రావు మామ కబ్జా

మాజీమంత్రి హరీశ్ రావు మామ హనుమంత రావు కబ్జా పెట్టిన భూములను అధికారులు సర్వే చేయకుండా అడ్డుకుంటున్నారని చెప్పారు. పైగా కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారని సీఎం రేవంత్ చెప్పారు. భూముల ఆక్రమణపై బీఆర్‌ఎస్ నాయకులు ప్రభుత్వంపై అనేక తప్పుడు ఆరోపణలు చేశారని ధ్వజమెత్తారు. శాసనసభలో చర్చ పెట్టి చర్యలకు దిగితే తేలు కుట్టిన దొంగల్లా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మియాపూర్ భూములపై ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వస్తే ఎందుకు బీఆర్‌ఎస్ నాయకులు స్పందించడం లేదని ప్రశ్నించారు. కనీసం రెవెన్యూ అధికారులను ఎందుకు బీఆర్‌ఎస్ నాయకులు అభినందించడం లేదని అన్నారు.

పద్మాలయ స్టూడియో, ల్యాంకో భూములపై కేసులు

ఉమ్మడి రాష్ట్రంలో పద్మాలయ స్టూడియో, ల్యాంకో భూములపై కేసులు వేసిన కేసీఆర్, హరీశ్‌రావు అధికారంలోకి వచ్చిన తర్వాత ఎందుకు వాటిని స్వాధీనం చేసుకోలేదని సీఎం ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఎవరిపై కేసులు వేశారో వారితోనే కేసీఆర్, హరీశ్ రావు లాలూచీ పడ్డట్లు తెలిపారు. మియాపూర్ భూములపై ఇప్పటికైనా కుట్రలు మానుకోవాలని సూచించారు.

బీఆర్‌ఎస్ నేతలు భూ ఆక్రమణలపై చర్చించేందుకు అసెంబ్లీకి రావాలని సీఎం సవాల్ విసిరారు.ఎల్బీనగర్‌లో 150 ఎకరాలను అటవీ ప్రాంతంగా మార్చామన్న సీఎం ఈ మూడేళ్లలో రూ.లక్షా 50 వేల కోట్ల విలువైన భూములను కబ్జా చెర నుంచి కాపాడినట్లు వెల్లడించారు. భూములను ఇలాగే వదిలేస్తే కేసీఆర్ ముఠా మళ్లీ కబ్జా చేస్తుందని అన్నారు. మియాపూర్ భూములను ప్రజాప్రయోజనాలకే ఉపయోగిస్తామని స్పష్టం చేశారు. భూ కబ్జాకు యత్నిస్తే ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందన్న ఆయన ఉన్నది లేనట్టుగా లేనిది ఉన్నట్టుగా కాంగ్రెస్ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్‌కు చెందిన వార్తా పత్రికలు, టీవీల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని ఆక్షేపించారు. దొంగలందరూ ఒక్కటై కాంగ్రెస్ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆక్షేపించారు.

సీఎం సూచనలతోనే విలువైన భూములు కాపాడాం

సీఎం రేవంత్ రేవంత్ రెడ్డి ఆదేశం మేరకు మియాపూర్ భూములను రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి పరిశీలించారు. సర్వే నంబర్ 100,101 భూములను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఆ భూములు హెచ్‌ఎండీఏ అధీనంలోనే ఉన్నాయని తెలిపారు. 400 ఎకరాల భూమికి ఫెన్సింగ్ వేశామన్న ఆయన మరికొంత భూమికి ఫెన్సింగ్ త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు. సెటిల్‌మెంట్ రికార్డులో ప్రభుత్వ భూమిగా ఉందని, మియాపూర్ భూమి 1949లోనే జాగీర్‌దార్ నుంచి ప్రభుత్వ పరమైందన్నారు. 1995లో ప్రారంభమైన వివాదం 23 ఏళ్ల పాటు కోర్టులో నడిచిందని వివరించారు.

హైస్పీడ్ రైళ్ల మార్గాల పనులు వేగవంతం చేయండి

ఢిల్లీ(జనంసాక్షి): తెలంగాణకు ప్రకటించిన హైస్పీడ్ రైళ్ల పనులు వేగవంతం చేయాలని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ - పుణె, హైదరాబాద్ - బెంగళూరు, హైదరాబాద్ - చెన్నై కారిడార్లకు సంబంధించి, కేంద్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలపై రాష్ట్ర ప్రభుత్వం సమీక్షించి, కొన్ని మార్పులను సూచిస్తూ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిందని సీఎం తెలిపారు. ఈ మూడు కారిడార్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి భూ సేకరణ ప్రక్రియను ప్రారంభించలేదని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.కేంద్ర ప్రభుత్వం అలైన్‌మెంట్ ఆమోదించిన తర్వాత భూ సేకరణను ప్రారంభిస్తామని సీఎం స్పష్టం చేశారు. సాధ్యమైనంత త్వరగా అలైన్‌మెంట్ ప్రక్రియను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ రైలు భవన్‌లో రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో ముఖ్యమంత్రి శుక్రవారం సాయంత్రం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధికి అవసరమైన కీలక రైలు ప్రాజెక్టులపై కేంద్ర మంత్రితో సీఎం చర్చించారు. వికారాబాద్ ? కృష్ణా కొత్త రైలు మార్గాన్ని (130 కి.మీ.) వెంటనే మంజూరు చేయాలని సీఎం కోరారు. వికారాబాద్ జిల్లా టేకల్‌కోడ్ పరిసరాల్లో భారీ సున్నపురాయి నిక్షేపాలు బయటపడ్డాయని, దీంతో ఈ ప్రాంతాన్ని సిమెంట్, టెక్స్‌టైల్ హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని కేంద్ర మంత్రికి తెలియజేశారు. హైదరాబాద్ చుట్టూ సుమారు 360 కి.మీ మేర నిర్మిస్తున్న రీజినల్ రింగ్ రోడ్డు (ఖీఖీఖీ) పక్కనే రీజినల్ రింగ్ రైలును అలైన్‌మెంట్ చేయాలని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను సీఎం కోరారు. రీజినల్ రింగు రైలుతో పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. డోర్నకల్- గద్వాల్, కల్వకుర్తి ? మాచర్ల, కాచిగూడ కాచిగూడ ?జగ్గయ్యపేట (250 కి.మీ.), పటాన్‌చెరు ? ఆదిలాబాద్ (320 కి.మీ.), బోధన్ ? లాతూర్ (175 కి.మీ.), అక్కన్నపేట బైపాస్ లైన్ (8 కి.మీ.) మార్గాలను వెంటనే మంజూరు చేయాలని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. దక్షిణ మధ్య రైల్వే ప్రతిష్టాత్మకంగా చేపట్టదలచిన మెగా కోచింగ్, ఫ్రైట్ మెయింటెనెన్స్ డిపోను మహబూబాబాద్ సమీప అనంతారం గ్రామంలో ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి కోరారు. ఈ డిపో ఏర్పాటుకు అవసరమైన 409 ఎకరాల 1 గుంట భూమిని రైల్వే శాఖకు అప్పగించేందుకు ఇప్పటికే అంగీకరించిన విషయాన్ని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మెగా ఫ్రైట్ మెయింటెనెన్స్ డిపోకు త్వరగా అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు.ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీలు డాక్టర్ మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, అనిల్ కుమార్ యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ అద్వైత్ కుమార్ సింగ్ పాల్గొన్నారు.**కలిసింది**

బ్యాగు బ్రాండెడ్.. లోపల రేషన్ ?

ఏ డీలర్లు, వ్యాపారులు సంబంధం కలిగి ఉన్నారు? అన్న ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది.తనిఖీల్లో సేకరించిన నమూనాల ఫలితాలు, స్వాధీనం చేసుకున్న నిల్వలు, నమోదైన కేసులు, బాధ్యులపై తీసుకున్న చర్యలను అధికారులు బహిర్గతం చేయాలి. రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా సరఫరా గొలుసులో ప్రతి దశను పర్యవేక్షించాలి. బ్రాండెడ్ బియ్యం పేరుతో జరిగే మోసాలను అరికట్టేందుకు తూకాలు, ప్యాకింగ్ వివరాలు, బిల్లులు, నిల్వల రికార్డులను తనిఖీ చేయాలి. పేదల బియ్యం అక్రమ వ్యాపారానికి ముడిసరుకుగా మారకుండా ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

బియ్యం ధరల దోపిడీపై ఉక్కుపాదం

శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర మంత్రికి వివరించారు. శాఖ డైరెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్, ఇతర ఉన్నతాధికారులు చర్చల్లో పాల్గొన్నారు.సాధారణంగా ప్రజలు ఎక్కువగా వినియోగించే బీపీటీ బియ్యం ధర కిలో రూ.66కు మించకుండా నియంత్రణ చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. ఆర్‌ఎన్‌ఆర్ బియ్యం విషయంలో నాణ్యత, ఉత్పత్తి వ్యయాల్లో ఉన్న వ్యత్యాసాలను పరిగణనలోకి తీసుకుని ధరపై సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు."వినియోగదారులపై భారం మోపుతూ అధిక లాభాలు సంపాదించడాన్ని ప్రభుత్వం సహించదు. మార్కెట్‌లో ధరలు స్థిరపడే వరకు తనిఖీలు, అక్రమాల నిరోధక చర్యలు కొనసాగుతాయి" అని ఉత్తమ్ స్పష్టం చేశారు.అక్రమ నిల్వలు, అధిక ధరలకు విక్రయాలు తదితర అవకతవకల ఆరోపణలపై ఇప్పటికే బియ్యం వ్యాపారులపై 12 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఐదు శాఖల సమన్వయంతో దాడులు నిర్వహిస్తున్నామని చెప్పారు. పౌర సరఫరాలు, పోలీసు, జీఎస్టీ, తూనికలు?కొలతల శాఖలతోపాటు సంబంధిత ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలు ఈ చర్యల్లో పాల్గొంటున్నాయని వివరించారు.హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో టోకు, చిల్లర బియ్యం మార్కెట్లపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మంత్రి తెలిపారు. బేగంబజార్, నాంపల్లి, మహారాజ్‌గంజ్ సహా ప్రధాన టోకు వ్యాపార కేంద్రాల్లో విస్తృత తనిఖీలు చేపట్టినట్లు పేర్కొన్నారు. అక్రమాలను గుర్తించడం, అధిక ధరలను అరికట్టడం, వినియోగదారులకు ఊరట కల్పించడం లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా ఈ చర్యలు కొనసాగుతాయని చెప్పారు.రాష్ట్రంలో ప్రజల అవసరాలకు సరిపడా బియ్యం నిల్వలు ఉన్నాయని మంత్రి భరోసా ఇచ్చారు. కొరత వస్తుందనే ఆందోళనతో అవసరానికి మించి బియ్యం కొనుగోలు చేసి నిల్వ చేసుకోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.రేషన్ దుకాణాల ద్వారా ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న సన్నబియ్యాన్ని లబ్ధిదారులు వినియోగించుకోవాలని కోరారు. తెలంగాణ రైతులు పండించిన ధాన్యాన్ని రాష్ట్రంలోని మిల్లుల్లోనే బియ్యంగా మార్చి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందిస్తున్నామని వివరించారు.నిబంధనలకు అనుగుణంగా వ్యాపారం చేసే వ్యాపారులు, మిల్లర్లతో ప్రభుత్వం చర్చలు కొనసాగిస్తుందని ఉత్తమ్ తెలిపారు.

మరోమారు అధికారమివ్వండి

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఉత్తరప్రదేశ్‌లో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో కేంద్ర హోంమంత్రి అమిత్? షా శుక్రవారం కీలక వ్యాఖ్యలు చేశారు. యూపీలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అప్పుడు రాష్ట్రంలో ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)ని అమలు చేస్తామని ప్రకటించారు. ఇప్పటికే దీనిని అనేక రాష్ట్రాల్లో అమలు చేస్తున్నామని వెల్లడించారు.ప్రస్తుతం యూపీలో బీజేపీ ప్రభుత్వం సుస్థిరంగా ఉందని, దానిని ఎవరూ కదిలించలేరని అమిత్ షా అన్నారు. "యూపీలో బీజేపీ ప్రభుత్వం అంగదుడి పాదం (కదిలించలేనిది) లాంటిది. దీనిని ఎవరూ కదిలించలేరు. బీజేపీ మళ్లీ యూపీలో ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. ఇందులో ఎలాంటి సందేహం లేదు" అని పేర్కొన్నారు. మరోవైపు సమాజ్‌వాదీ పార్టీ ఇకపై యూపీలో అధికారంలోకి రాదని అమిత్ షా అన్నారు. "అఖిలేశ్ బాబూ, గుర్తుంచుకోండి. వచ్చే 30 ఏళ్ల వరకు మీ పార్టీ ఉత్తరప్రదేశ్?లో ప్రభుత్వం ఏర్పాటు చేయలేదు. ప్రజలు మీ మూడో తరానికి కూడా క్షమించరు" అని అన్నారు. ఈ సందర్భంగా 1990 అక్టోబర్? 30న అయోధ్యలో కరసేవకులపై పోలీసులు జరిపిన కాల్పులను అమిత్ షా ప్రస్తావించారు. అయోధ్య రామమందిర నిర్మాణం కోసం పోరాడుతున్న కరసేవకులపై సమాజ్?వాదీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పోలీసులు కాల్పులు జరిపారని ఆయన గుర్తు చేశారు. "నేను వారిని అడగాలని అనుకుంటున్నాను. ఏ ప్రాతిపదికన మీరు ప్రభుత్వం ఏర్పాటు గురించి మాట్లాడుతున్నారు? మీరు రామభక్తులపై కాల్పులకు ఆదేశించారు. కానీ మేము రామమందిరాన్ని నిర్మించాం" అని పేర్కొన్నారు.

రాహుల్ స్పందించకపోవడంతో.. సోనియాకు వ్యాపార సంఘాల లేఖ

న్యూఢిల్లీ(జనంసాక్షి):సీఈసీ రాజీనామా చేయాలనే డిమాండుతో నవంబర్ 1న మెగా ర్యాలీకి కాంగ్రెస్ పిలుపునిచ్చింది. పండగ వేళ ఈ ఆందోళన కారణంగా తాము నష్టపోతామని, ర్యాలీని వాయిదా వేసుకోవాలని దేశ రాజధానిలోని వ్యాపార సంఘాలు రాహుల్ గాంధీని పలుమార్లు అభ్యర్థించాయి. ఆయన నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో.. కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీకి 'ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ' లేఖ రాసింది. తమ వ్యాపారాలకు ఎంతో కీలకమైన దీపావళి పండగకు ముందు ర్యాలీలు నిర్వహించడం వల్ల దిల్లీలోని అనేక ప్రధాన మార్కెట్లలో వాణిజ్య కార్యకలాపాలకు అంతరాయం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. వ్యాపారంపైనే ఆధారపడుతున్న కుటుంబాల గురించి ఆలోచించి, కాంగ్రెస్ ర్యాలీని నవంబర్ 10 లేదా 11వ తేదీలకు వాయిదా వేయాలని సోనియాకు సీటీఐ విజ్ఞప్తి చేసింది. లేదంటే వాణిజ్య ప్రాంతాలకు దూరంగా నిరసన ప్రదేశాన్ని మార్చాలని లేఖలో కోరింది. 'మేము రాజకీయ ప్రదర్శనను వ్యతిరేకించట్లేదు. దానివల్ల పండగ సీజన్‌లో వ్యాపారాలు, జీవనోపాధిపై పడే ప్రభావంపైనే ఆందోళన వ్యక్తం చేస్తున్నాం. ఈ ర్యాలీ వల్ల ఇరుకైన దిల్లీ వీధుల్లోకి లక్షలమంది నిరసనకారులు, 20వేల వాహనాలు వచ్చే అవకాశం ఉంది. దీంతో ఆ చుట్టుపక్కల ఉన్న వాణిజ్య ప్రాంతాలలో దాదాపు రూ.12వేల కోట్ల విలువైన వ్యాపారం ప్రభావితం అవుతుంది' అని లేఖలో తెలిపారు.

దేశభక్తి గీతం.. కల్తీ రాగం!

- పుల్లారెడ్డి స్వీట్స్ తయారీ కేంద్రం లైసెన్స్ సస్పెన్షన్
- ముడిసరుకుల గదుల్లో ఎలుకల మలం, బొద్దింకలు ఉన్నట్లు అధికారుల గుర్తింపు
- రూ.15.03 లక్షల విలువైన 3,133 కిలోల ఆహార పదార్థాల ధ్వంసం
- నగరంలో పలు స్వీట్స్ తయారీ కేంద్రాలపై ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ దాడులు

హైదరాబాద్(జనంసాక్షి):

స్వచ్ఛతకు, నాణ్యతకు మారుపేరుగా ప్రచారం చేసుకున్న ప్రముఖ స్వీట్స్ సంస్థ పుల్లారెడ్డి స్వీట్స్ తయారీ కేంద్రం అధికారుల తనిఖీలతో వివాదంలో చిక్కుకుంది. దీపావళి పండుగకు ముందు హైదరాబాద్‌లో తెలంగాణ ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్, పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో సనత్‌నగర్‌లోని పుల్లారెడ్డి స్వీట్స్ ప్రధాన తయారీ కేంద్రంలో పలు అపరిశుభ్రత, ఆహార భద్రతా ఉల్లంఘనలు గుర్తించినట్లు సమాచారం. దీంతో ఆ కేంద్రం లైసెన్సును అధికారులు సస్పెండ్ చేశారు. దేశభక్తి గీతాలు, నాణ్యతపై ప్రచారంతో వినియోగదారుల్లో గుర్తింపు పొందిన సంస్థలోనే ఇలాంటి లోపాలు బయటపడటం చర్చనీయాంశంగా మారింది.ఎలుకల మలం.. బొద్దింకలుఅధికారుల తనిఖీల్లో ముడిసరుకుల నిల్వ గదుల్లో ఎలుకల మలం, బొద్దింకలు, ఈగలు ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం. కుళ్లిన కూరగాయలు, నాణ్యతపై సందేహాలున్న నూనెలు, గడువు ముగిసిన సరుకులు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారని వార్తా వివరాలు వెల్లడిస్తున్నాయి. వంటగది, పాత్రలు శుభ్రం చేసే ప్రాంతాల్లో అపరిశుభ్ర పరిస్థితులు కనిపించడంతోపాటు, సిబ్బంది గ్లౌజులు, హెయిర్ నెట్స్ వంటి కనీస రక్షణ చర్యలు పాటించలేదని గుర్తించినట్లు సమాచారం. లైసెన్స్ కేటగిరీకి సంబంధించి కూడా నిబంధనల ఉల్లంఘనలు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నట్లు తెలుస్తోంది.రూ.15 లక్షల విలువైన ఆహార పదార్థాలు ధ్వంసంఈ తయారీ కేంద్రం నుంచి సుమారు రూ.15.03 లక్షల విలువైన 3,133 కిలోల ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేసినట్లు సమాచారం. ఆహార తయారీలో పరిశుభ్రత, ముడిసరుకుల నాణ్యత, నిల్వ విధానాలు ఎంత ముఖ్యమో ఈ ఘటన మరోసారి స్పష్టం చేస్తోంది. అయితే స్వాధీనం చేసుకున్న పదార్థాలపై ప్రయోగశాల పరీక్షల ఫలితాలు, తదుపరి అధికారిక చర్యల వివరాలు పూర్తిగా వెల్లడికావాల్సి ఉంది.పలు సంస్థలపై చర్యలునగరంలోని 16 ఆహార తయారీ కేంద్రాలపై నిర్వహించిన తనిఖీల్లో ఆగ్రా మిఠాయి ఘర్, స్వీట్ వన్, బాలాజీ శ్రీ కిషన్ మిఠాయి భండార్, మినర్వా స్వీట్స్ సంస్థల లైసెన్సులను కూడా సస్పెండ్ చేసినట్లు సమాచారం. లైసెన్సులు లేని ఐదు దుకాణాలను మూసివేయగా, కరాచీ బేకరీ తిమ్మాపూర్ శాఖ సహా ఏడు సంస్థలకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు వార్తా కథనాలు పేర్కొన్నాయి. ఈ పరిణామాలు నగరంలోని ఆహార తయారీ, విక్రయ కేంద్రాల్లో నాణ్యతా ప్రమాణాల అమలుపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.ప్రచారంలో నాణ్యత.. ఆచరణలో ఏది?దేశభక్తి గీతాలు, స్వచ్ఛత, నాణ్యతకు సంబంధించిన ప్రచారం ద్వారా వినియోగదారుల నమ్మకాన్ని పొందిన సంస్థల్లోనే అపరిశుభ్రత బయటపడటం ఆందోళన కలిగిస్తోంది. పండుగల సమయంలో కుటుంబాల కోసం మిఠాయిలు కొనుగోలు చేసే ప్రజలు రుచి, ధరతోపాటు నాణ్యత, పరిశుభ్రతపైనా నమ్మకంతో ఉంటారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత వ్యాపార సంస్థలపై ఉంది.నిరంతర తనిఖీలేవీ?పండుగల ముందు మాత్రమే కాకుండా ఏడాది పొడవునా ఆహార తయారీ కేంద్రాలపై క్రమం తప్పని తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తనిఖీల్లో గుర్తించిన లోపాలు, ప్రయోగశాల పరీక్షల ఫలితాలు, లైసెన్సుల సస్పెన్షన్‌కు సంబంధించిన ఉత్తర్వులు, తదుపరి చర్యలను అధికారులు పారదర్శకంగా వెల్లడించాలి. ఉల్లంఘనలు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి.పుల్లారెడ్డి స్వీట్స్ యాజమాన్యం కూడా అధికారుల అభ్యంతరాలపై స్పందించి, లోపాలను సరిదిద్దేందుకు తీసుకుంటున్న చర్యలను వెల్లడించాల్సిన అవసరం ఉంది. ప్రజారోగ్యానికి సంబంధించిన అంశాల్లో ప్రచారం కంటే నాణ్యత, పరిశుభ్రత, జవాబుదారీతనమే కీలకం. వినియోగదారుల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలంటే ప్రతి ఆహార తయారీ కేంద్రం నిబంధనలను కచ్చితంగా పాటించాల్సిందే.

ఆహార తయారీ కేంద్రాల్లో భారీగా ఉల్లంఘనలు.. 'టీజీ సేఫ్' మెరుపు దాడులు

హైదరాబాద్(జనంసాక్షి):

తెలంగాణలో టీజీ సేఫ్ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. ఉమ్మడి వరంగల్, రంగారెడ్డి జిల్లాల్లో 10 ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేపట్టారు. 20 ఆహార తయారీ కేంద్రాల్లో భారీగా ఉల్లంఘనలు బయటపడ్డాయి. రూ.5.89 లక్షల విలువైన 5,555 కిలోల ఆహార పదార్థాలను సీజ్ చేసిన అధికారులు.. అనుమానాస్పద ఆహార కల్తీపై 21 నమూనాలు సేకరించారు9 ఆహార తయారీ సంస్థల లైసెన్సులు సస్పెండ్ చేశారు. తక్షణమే వ్యాపార కార్యకలాపాలు నిలిపివేయాలని ఆయా యాజమాన్యాలను ఆదేశించారు. మరో 9 సంస్థలకు షోకాజ్ నోటీసులు, 2 సంస్థలకు ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు జారీ చేశారు.

ఢిల్లీ మార్చ్‌కై కదలిరండి

ప్రజాస్వామ్యాన్ని ఎలా నాశనం చేస్తున్నారో వివరించేందుకు ఆదివారం 'చలో దిల్లీ' పేరుతో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు రాహుల్ చెప్పారు. ప్రతి ఒక్కరూ దిల్లీ మార్చ్‌లో పాల్గొనాలని కోరారు. "రాష్ట్రాల నుంచి వేలాది మంది ప్రజలు ఇక్కడికి వస్తుంటే అడ్డుకుంటున్నారు. ముఖ్యంగా ప్రజలు దిల్లీకి రాకుండా హోంమంత్రి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఉత్తర్? ప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, హరియాణా, తెలంగాణ, పంజాబ్ వంటి రాష్ట్రాల నుంచి మా పార్టీ కార్యకర్తలు, సామాన్యులు దిల్లీకి రాకుండా అడ్డుకుంటున్నారు. రామ్‌లీలా మైదానంలో ఏం జరుగుతుందో మీరే చూస్తారు. ఎంతమంది ఇక్కడికి వస్తారు, ఎంతమందిని వారు ఆపగలుగుతారో గమనించండి. అప్పుడు దేశంలో ఏం జరుగుతుందో మీకు అర్థమవుతుంది. ప్రజల్లో ఎంతో ఆవేశం ఉంది. తీవ్రమైన మానసిక వేదన అనుభవిస్తున్నారు. ఎందుకంటే లక్షలాది మంది ప్రజల ఓటు హక్కును కాలరాస్తున్నారు. అదానీ, అంబానీ, మోదీ, అమిత్ షా, భాగవత్‌ల కోసమే ప్రజల ఓట్లను కొల్లగొడుతున్నారు. మేం ముందే చెప్పినట్లు ఇదొక్కటే నిరసన. ప్రతిపక్షాలన్నీ ఇక్కడే ఉన్నాయి. ఎవరైనా నిరసన తెలపాలనుకుంటే రావచ్చు, ప్రతి ఒక్కరికీ స్వాగతం పలుకుతున్నాం." అని అన్నారు. వర్షంలో సీనియర్ నాయకులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతోనే అందరి అంగీకారంతో ఈ నిర్ణయం తీసుకున్నామని రాహుల్ గాంధీ చెప్పారు. "వర్షం పడుతున్నందున అందరి ఏకాభిప్రాయంతో నేటి కార్యక్రమాన్ని శనివారానికి వాయిదా వేశాము. సీనియర్ నాయకులు వర్షంలో కూర్చోవడం ఇబ్బందికరంగా ఉంటుందని భావించాం. అందుకే శనివారం అదే కార్యక్రమాన్ని నిర్వహిస్తాం. తర్వాతి రోజు రామ్‌లీలా మైదాన్‌కు ర్యాలీ నిర్వహిస్తున్నాం. ఈ కార్యక్రమానికి ప్రతిపక్షాలన్నీ, రాజకీయ, రాజకీయేతర, సామాజిక, సేవా రంగాలకు చెందిన వ్యక్తులు, పౌర సమాజ ప్రతినిధులు, పాత్రికేయులు ఇలా ఎవరైనా ఇందులో పాల్గొనవచ్చు. ఈ రెండు కార్యక్రమాలు కూడా నరేంద్ర మోదీ, అమిత్ షా, జ్ఞానేష్ కుమార్, ఎన్నికల సంఘంలోని వారి బృందం కలిసి భారత ప్రజాస్వామ్యాన్ని ఎలా నాశనం చేస్తున్నాయనే అంశంపైనే ఉన్నాయి." అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

ప్రజల మనోభావాలను ఈ ర్యాలీ ప్రతిబింబిస్తుంది

రామ్‌లీలా మైదాన్‌లో జరగనున్న 'ఇండీ' కూటమి ర్యాలీకి వచ్చే స్పందన ప్రజల మనోభావాలను ప్రతిబింబిస్తుందని రాహుల్ గాంధీ అన్నారు. లక్షలాది మంది ఓటర్ల హక్కులను కాలరాయడం, వారి ఓట్లను దొంగిలించడం వంటి చర్యల పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని ఆరోపించారు. ఎన్నికల్లో జరిగిన అక్రమాల వల్ల బీజేపీ నాయకత్వంతో పాటు పారిశ్రామికవేత్తలు గౌతమ్ అదానీ, ముఖేశ్? అంబానీలు లబ్ధి పొందుతున్నారని విమర్శించారు. ఇది వేర్వేరు నిరసనలు కావని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు ప్రతిపక్షాలన్నీ ఏకమై చేపట్టిన 'ఒకే నిరసన' అని స్పష్టం చేశారు. ప్రతిపక్షమంతా ఏకతాటిపై నిలుస్తోందని, నిరసన తెలపాలనుకునే వారందరినీ ఈ యాత్రలో చేరమని ఆయన ఆహ్వానించారు. రాజ్యాంగాన్ని, భారతదేశ భావనను, పౌరుల ఓటు హక్కును పరిరక్షించడానికే ప్రతిపక్షం ప్రయత్నిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్?తో పాటు టీఎంసీ, శివసేన, జేఎంఎం, ఆర్‌ఎస్‌పీ, సీపీఐ, ఆర్‌జేడీ, సీపీఐఎం(ఎల్) పార్టీల నేతలు పాల్గొన్నారు.

బడా పారిశ్రామికవేత్తలపై బక్క రైతుల పోరాటం

- బతుకునిచ్చే నేల...ప్రాణాలు నిలిపే నీరు...
- రెండు విషమైతే.. ప్రాణాలు నిలుపుకునేదెలా...
- నిద్ర మత్తులో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు..

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి: (జనంసాక్షి) : ఎక్కడ నిర్బంధం మొదలవుతుందో, ఎక్కడ అరాచకం ప్రారంభమవుతుందో, ఎక్కడ అణచివేత ఆరంభమవుతుందో, తిరుగుబాటు కూడా అక్కడి నుండే ప్రారంభమవుతుంది. ఈ తిరుగుబాటులో సాక్షాత్తు బక్కచిక్కిన రైతులు వారితో పాటు ఆగ్రామ ప్రజలు ఆ పాఠశాల విద్యార్థులు తిరగబడి ఉద్యమం చేసి ఎట్టకేలకు ఏసీ రూముల్లో కుర్చీలో కూర్చొని ఉన్న పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్‌తోపాటు ప్రభుత్వ అధికారులను స్వయంగా తమ గ్రామానికి రప్పించారు. వారికి కార్మిక సంఘాల మద్దతు లభించలేదు, కమ్యూనిస్టు పార్టీల మద్దతు అంతకంటే లేదు. ప్రతిపార్టీల సంఘీభావం లేదు చివరికి పాఠశాల విద్యార్థులు ప్రాణాలు పోతున్నాయంటూ ఆందోళన చేసిన ఏ విద్యార్థి సంఘం నాయకుల మద్దతు లేకుండానే ప్రభుత్వ శాఖ అధికారులను తమ గ్రామానికి రప్పించారు. ఆ గ్రామస్తులు, విద్యార్థులు తమ ప్రాణాలతో చెలగాటం ఆడుతూ కాలుష్యాన్ని వెదజల్లే ఐరన్ స్పాంజ్ పరిశ్రమలను వెంటనే మూసివేయాలని తమ పంట పొలాలను తాగు నీరును కలుషితం చేస్తూ.. తమ పాడి పశువుల చావుకు.. తమ అనారోగ్యాలకు కారణమవుతున్న ఓం శివ శక్తి కేడియా ఐరన్ స్పాంజ్ పరిశ్రమ, చుట్టూ అక్రమంగా వెలిసిన కాలుష్యకారక పరిశ్రమలను ఇక్కడి నుండి తొలగించాలని చుట్టుపక్కల గ్రామస్తులు ఆందోళనకు దిగారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం కందివనం, మొగిలిగిద్ద ఏలికట్ట గ్రామ శివార్లలో గల ఓం శివ శక్తి కేడియా ఐరన్ స్పాంజ్ పరిశ్రమతో పాటు చుట్టూ ప్రక్కల వెలసిన పరిశ్రమల నుండి వెలుబడుతున్న కాలుష్యం కారణంగా తమ పచ్చని పంట పొలాలు, తాగునీరు కలుషితమవడమే కాకుండా.. ఆ పరిశ్రమలు వదిలే కాలుష్యపు నీరు చుట్టుపక్కల గల చెరువులలో వెళ్లి కలవడం వల్ల తాగునీరు కలుషితమై తాము అనారోగ్యాల పాలవుతున్నామని, తమ పాడిపశులు మృత్యువాత పడుతున్నాయని.. ఆ పరిశ్రమ చుట్టుపక్కల గల గ్రామస్తులందరూ పరిశ్రమ ముందు టెంట్ వేసుకొని ఆందోళనకు దిగారు. తమ పంట పొలాలను.. తమ ఆరోగ్యాలను కాలుష్యపు బారిన పడవేస్తున్న పరిశ్రమ యజమాన్యంపై కఠిన చర్యలు తీసుకొని.. ఈ పరిశ్రమను మూసి వేయించాలని అప్పటిదాకా తాము ఆందోళన విరమించేది లేదని పట్టుబట్టారు. కాలుష్య కారక పరిశ్రమలను మూసి వేయకపోతే ఇక్కడి నుండి తొలగించకపోతే కదిలేది లేదని ఈ ప్రాంత ప్రజలు గ్రామస్తులు చిట్టచివరికి పాఠశాల విద్యార్థులు సైతం ఆందోళనకు దిగారు సంబంధిత శాఖ అధికారులు వచ్చేవరకు కదలి లేదని పట్టుబట్టారు దీంతో ఏసీ రూమ్స్ గదుల్లో ఉన్న పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ప్రభుత్వ అధికారులు దిగొచ్చారు.

రూ.25 కోట్ల డీడీ కట్టు.. లేదంటే ఇల్లు ముట్టడిస్తాం

- ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

జడ్చర్ల, అక్టోబర్ 30 (జనంసాక్షి): జడ్చర్ల అభివృద్ధి, వంద పడకల ఆసుపత్రి నిర్మాణంపై మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి చేస్తున్న విమర్శలపై ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పదేళ్ల పాలనలో ఏం అభివృద్ధి చేశారో చెప్పాకే మాట్లాడాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జడ్చర్ల అంబేద్కర్ కళాభవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడారు. ఆసుపత్రికి రోడ్డు సౌకర్యం కల్పించకపోవడం గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఆసుపత్రి అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్లపై ఆధారాలు చూపకుండా మాజీ ఎమ్మెల్యే సోదరి కోర్టు నుంచి స్టే తెచ్చారని, ఈ న్యాయపోరాటంలో తానే గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఎంపీడీవో కార్యాలయ స్థలంలో కాకుండా నాలాలో అనుమతులు లేకుండా ఆసుపత్రి నిర్మించడం వెనుక అంతర్యం ఏంటని ప్రశ్నించారు. ఆసుపత్రి భూమి విషయంలో 15 రోజుల్లో రూ. 25 కోట్ల డీడీ కట్టి చూపించాలని, లేదంటే కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి 16వ రోజు మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. 2014-23 మధ్య గత ప్రభుత్వం కేవలం రూ. 80 కోట్ల ఆర్అండ్‌బీ నిధులు తేగా, తాను మూడేళ్లలోనే రూ. 325 కోట్లు మంజూరు చేయించానని తెలిపారు. ఉద్దండాపూర్ నిర్వాసితులకు రూ. 650 కోట్లు, గ్రామాల అభివృద్ధికి ఎస్‌డీఎఫ్ నిధులు తెచ్చామన్నారు. జడ్చర్లకు ట్రిపుల్ ఐటీ, యంగ్ ఇండియా పాఠశాల, నవోదయ విద్యాలయం మంజూరు చేయించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. బాలానగర్-గంగాపూర్ రోడ్డు సమస్యను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నాణ్యతతో నిర్మించేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసి జడ్చర్లకు ఏం చేశారో ప్రజలకు చెప్పాలని నిలదీశారు. ప్రైవేట్ భవనంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు, పాత బజార్ అభివృద్ధి హామీలపై సమాధానం చెప్పాలన్నారు. అభివృద్ధి చేసేది ఎవరో, విమర్శలకే పరిమితమయ్యేది ఎవరో ప్రజలకే బాగా తెలుసని అనిరుధ్ రెడ్డి పేర్కొన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిఐడి అదుపులో ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు కాట్రగడ్డ సతీష్ కుమార్?



ములుగు ప్రతినిధి, అక్టోబర్30(జనం సాక్షి): అక్టోబర్ 25న నాటకీయ పరిణామాల మధ్య జరిగిన ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్ష ఎన్నికలలో ఏకగ్రీవంగా ఎన్నికైన 6 రోజులకే సిఐడి అధికారులు సతీష్ కుమార్ శుక్రవారం ఉదయం 7:45 నిమిషాలకు వారి స్వగృహం పసర గ్రామంలో అదుపులోకి తీసుకున్నారు. అక్టోబర్ 25న ఉదయం 7:30 గంటలకు ప్రాంతంలో రైతు ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్న బాదం ప్రవీణ్ కుమార్ తోపాటు మరో ఐదుగురు రైస్ మిల్లర్స్ ను సిఐడి అదుపులోకి తీసుకుంది. హన్మకొండ జిల్లాలోని శాయంపేట మండలం గట్లకానిపర్తిలోని శ్రీలక్ష్మీనర్సింహా, వినాయక ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లుల విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఇదివరకే ఆకస్మికంగా దాడులు చేశారు. 2025-26 ఖరీఫ్,రబీ సీజన్స్‌లో కేటాయించిన సీఎంఆర్ ధాన్యం నిల్వలపై ఫిజికల్‌గా తనిఖీలు చేపట్టారు.కేటాయించిన ధాన్యం, ఇప్పటి వరకు మిల్లరు ప్రభుత్వానికి పెట్టిన బియ్యం పోను ఉండాల్సిన ధాన్యం, ఇతర అంశాలను పరిశీలించినట్లు తెలిసింది. ఈ రెండు మిల్లుల్లో సుమారు రూ.9కోట్ల సీఎంఆర్ ధాన్యం మాయమైనట్లుగా గుర్తించారు. వీటిలో వినాయక ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లులో 2025-26 ఖరీఫ్, రబీ కలిపి మొత్తం రూ.4,61,29,753 విలువ చేసే 2079 మెట్రిక్ టన్నుల ధాన్యం,అలాగే లక్ష్మీనర్సింహా ఇండస్ట్రీ రైస్ మిల్లులో 2025-26 రబీకి సంబంధించి సుమారు రూ. 4,42,54,886 విలువ చేసే 1531.84 మెట్రిక్ టన్నుల ధాన్యం వ్యత్యాసం ఉన్నట్లు సివిల్ సప్లయ్ అధికారులు తెలిపారు. వీరిపై కేసులు నమోదు చేశామన్నారు. జిల్లాలోని పలు రైస్ మిల్లులపై విజిలెన్స్,ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు ఇటీవల విస్తృతతంగా తనిఖీలు చేపట్టాయి. ధాన్యం కొనుగోళ్లు,నిల్వల రికార్డులు, సీఎంఆర్ బియ్యం లెకలు, గోదాముల్లో నిల్వ ఉంచిన ధాన్యం వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాయి. రికార్డులకు భిన్నంగా నిల్వలు ఉన్నాయా, ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించారా అనే అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తున్నది. అలాగే జిల్లాలో 2010-11 నుంచి 2023-24 మధ్య కాలంలో ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి 10 రైస్ మిల్లులపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు సివిల్ సప్లయ్ అధికారులు తెలిపారు. ఈ మిల్లుల నుంచి సుమారు రూ.85,09,76,205 (25 శాతం జరిమానా కలుపుకొని) విలువ చేసే 75,302 మెట్రిక్ టన్నుల ధాన్యం బకాయి ఉన్నారని, అనేక సార్లు గడువు ఇచ్చినా మిల్లర్లు సీఎంఆర్ పెట్టలేదని, ఆయా రైస్ మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు అధికారులు చెప్పారు.

రామప్పలో రూ.13 కోట్లతో ఐలాండ్ అభివృద్ధి

- గ్రామాల్లో పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక యాప్
- ఉపాధి కోరిన వారందరికీ జాబ్‌కార్డులు.. పని కల్పించాలి
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క
- జంగాలపల్లి గుట్టను టేబుల్ మౌంటెన్ తరహాలో అభివృద్ధి చేసేందుకు పరిశీలన

ములుగు ప్రతినిధి, అక్టోబర్ 30(జనంసాక్షి) : ములుగు జిల్లాలోని జంగాల్‌పల్లి గుట్టను టేబుల్ మౌంటెన్ తరహాలో అభివృద్ధి చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నామని, రామప్పలో రూ.13 కోట్లతో ఐలాండ్ అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. జిల్లాలోని సహజ వనరులు, చారిత్రక ప్రదేశాలను పరిరక్షిస్తూ పర్యాటక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. శుక్రవారం ములుగు నూతన సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని తన స్టేట్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనాలతో కలిసి మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులు, చేపట్టాల్సిన పనులు, పర్యాటక అభివృద్ధి, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, గ్రామీణ ఉపాధి, తాగునీటి సరఫరా తదితర అంశాలపై సమీక్షించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను సత్వరమే ప్రారంభించి, కొనుగోళ్లలో ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అటవీ అనుమతుల కారణంగా ముందుకు సాగని మారుమూల గ్రామాల రహదారి పనులపై సమీక్షించారు. జిల్లా కలెక్టర్, జిల్లా అటవీ శాఖ అధికారి, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సమన్వయంతో జిల్లా స్థాయి కమిటీ ద్వారా అనుమతుల ప్రక్రియను చేపట్టాలని సూచించారు. పంచాయతీరాజ్ శాఖ, ఐటీడీఏ ద్వారా ఇప్పటికే మంజూరైన రహదారి పనులను పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం మీడియా ప్రతినిధులతో మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ, గత రెండు రోజులుగా ములుగు జిల్లాలో పర్యటిస్తూ వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడంతోపాటు జిల్లా అభివృద్ధిపై సమీక్షించినట్లు తెలిపారు. జంగాల్‌పల్లి గుట్టకు దక్షిణాఫ్రికాలోని కేప్‌టౌన్‌లో తాము సందర్శించిన టేబుల్ మౌంటెన్‌ను పోలిన ఆకృతి ఉందని వివరించారు. గుట్టపై నుంచి ఒకవైపు లక్నవరం, మరోవైపు రామప్ప కనిపించే మంచి వ్యూ పాయింట్ ఉన్నందున పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. మాస్టర్ ప్లాన్ రూపొందించేందుకు ఆర్కిటెక్ట్‌లు, ఇతర నిపుణులను ఆహ్వానించి సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నామని చెప్పారు. రామప్పలో రూ.13 కోట్లతో ఐలాండ్‌ను అభివృద్ధి చేస్తున్నామని, మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు కొత్త డిజైన్‌ను తీసుకొచ్చినట్లు తెలిపారు. జిల్లాలో వెలుగులోకి వస్తున్న గుహలు, గుట్టలు, కోటలు, పురాతన ఆలయాలను పరిరక్షిస్తామని పేర్కొన్నారు. పాత కట్టడాలకు భంగం కలగకుండా కొత్త నిర్మాణాలు చేపడతామని చెప్పారు. గ్రామ సమగ్ర ప్రణాళికలో భాగంగా గ్రామాల్లో ఉన్న వసతులు, చేపట్టాల్సిన పనులు, మంజూరైన పనుల పురోగతి తదితర వివరాలను తెలుసుకునేందుకు ప్రత్యేక యాప్‌ను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు. పనులకు సంబంధించిన ఫొటోలను అప్‌లోడ్ చేయడం ద్వారా వాటి స్థితిని పరిశీలించే అవకాశం ఉంటుందన్నారు. ఏ గ్రామానికి ఏ పనులు మంజూరయ్యాయి, ఎన్ని పూర్తయ్యాయి, మిగిలిన పనులు ఎందుకు పూర్తి కాలేదనే వివరాలను తాను, సంబంధిత కార్యదర్శి, కమిషనర్ నేరుగా తెలుసుకొని అధికారులతో మాట్లాడేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుందని వివరించారు. ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కోవడంతోపాటు గ్రామాల్లో ఆస్తులను సృష్టించేందుకు ఉపాధి హామీ పథకంలో 375 రకాల పనులు చేపట్టవచ్చని వివరించారు. వీవో భవనాలు, గ్రామపంచాయతీ భవనాలు, కమ్యూనిటీ హాళ్లు, గ్రంథాలయాలు, పాఠశాల భవనాలు, మరుగుదొడ్లు, వివాహ కార్యక్రమాల కోసం రూ.15 లక్షలతో భవనాలు నిర్మించుకోవచ్చని తెలిపారు. చెరువుల్లో పూడికతీత, డ్రైనేజీలు, సీసీ రోడ్లు, మట్టి రోడ్లు, వ్యవసాయ క్షేత్రాలకు రహదారులు వంటి పనులు చేపట్టవచ్చన్నారు. బీటీ రహదారులను కూడా రూ. 1,000 నుంచి రూ.1,500 కోట్లతో చేపట్టబోతున్నట్లు పేర్కొన్నారు. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ, మండల, జిల్లా స్థాయి అధికారులు ఉపాధి పనుల్లో చురుగ్గా వ్యవహరించాలని మంత్రి సూచించారు. గ్రామాల్లో పనులకు హాజరయ్యే కూలీల సంఖ్యను పెంచడం ద్వారా మరిన్ని మెటీరియల్ పనులు చేపట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రతి రెండు నెలలకు పనులను మార్చుకుంటూ, ఒక్కోసారి 30 నుంచి 40 రకాల పనులు చేపట్టాలని సర్పంచులకు సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు, టూరిజం నోడల్ అధికారి ధర్మ నాయక్, డీఆర్‌డీఓ రవీందర్, పంచాయతీరాజ్ ఈఈ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి రూ.84,790 కోట్లతో సమగ్ర కార్యాచరణ

- మూసీ పునరుజ్జీవనం, ట్రిపుల్ ఆర్, ఫ్యూచర్ సిటీతో హైదరాబాద్‌కు కొత్త రూపు
- రియల్ ఎస్టేట్ రంగం రాష్ట్ర ప్రగతిలో భాగస్వామి కావాలి
- నారెడ్కో తెలంగాణ ప్రాపర్టీ షోలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్ (జనంసాక్షి) : హైదరాబాద్ నగరాన్ని ప్రపంచంలోని అభివృద్ధి చెందిన నగరాలకు దీటుగా తీర్చిదిద్దడంతో పాటు, తెలంగాణను దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా నిలబెట్టడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. నగరాభివృద్ధి, రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల పాత్ర అత్యంత కీలకమని, ఈ రంగంలో ఉన్నవారిని కేవలం వ్యాపారవేత్తలుగా కాకుండా సంపద సృష్టికర్తలుగా ప్రభుత్వం గుర్తిస్తోందని అన్నారు. హైదరాబాద్ హైటెక్స్‌లో నిర్వహించిన నారెడ్కో తెలంగాణ ప్రాపర్టీ షో కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. హైదరాబాద్‌కు దేశంలోని ఇతర నగరాలతో పోలిస్తే అనేక అనుకూలతలు ఉన్నాయని, మోస్ట్ లివబుల్ సిటీగా గుర్తింపు పొందిన ఈ నగరంలో స్థిరపడేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజలు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వాలు కల్పించిన మౌలిక సదుపాయాలను మరింత విస్తరిస్తూ ప్రస్తుత ప్రభుత్వం నగరాభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయం, బీహెచ్ఈఎల్, బీడీఎల్, ఈసీఐఎల్, డీఆర్‌డీఓ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు, ఐఐటీ, ట్రిపుల్ ఐటీ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వంటి విద్యాసంస్థలు నగర అభివృద్ధికి బలమైన పునాదులుగా నిలిచాయని పేర్కొన్నారు.

హైదరాబాద్ నగరంతో పాటు పరిసర ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం సుమారు రూ.84,790 కోట్లతో భారీ కార్యాచరణను రూపొందించిందని ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ, హైదరాబాద్ గ్రోత్ కారిడార్, మెట్రో రైలు తదితర మౌలిక సదుపాయాల కోసం రూ.52,706 కోట్లు, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డుకు రూ.15,849 కోట్లు కేటాయించి పనులు ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.4 వేల కోట్లు, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.2,500 కోట్లు, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.2,163 కోట్లు, హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా రహదారుల అభివృద్ధికి రూ.500 కోట్లతో పనులు చేపడుతున్నట్లు వివరించారు.

మూసీ నదిని మురికి కూపం నుంచి స్వచ్ఛమైన జలాలతో ప్రవహించే నదిగా మార్చి హైదరాబాద్‌కు గొప్ప ఆస్తిగా తీర్చిదిద్దాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పమని భట్టి విక్రమార్క తెలిపారు. ప్రపంచంలోని అభివృద్ధి చెందిన నగరాలు తమ మధ్యలో ప్రవహించే నదులను శుద్ధి చేసి పర్యాటక, ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చేసుకున్నాయని గుర్తుచేశారు. సుమారు 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మించేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసిందని తెలిపారు. ఇందులో 15 వేల ఎకరాలను పచ్చదనం, విశాలమైన బహిరంగ ప్రదేశాల కోసం కేటాయించడం విశేషమన్నారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో రవాణా సదుపాయాలను మెరుగుపరిచేందుకు సుమారు రూ.93 వేల కోట్లతో రహదారుల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించినట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు భారీ మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు వెచ్చిస్తూనే మరోవైపు ప్రజా సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని భట్టి విక్రమార్క వివరించారు.

విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు డీఏ, డీఆర్ పెంపు

రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు చెల్లించే కరువు భత్యం (డీఏ), కరువు ఉపశమనం (డీఆర్) పెంపునకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విద్యుత్ సంస్థల సీఎండీలను ఆదేశించారు. ప్రస్తుతం 19.272 శాతంగా ఉన్న డీఏ, డీఆర్‌ను 2.543 శాతం పాయింట్లు పెంచి 21.815 శాతానికి సవరించనున్నారు. ఈ పెంపు 2026 జూలై 1వ తేదీ నుంచి వర్తించనుంది. కార్మిక శాఖ పరిధిలోని లేబర్ బ్యూరో ప్రకటించే అఖిల భారత ధరల సూచీ ఆధారంగా డీఏ, డీఆర్‌ను సవరిస్తారు. ధరల సూచీలో వచ్చే మార్పులకు అనుగుణంగా ప్రతి ఆరు నెలలకు ఒకసారి జనవరి, జూలై నెలల్లో ఈ సవరణ చేపడుతున్నారు. తాజాగా చేపట్టిన ప్రతిపాదిత పెంపునకు ఆమోదం లభించి అమల్లోకి వస్తే రాష్ట్రంలోని నాలుగు విద్యుత్ సంస్థల పరిధిలో 71,360 మంది ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు ప్రయోజనం చేకూరనుంది. ఇందుకోసం విద్యుత్ సంస్థలపై నెలకు సుమారు రూ.14.63 కోట్ల అదనపు ఆర్థిక భారం పడనుంది.

భర్త మరణాన్ని తట్టుకోలేక ఆగిన భార్య గుండె

వీపనగండ్ల, అక్టోబర్ 31(జనం సాక్షి) : వీపనగండ్ల మండల పరిధిలోని పుల్గర్ చర్ల గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. చాకలి నిరంజన్ గురువారం గుండెపోటుతో మృతి చెందగా,భర్త మరణాన్ని తట్టుకోలేక మరుసటి రోజే భార్య మొగులమ్మ గుండెపోటుతో కన్నుమూశారు. గ్రామస్తుల వివరాల ప్రకారం భర్త నిరంజన్ అంత్యక్రియలు ముగిసిన అనంతరం భార్య మొగులమ్మ మధ్యరాత్రి అనారోగ్యానికి గురి కావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన చికిత్స కోసం కర్నూల్ ఆస్పత్రికి తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మొగులమ్మ మృతి చెందడం జరిగింది. అన్యోన్య దాంపత్య జీవనం కొనసాగిస్తున్న భార్యాభర్తలిద్దరూ మృతి చెందడంతో కుమారుడు, కూతురు అనాథలుగా మిగిలిపోవడంతో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. దంపతులు వరుసగా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు విషాదంలో మునిగిపోయారు.

ఒక్కసారి నాటితే రెండేళ్లుగా కాయలే కాయలు

- నెన్నెలలో వింత వంకాయ చెట్టు!



నెన్నెల, అక్టోబర్ 30 (జనం సాక్షి) : నెన్నెలలో బీమారాజు రాజమల్లు తన నివాసంలో రెండేళ్ల క్రితం నాటిన వంకాయ మొక్క ప్రస్తుతం సుమారు 10 అడుగుల ఎత్తు పెరిగి చెట్టులా మారింది. సాధారణంగా వంకాయ మొక్కలు కొంతకాలం మాత్రమే దిగుబడి ఇచ్చి క్రమంగా ఎండిపోతుంటాయి. అయితే ఈ మొక్క మాత్రం రెండేళ్లుగా కాయలు కాస్తూ ప్రత్యేకతను చాటుకుంటోంది. ఇంటి ఆవరణలోనే పెంచిన ఈ చెట్టు నుంచి కుటుంబ అవసరాలకు సరిపడా వంకాయలు లభిస్తున్నాయి. తక్కువ స్థలంలో ఇంటి అవసరాలకు సరిపడా కూరగాయలు పండించుకోవచ్చనే విషయానికి ఈ చెట్టు ఒక ఉదాహరణగా నిలుస్తోంది. ఇంటి పరిసరాల్లో ఖాళీ స్థలం ఉన్నవారు వంకాయ, టమాటా, మిరప వంటి కూరగాయల మొక్కలను పెంచుకోవడం ద్వారా తాజా కూరగాయలను ఇంటి వద్దే పొందవచ్చని ఈ సందర్భంగా పలువురు అభిప్రాయపడుతున్నారు.

నిత్యం రసాయనాల లీకేజీ భయంలో బాటసారులు

రాజాపూర్, అక్టోబర్ 30(జనంసాక్షి) : మండల పరిధిలోని రంగారెడ్డిగూడ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న వివంత ల్యాబోరటరీస్ ప్రైవేటు లిమిటెడ్ పరిశ్రమలో పైప్ లైన్ పగిలి కెమికల్ పరిశ్రమ ప్రహారీ దాటి, రోడ్డు పైకి రావడం తో గిరిజన తాండాలకు, వ్యవసాయ పోలాలకు వెళ్ళే బాటసారులు భయాందోళన చెందుతున్నామని తెలిపారు. ఎందుకంటే ఆ కెమికల్ ఘాటైన వాసన రావడం, మట్టి మొత్తం నల్లగా మారటం చూసి తాండా వాసులు ఎప్పుడూ ఏదో ఒక కెమికల్ ఇలా రోడ్డు పైకి వస్తునే ఉంటుంది అని తెలిపారు.పక్కనే ఉన్న మిషన్ భగీరథ పైప్ లైన్ పైకి కూడా కెమికల్ వెల్లడంతో పైప్ లైన్ కూడా ధ్వంసం అయ్యే ప్రమాదం ఉంది. కెమికల్ రోడ్డు పైకి రావడంతో పరిశ్రమ కార్మికులు మట్టి కప్పడంతో భూమి, కాలుష్యం తో రంగు మారుతుంది. ఈ పరిశ్రమలో అనుమతులు లేకుండా కట్టడాలు ఇష్టారాజ్యంగా కడుతున్నారని, తెలువడంతో పంచాయతీ కార్యదర్శి ఒక గోదాం కడుతుంటే అనుమతులు తీసుకోవాలి అని ఫిబ్రవరి2026 లో నోటీసు ఇచ్చినా నేటి వరకు అనుమతి తీసుకోకుండా సగం వరకు కట్టారని పంచాయతీ కార్యదర్శి తెలిపారు. వివంత ల్యాబోరటరీస్ ప్రైవేటు లిమిటెడ్ లో అనుమతులు ఉన్న రసాయనాలే తయారు చేస్తున్నారా లేదా ఎలాంటి కెమికల్ తయారు చేస్తున్నారు. వాటి నుండి ప్రజలకు ఏమైనా హాని కలుగుతుందా లేదా అనే విషయాన్ని జిల్లా డ్రగ్ ఇన్స్పెక్టర్ తెలుపాలని చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వేధింపులను ప్రశ్నించండి.. వివక్షను ఎదిరించండి

- మహిళల భద్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి
- 'స్టాండ్ విత్ హర్' కార్యక్రమంలో డిజి చారు సిన్హా

హైదరాబాద్, అక్టోబరు 29 (జనంసాక్షి) : మహిళల భద్రత కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని మహిళా భద్రతా విభాగం డిజి చారు సిన్హా పేర్కొన్నారు. వేధింపులు, వివక్ష వంటి అనుచిత ప్రవర్తనను గుర్తించి ప్రశ్నించే ధైర్యాన్ని యువత అలవరచుకోవాలని సూచించారు. తెలంగాణ పోలీసు మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో గురువారం 'స్టాండ్ విత్ హర్' ప్రచార కార్యక్రమంలో భాగంగా రెండు రోజుల శిక్షకుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఉస్మానియా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య డాక్టర్ కుమార్ మొలుగారం, డిజి చారు సిన్హా, మహిళా భద్రతా విభాగం శిక్షణ, కంటెంట్ అభివృద్ధి విభాగం అధిపతి ఆసియా షెర్వాణి హాజరయ్యారు. రాష్ట్రంలోని వివిధ డిగ్రీ కళాశాలలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు చట్టాల అమలు ఒక్కటే సరిపోదని, ప్రజల ఆలోచనా విధానం, సామాజిక దృక్పథం, రోజువారీ ప్రవర్తనలోనూ మార్పు రావాలని డిజి పేర్కొన్నారు. ముఖ్యంగా యువకులు మహిళల పట్ల గౌరవభావంతో మెలగాలని, లింగ వివక్ష, వేధింపులను ప్రోత్సహించే ధోరణులను వ్యతిరేకించాలని సూచించారు. పరస్పర గౌరవం, సమ్మతి, వ్యక్తిగత హద్దులు, సమానత్వంపై అవగాహన పెంపొందించుకోవాలని చెప్పారు. విశ్వవిద్యాలయాల్లో అందరికీ సమాన అవకాశాలు కల్పిస్తూ సురక్షితమైన విద్యా వాతావరణాన్ని ఏర్పరచాల్సిన అవసరం ఉందని ఉపకులపతి కుమార్ మొలుగారం అన్నారు.

ఇంటి స్థలం ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినవి

ఖమ్మం జిల్లా వైరా టౌన్ & మండలం చెందిన నేను అనగా రాళ్ళబండి శ్రీదేవి W /0 రాళ్ళబండి రామకృష్ణ, ఇంటి స్థలం ఒరిజినల్ డాక్యుమెంట్ నెంబర్.4630/ ఆఫ్ 2022, నెంబర్లు గల ఇంటి స్థలం డాక్యుమెంట్, అక్టోబర్ 24 తేదీన నేరేడుచర్ల, విద్యానగర్ ఇంటి నుంచి ఎమ్మార్వో ఆఫీస్‌కు మోటార్ సైకిల్ పై వెళుతుండగా జారీ పోయినవి. దొరికిన వాళ్లు ఈ క్రింది ఫోన్ నెంబర్ కు. 8333884765 తెలుపగలరు.

పండుగ లాభాల తూకంలో ప్రజాస్వామ్య గళం!

సంపాదకీయం

దీపావళి ముందు ఢిల్లీ మార్కెట్లలో వ్యాపారం జోరందుకునే సమయం. అదే సమయంలో కాంగ్రెస్ నవంబర్ 1న మెగా ర్యాలీకి పిలుపునిచ్చింది. సీఈసీ రాజీనామా చేయాలన్న డిమాండుతో ఈ ర్యాలీ జరగనుంది. దీనిపై దేశ రాజధానిలోని వ్యాపార సంఘాలు రాహుల్ గాంధీని పలుమార్లు అభ్యర్థించాయి. పండుగ వేళ ర్యాలీ వల్ల ప్రధాన మార్కెట్లలో వాణిజ్య కార్యకలాపాలకు అంతరాయం కలిగి నష్టపోతామని, ర్యాలీని వాయిదా వేసుకోవాలని కోరాయి. అటునుంచి సానుకూల స్పందన రాకపోవడంతో ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ సోనియా గాంధీకి లేఖ రాసింది.

వ్యాపారుల ఆందోళనను పూర్తిగా కొట్టిపారేయలేం. పండుగ సీజన్ చిన్న వ్యాపారులకు ఏడాది సంపాదనలో పెద్ద భాగం. ట్రాఫిక్ ఆంక్షలు, మార్కెట్ల మూసివేతలు వారి జీవనోపాధిపై ప్రభావం చూపుతాయి. ఆ ఇబ్బందిని ఎత్తిచూపడం, అధికారులతో సమన్వయం కోరడం, రూట్ మార్పులు సూచించడం వారి హక్కు. కానీ ఆ ఆందోళన ఒక ప్రజాస్వామ్య నిరసననే వాయిదా వేయాలన్న డిమాండుగా మారినప్పుడు, ప్రశ్నలు తలెత్తక తప్పవు.

ఎన్నికల వ్యవస్థ విశ్వసనీయతపై ఒక ప్రతిపక్షం గళమెత్తడం ఏ వ్యాపారి దుకాణం తాళంలా చిన్న విషయం కాదు. ఓటు హక్కుకు, ఎన్నికల సంఘం నిష్పాక్షికతకు సంబంధించిన చర్చ ప్రతి పౌరుడినీ, ప్రతి వ్యాపారినీ కూడా తాకుతుంది. ఎన్నికల వ్యవస్థపై నమ్మకం సడలితే నష్టపోయేది ఏ ఒక్క పార్టీయో కాదు, మొత్తం ప్రజాస్వామ్యం. అలాంటి అంశంపై జరిగే ప్రజా ప్రదర్శనను పండుగ అమ్మకాల కోసం పక్కన పెట్టమనడం ప్రాధాన్యాల తారుమారు. అమ్మకాలు ఈ పండుగకు తప్పినా వచ్చే పండుగకు దొరుకుతాయి, కానీ నిరసనకు సరైన సమయం, ప్రజాభిప్రాయం ఏర్పడే క్షణం పోతే తిరిగిరావు.

ఇక్కడ మరో విషయం గమనించాలి. ప్రజా పోరాటాలు ఎప్పుడూ ఎవరికో ఒకరికి అసౌకర్యమే. రైతుల ఆందోళనలైనా, కార్మికుల సమ్మెలైనా, విద్యార్థుల ఉద్యమాలైనా, ఎప్పుడు చేసినా ఎవరి లాభానికో అడ్డంకిగానే కనిపిస్తాయి. అసౌకర్యాన్ని కారణంగా చూపి నిరసనలను వాయిదా వేయించే సంప్రదాయం మొదలైతే, గళం ఎత్తేవారికి సరైన సమయం ఎప్పటికీ రాదు. నిరసన హక్కు ప్రాథమిక హక్కు, అది ఎవరి గల్లా పెట్టె లెక్కలపైనా ఆధారపడదు.

అయితే బాధ్యత ఒక వైపే ఉండదు. ర్యాలీ నిర్వాహకులు కూడా పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకోవాలి. ట్రాఫిక్ మళ్లింపులు, భద్రత, మార్కెట్లకు కనీస ఇబ్బంది ఉండేలా పోలీసులు, నిర్వాహకులు, వ్యాపార ప్రతినిధులు కూర్చుని సమన్వయం చేసుకోవాలి. అసౌకర్యాన్ని తగ్గించే మార్గాలు వెతకడం వేరు, నిరసననే రద్దు చేయమనడం వేరు. వ్యాపారులు అడగాల్సింది మొదటిదే. లాభనష్టాల లెక్కలు ముఖ్యమే, కానీ అవి ప్రజాస్వామ్య హక్కులను తూకం వేసే తక్కెడ కాకూడదు. పండుగ వెలుగులు వ్యాపారాలకే కాదు, ప్రజాస్వామ్యానికీ కావాలి.

వ్యాపారాలు వెలుగొందాలి.. ప్రజాస్వామ్యమూ పరిఢవిల్లాలి. పండుగ లాభాల కోసం ప్రజాస్వామ్య గళం మూగబోకూడదు. ప్రజాస్వామ్య హక్కులకు గౌరవం దక్కి, స్వేచ్ఛా స్వరాలు వెలుగొందినప్పుడే అదే నిజమైన దీపావళి!

ప్రజాస్వామ్యం పరిఢవిల్లితేనే.. అదే నిజమైన దీపావళి!

ఉక్కిరిబిక్కిరి అవుతున్న హోటల్ కార్మికులు

కడుపు నింపే..అన్నం వండే చేతులే వేడికి,విషవాయువులకు బలవుతుంటే: ఆ కార్మికుల కన్నీళ్లను తుడిచేదెవరు?. నలుగురికి రుచికరమైన భోజనాన్ని అందించే హోటళ్లు, రెస్టారెంట్ల వంటశాలల్లో పనిచేసే కార్మికుల జీవితాలు మాత్రం పొగ, సెగ, ఉక్కపోత మధ్య ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. వినియోగదారులకు ఆతిథ్యాన్ని అందించే ఆహార పరిశ్రమలో పనిచేసే వీరికి కనీస ఆరోగ్య రక్షణ, సురక్షిత పని వాతావరణం, ఉద్యోగ భద్రత ఎంతవరకు అందుతున్నాయన్నది ప్రశ్నార్థకం. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న లక్షలాది మంది కార్మికుల కష్టాలు పాలకుల విధానాల్లోనూ, కార్మిక సంఘాల పోరాటాల్లోనూ తగిన ప్రాధాన్యం పొందకపోవడం విచారకరం. కార్మికుడి శ్రమతో వ్యాపారం అభివృద్ధి చెందుతున్నప్పుడు, అతడి ఆరోగ్యం క్షీణిస్తే బాధ్యత వహించేదెవరు? లాభాలకే పెద్దపీట వేసి, కార్మికుల ప్రాణాలను నిర్లక్ష్యం చేసే వ్యవస్థలో మార్పు రావాలి. హక్కులు కాగితాలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో అమలైనప్పుడే కార్మిక సంక్షేమానికి నిజమైన అర్థం చేకూరుతుంది.

అసంఘటిత కార్మికులకు అందని హక్కుల ఫలాలు!

మన దేశంలో కార్మికుల్లో అత్యధికులు అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్నారు. వివిధ అంచనాల ప్రకారం, దేశంలోని మొత్తం కార్మికుల్లో సుమారు 90 శాతానికి పైగా ఈ రంగంలోనే ఉపాధి పొందుతున్నారు. వీరిలో హోటళ్లు, రెస్టారెంట్లు, చిన్నపాటి ఆహార విక్రయ కేంద్రాలు, నిర్మాణ రంగం, వ్యవసాయం, గృహ కార్మికులు తదితర వర్గాలున్నారు. సంఘటిత రంగంలోని ఉద్యోగులకు కొంతమేరకు వేతన భద్రత, సెలవులు, ఆరోగ్య బీమా, పదవీ విరమణ ప్రయోజనాలు అందే అవకాశం ఉండగా, అసంఘటిత కార్మికుల్లో చాలామందికి అలాంటి సదుపాయాలు అందడం లేదు. కార్మికుల హక్కుల కోసం ట్రేడ్ యూనియన్లు ఎన్నో పోరాటాలు చేసి చట్టబద్ధమైన ప్రయోజనాలను సాధించాయి. అయితే, అసంఘటిత కార్మికులకు అదే స్థాయిలో ప్రాతినిధ్యం, సంఘటిత శక్తి, న్యాయపరమైన అండ లభించడం లేదు. సమస్యలు ఎదురైనప్పుడు తమ గోడును ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితులు అనేక చోట్ల కనిపిస్తున్నాయి. కనీస వేతనం, నిర్ణీత పని గంటలు, వారాంతపు సెలవు, ఓవర్‌టైమ్ వేతనం, ప్రసూతి ప్రయోజనాలు, ప్రమాద బీమా వంటి హక్కులు అందరికీ అందాల్సి ఉన్నా, వాటి అమలులో లోపాలు ఆందోళన కలిగిస్తున్నాయి.

కార్మికుల సంక్షేమం కోసం రూపొందించిన విధానాలు ప్రకటనలకే పరిమితం కాకూడదు. కేంద్ర ప్రభుత్వం 44 కేంద్ర కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా సమీకరించింది. వీటి ద్వారా కార్మికులకు ప్రయోజనాలు కలుగుతాయని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, కార్మిక సంఘాలు ఉద్యోగ భద్రత, సమ్మె హక్కు, సామాజిక భద్రత, యాజమాన్యాల బాధ్యతల విషయంలో ఆందోళనలు వ్యక్తం చేస్తున్నాయి. కార్మికుల హక్కులు క్షీణించకుండా, మారుతున్న చట్టాల అమలులో వారి ప్రయోజనాలకు తగిన రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది.

సామాజిక పునర్నిర్మాణం, కార్మిక సంక్షేమం అంటూ సదస్సులు నిర్వహించడం ఒక్కటే సరిపోదు. అసంఘటిత కార్మికుల సమస్యలను గుర్తించి, వారిని సంఘటితం చేసి, వారి హక్కుల సాధనకు క్షేత్రస్థాయిలో ఉద్యమించాలి. అప్పుడే కార్మిక లోకానికి నిజమైన న్యాయం జరుగుతుంది.

గ్యాస్ వంటశాలల్లో విషవాయువులు..సెగతో ఆరోగ్యానికి ముప్పు!

నగరాలు, పట్టణాల్లోని హోటళ్లు, రెస్టారెంట్ల వంటశాలల్లో పనిచేసే కార్మికులు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలపై వెలువడిన తాజా అధ్యయనం ఆందోళనకరమైన అంశాలను వెలుగులోకి తెచ్చింది. గ్యాస్ ఆధారిత వంట పరికరాల నుంచి వెలువడే వేడి, వాయు కాలుష్యం కార్మికుల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయని అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. తగిన వెంటిలేషన్, పొగను బయటకు పంపే వ్యవస్థలు ఉన్నచోట్ల కూడా కొన్ని వంటశాలల్లో ఉష్ణోగ్రతలు ప్రమాదకర స్థాయిలకు చేరుతున్నట్లు పరిశోధకులు గుర్తించారు.

పీఎస్ఈ హెల్తీ ఎనర్జీ, స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం, ఎన్‌వైయూ గ్రాస్‌మన్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ తదితర సంస్థల పరిశోధకులు వాణిజ్య వంటశాలల్లో ఉష్ణోగ్రతలు, గాలి నాణ్యతపై అధ్యయనాలు నిర్వహించారు. గ్యాస్ స్టవ్‌ల వినియోగం వల్ల నైట్రోజన్ డయాక్సైడ్ వంటి కాలుష్య కారకాలు గాలిలో పెరిగే ప్రమాదం ఉందని, కొన్ని పరిస్థితుల్లో బెంజీన్ వంటి హానికర పదార్థాల ఉనికి కూడా ఆందోళన కలిగిస్తుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా తగిన గాలి ప్రసరణ లేని వంటశాలల్లో పనిచేసే సిబ్బందికి ఈ ముప్పు మరింత ఎక్కువగా ఉంటుంది.

అధ్యయనంలో పరిశీలించిన వంటశాలల్లో అనేక చోట్ల ఉష్ణోగ్రతలు 32 డిగ్రీల సెల్సియస్‌ను దాటినట్లు, కొన్ని సందర్భాల్లో 37 డిగ్రీలకుపైగా నమోదైనట్లు నివేదికలు వెల్లడించాయి. మరికొన్ని చోట్ల ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలను దాటి, అత్యధికంగా 50 డిగ్రీలకు చేరినట్లు పేర్కొన్నాయి. వంటశాలల్లో మండే గ్యాస్ మంటలు, నిరంతర వంట ప్రక్రియ, వేడి గాలిని బయటకు పంపే వ్యవస్థల లోపాలు ఈ పరిస్థితులకు కారణమవుతున్నాయి. ఇటువంటి వాతావరణంలో గంటల తరబడి పనిచేయడం వల్ల శరీరంలో నీరు తగ్గిపోవడం, అలసట, తలతిరగడం, వేడి సంబంధిత అనారోగ్యాలు వచ్చే ప్రమాదం ఉంది.

నైట్రోజన్ డయాక్సైడ్ వంటి వాయు కాలుష్య కారకాలకు నిరంతరం గురికావడం వల్ల శ్వాసకోశ సమస్యలు, ఆస్తమా లక్షణాలు తీవ్రతరం కావచ్చు. దీర్ఘకాలికంగా కాలుష్యానికి గురికావడం ఆరోగ్యంపై మరింత ప్రభావం చూపే అవకాశం ఉంది. వంటశాలల్లో రద్దీ తక్కువగా ఉండే సమయాల్లోనూ కాలుష్యం అధికంగా ఉంటే, ఉదయం శుభ్రపరిచే సిబ్బంది, ముందస్తు తయారీ పనులు చేసే కార్మికులు కూడా ముప్పును ఎదుర్కొంటారు. ముడి ఇంధనాల వెలికితీత, సరఫరా నుంచి వాటిని వంటకు వినియోగించే దశ వరకు పర్యావరణంపై ప్రభావాలు ఉంటాయి. అయితే, వంటశాలల్లో గ్యాస్ వినియోగం వల్ల తలెత్తే ప్రమాదాలను తగ్గించడానికి సరైన ఎగ్జాస్ట్ వ్యవస్థలు, తగిన గాలి ప్రసరణ, పరికరాల నిర్వహణ అత్యవసరం. సాధ్యమైన చోట విద్యుత్ ఆధారిత వంట పరికరాల వినియోగం గ్యాస్ దహనం వల్ల వంటశాలలో నేరుగా వెలువడే కాలుష్యాన్ని తగ్గించగలదు. అందుకే విద్యుత్ వంటశాలల ఏర్పాటును ప్రోత్సహించడం, చిన్న హోటళ్లకు కూడా అందుబాటు ధరల్లో సురక్షిత సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడం అవసరం.

ప్రభుత్వాలు, కార్మిక సంఘాలు మేల్కొనాలి!

హోటల్ కార్మికుల సమస్యను కేవలం యజమానులు, ఉద్యోగుల మధ్య వ్యవహారంగా చూడకూడదు. ఇది ప్రజారోగ్యం, కార్మిక హక్కులు, సామాజిక న్యాయానికి సంబంధించిన అంశం. వినియోగదారులకు ఆహారం అందించే వ్యవస్థలో పనిచేసే కార్మికుల ఆరోగ్యమే ప్రమాదంలో పడితే, ఆహార పరిశ్రమ అభివృద్ధికి అర్థమేముంటుంది? వ్యాపార లాభాలు పెరుగుతున్న కొద్దీ కార్మికుల జీవన ప్రమాణాలు కూడా మెరుగుపడాలి. యజమానులు తమ బాధ్యతలను గుర్తించి, సురక్షిత వంటశాలలు, తగిన పని విరామాలు, పరిశుభ్రమైన తాగునీరు, గాలి ప్రసరణ, అవసరమైన రక్షణ పరికరాలు అందించాలి. ప్రభుత్వాలు హోటళ్లు, రెస్టారెంట్లలో కార్మిక చట్టాల అమలును పర్యవేక్షించాలి. వంటశాలల ఉష్ణోగ్రతలు, గాలి నాణ్యత, అగ్నిప్రమాద నివారణ ఏర్పాట్లు, విద్యుత్ పరికరాల భద్రతపై క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలి. ఉల్లంఘనలకు పాల్పడే యాజమాన్యాలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో చిన్న వ్యాపార సంస్థలు సురక్షిత పరికరాలను ఏర్పాటు చేసుకునేందుకు ఆర్థిక ప్రోత్సాహకాలు, సాంకేతిక సహాయం అందించాలి.

అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనాలు, ఆరోగ్య బీమా, ప్రమాద బీమా, సామాజిక భద్రత, ఉద్యోగ భద్రత కల్పించే చర్యలను వేగవంతం చేయాలి. కార్మికుల నమోదు, సంక్షేమ పథకాలపై అవగాహన, ఫిర్యాదుల పరిష్కారానికి సులభమైన వ్యవస్థలను ఏర్పాటు చేయాలి. హోటల్ కార్మికులు తమ సమస్యలను నిర్భయంగా వెల్లడించేందుకు ప్రత్యేక సహాయ కేంద్రాలు ఉపయోగపడతాయి. సంఘటిత కార్మిక సంఘాలు కూడా తమ పరిధిని విస్తరించి, అసంఘటిత కార్మికులను సంఘటితం చేయడానికి ముందుకు రావాలి. వారి సమస్యలను తమ పోరాటాల్లో భాగం చేసుకోవాలి. కార్మికుల మధ్య సంఘటిత, అసంఘటిత అనే అంతరాలు తగ్గినప్పుడే హక్కుల పరిరక్షణ ఉద్యమం బలపడుతుంది.

"చివరగా ఒక్క మాటలి"

కార్మికుడి శ్రమకు గౌరవం లేని సమాజంలో అభివృద్ధి అసంపూర్ణం. హోటల్ కార్మికులు చెమటోడ్చి వండిన ఆహారాన్ని ఆస్వాదించే సమాజం, వారి ఆరోగ్యం కోసం కూడా బాధ్యత తీసుకోవాలి. లాభాల కోసం కార్మికుల ప్రాణాలను పణంగా పెట్టే ధోరణికి స్వస్తి పలకాలి. ప్రభుత్వాలు చట్టాలను సమర్థంగా అమలు చేయాలి; యాజమాన్యాలు మానవీయ దృక్పథంతో వ్యవహరించాలి; కార్మిక సంఘాలు అండగా నిలవాలి. కార్మికుడి పొయ్యి వెలిగితేనే హోటల్ వ్యాపారం నడుస్తుంది.. కానీ ఆ పొయ్యి సెగకు కార్మికుడి ఆరోగ్యం బలికాకూడదు! కార్మికుల హక్కులను కాలరాసే విధానాలు, వారి ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేసే వ్యవస్థలు ఎవరికీ క్షేమకరం కావు. వారి జీవితాల్లో భద్రత, గౌరవం, భరోసా నింపడమే నిజమైన కార్మిక సంక్షేమం.

మేకిరి దామోదర్
సామాజిక విశ్లేషకులు
జిల్లా: వరంగల్
ఫోన్ : 9573 666650

అర్నాబ్ తుఫాన్ భీభత్సం - ప్రభుత్వ కర్తవ్యం!

సునామీలు, తుఫానులు, భూకంపాలు, కరోనాలు వంటి ప్రకృతి విపత్తులు ఎప్పుడొచ్చినా ప్రప్రథమంగా నష్టపోయేది.. రైతులు, రైతుకూలీలు, రోజువారి కూలీలు, డ్రైవర్లు, మత్స్యకారులు, పారిశుద్ధ్య కార్మికులు, వలస కార్మికులు, చిన్న వ్యాపారస్తులు.. మొత్తంగా పేద మధ్య తరగతి ప్రజలు, అసంఘటిత రంగ కార్మికులు!

ఇలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు, ప్రభుత్వాలు ముందుగా సహాయ సహకారాలను అందించాల్సింది, పేద మధ్యతరగతి ప్రజలకే! ఎందుకంటే గతంలో ప్రకృతి వైపరీత్యాల కారణంగా, యుద్ధాల కారణంగా, కరోనాల కారణంగా ప్రజల జీవన పరిస్థితులు దుర్భరమైనప్పుడు.. పేద ప్రజలు అన్నం దొరక్క ఆకలితో చచ్చిపోయారు. వైద్యం అందక అనారోగ్యంతో కన్నుమూసారు! కానీ సంపన్నులు మాత్రం ఆ సమయంలో రుచికరమైన కొత్త కొత్త వంటకాలతో, మందు పార్టీలతో ఎంజాయ్ చేస్తూ, రోజువారీ కంటే మరింత ఎక్కువ విలాసంగా గడిపారు! ఒక్క మాటలో చెప్పాలంటే ప్రకృతి విపత్తులు ఎప్పుడు సంభవించినా.. శ్రామిక ప్రజలు సర్వస్వం కోల్పోతే, సంపన్నులు మాత్రం కొంత లాభాలను మాత్రమే కోల్పోయారు! ఇప్పుడు అర్నాబ్ తుఫాన్ ఆంధ్రప్రదేశ్ ప్రజల జీవితాలను అతలాకుతలం చేస్తుంది. ముఖ్యంగా ఉభయ గోదావరి జిల్లాలో, కోస్తాంధ్రలో, ఉత్తరాంధ్రలో ఈ తుఫాను తీవ్రత నష్టము మరింత ఎక్కువగా ఉంది! లక్షలాది ఎకరాల పంట పొలాలు నీట మునిగాయి! చెట్లు కూలిపోయాయి! ఇళ్లు కూలిపోయాయి! రహదారులు తెగిపోయాయి! కరెంటు స్తంభాలు కూలిపోయి, విద్యుత్ వ్యవస్థలు పాడయ్యాయి! వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి! ఇచ్చాపురం దగ్గర జాతీయ రహదారిపై, బహుదానది ఉధృతంగా ప్రవహించడం వల్ల, పది కిలోమీటర్లకు పైగా, వాహనాలతో ట్రాఫిక్ స్తంభించిపోయింది! తిండి తిప్పలు లేక లారీ డ్రైవర్ల, క్లీనర్ల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది! మొత్తంగా ప్రజా వ్యవస్థలన్నీ, ఈ తుఫాను కారణంగా కుప్పకూలిపోయాయి! గతంలో దివిసీమ ఉప్పెన వచ్చి పెద్ద ఎత్తున ప్రాణనష్టం, ఆస్తి నష్టం సంభవించినప్పుడు.. సినిమా రంగానికి చెందిన ప్రముఖులు ప్రజలకు అండగా నిలబడ్డారు. ముఖ్యంగా ఘంటసాల వెంకటేశ్వర రావు గారు ముందు నడుస్తూ పాట పాడుతూ ఉంటే.. వెనక ఎన్టీఆర్, ఏఎన్ఆర్ గారు జోలె పట్టుకొని, ప్రజల సహాయనిధి కోసం విరాళాలు సేకరించారు. తమ వంతు బాధ్యతగా ప్రజలను ఆదుకున్నారు! కానీ నేడు చిత్రసీమలో ఆ పరిస్థితులు కానరావడం లేదు! ఏది ఏమైనా ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వ పాలనలోను భాగస్వామిగా కూడా ఉన్నందువల్ల, ఈ పరిస్థితుల్లో తుఫాను బాధిత ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి! పునరావాసాలు కల్పించాలి! న్యాయమైన నష్టపరిహారాలు ఇవ్వాలి! ముఖ్యంగా అనేక రకాలుగా ఆస్తి నష్టాలు, ప్రాణనష్టాలకు గురైన ప్రజలకు.. ప్రభుత్వ సహాయ సహకార కోసం, పునరావాసాల కోసం, నష్టపరిహారాల కోసం, మంచినీళ్లు ఆహారం కోసం.. ప్రజలను క్యూ లైన్ లో నిలబడే పరిస్థితులను ప్రభుత్వం కల్పించకూడదు! ప్రజల దగ్గరికి ప్రభుత్వ సిబ్బంది వెళ్లి, ప్రజలకు సహాయ సహకారాలు అందించాలి! ప్రస్తుత పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఎన్నికల అంశానికి అధిక ప్రాధాన్యతను ఇవ్వకుండా.. తుఫానులో నష్టపోయిన ప్రజలను ఆదుకోవడం మీదే ఎక్కువ దృష్టి పెట్టాలి!

- ముద్దగౌని సుభాష్
సామాజిక ఉద్యమ రచయిత

విశ్వవిద్యాలయాలకు డీప్‌ఫేక్ దెబ్బ

విద్యారంగంలో డిజిటల్ సాంకేతికత విస్తరిస్తున్న కొద్దీ విద్యార్థులకు అవకాశాలు పెరుగుతున్నాయి. అదే సమయంలో వారి వ్యక్తిగత సమాచారం, విద్యాసంబంధిత రికార్డులు, పరిశోధనల భద్రతకు ముప్పులు కూడా తీవ్రమవుతున్నాయి. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారంగా నకిలీ సందేశాలు, డీప్‌ఫేక్ వీడియోలు, ర్యాన్సమ్‌వేర్ దాడులు చేసే ప్రమాదం ఉందని కేంద్ర నిఘా సంస్థలు విశ్వవిద్యాలయాలను హెచ్చరించడం ఈ సమస్య తీవ్రతను తెలియజేస్తోంది. డిజిటల్ విద్యను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం, దాని భద్రతకు అవసరమైన వ్యవస్థలను కూడా సమర్థంగా నిర్మించాల్సిన బాధ్యత నుంచి తప్పించుకోలేదు.

ప్రవేశాలు, పరీక్షల నిర్వహణ, ఫలితాల ప్రకటన, ఫీజుల చెల్లింపులు, ఉపకార వేతనాలు, పరిశోధన పత్రాల సమర్పణ వంటి కార్యకలాపాలు ఇప్పుడు ఆన్‌లైన్ ద్వారానే సాగుతున్నాయి. వీటిలో భద్రపరిచే సమాచారం సైబర్ నేరగాళ్లకు విలువైన లక్ష్యం. విద్యార్థుల వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతాల సమాచారం, అధ్యాపకుల గుర్తింపు వివరాలు దొంగిలించి ఆర్థిక మోసాలకు పాల్పడవచ్చు. పరీక్షల ఫలితాలను మార్చడం, ప్రవేశాల ప్రక్రియను అడ్డుకోవడం, పరిశోధన సమాచారాన్ని తస్కరించడం ద్వారా విద్యాసంస్థల విశ్వసనీయతను దెబ్బతీయవచ్చు. ర్యాన్సమ్‌వేర్ దాడుల్లో వ్యవస్థల్లోని సమాచారాన్ని బంధించి, దాన్ని తిరిగి అందించడానికి నేరగాళ్లు డబ్బు డిమాండ్ చేస్తారు. అటువంటి సందర్భాల్లో విద్యా కార్యకలాపాలు నిలిచిపోవడమే కాకుండా, కీలక పరిశోధనలూ ప్రమాదంలో పడతాయి.

భారత కంప్యూటర్ అత్యవసర స్పందన బృందం (సీఈఆర్‌టీ-ఇన్) గణాంకాల ప్రకారం, దేశంలో నమోదైన సైబర్ భద్రతా ఘటనలు 2023లో 15,92,917 ఉండగా, 2024లో 20,41,360కు, 2025లో 29,44,248కు పెరిగాయి. అంటే మూడేళ్లలో నమోదైన ఘటనల సంఖ్య దాదాపు రెట్టింపైంది. ఈ గణాంకాలన్నీ విశ్వవిద్యాలయాలపై జరిగిన దాడులేనని భావించకూడదు. అయితే దేశవ్యాప్తంగా సైబర్ ముప్పులు ఎంత వేగంగా పెరుగుతున్నాయో ఇవి స్పష్టం చేస్తున్నాయి.

గతంలో భాషాపరమైన తప్పులు, అనుమానాస్పద లింకులు, విచిత్రమైన ఈ-మెయిళ్లు మోసాలను గుర్తించడానికి కొంతవరకు ఉపయోగపడేవి. ఇప్పుడు ఏఐ సాయంతో సంబంధిత వ్యక్తుల పేర్లు, హోదాలు, వారి కార్యకలాపాలకు అనుగుణంగా నమ్మదగిన సందేశాలను రూపొందించవచ్చు. డీప్‌ఫేక్ సాంకేతికతతో విశ్వవిద్యాలయ ఉపకులపతి, రిజిస్ట్రార్ లేదా ఆర్థిక విభాగాధిపతి మాట్లాడుతున్నట్లుగా నకిలీ వీడియోలు, స్వరాలను సృష్టించి అత్యవసరంగా డబ్బు బదిలీ చేయాలని ఆదేశించవచ్చు. అందువల్ల తెరపై కనిపించే దృశ్యాన్ని, వినిపించే స్వరాన్ని మాత్రమే నమ్మే రోజులు ముగిశాయి. మరో మార్గంలో ధ్రువీకరించుకోవడం తప్పనిసరి.

ఈ ముప్పులను ఎదుర్కోవడానికి పాస్‌వర్డ్ ఒక్కటే సరిపోదు. బహుళ అంచెల ధ్రువీకరణ, క్రమబద్ధమైన సాఫ్ట్‌వేర్ నవీకరణలు, పరిమిత అధికారాలతో

సమాచార ప్రాప్యత, క్రమం తప్పని భద్రతా తనిఖీలు అవసరం. ముఖ్యమైన రికార్డులకు ప్రత్యేకంగా భద్రపరిచిన బ్యాకప్‌లు ఉండాలి. దాడి జరిగినప్పుడు వాటి నుంచి సమాచారాన్ని తిరిగి పొందగలమో లేదో పరీక్షించాలి. సైబర్ ఘటనలను గుర్తించి స్పందించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలి. కేంద్ర విద్యాశాఖ, రాష్ట్ర ప్రభుత్వాలు, విశ్వవిద్యాలయాలు సమన్వయంతో పనిచేయాలి.

అయితే బాధ్యతను సాంకేతిక నిపుణులకో, విద్యార్థులకో పరిమితం చేయడం సరికాదు. నిధుల కొరతతో సైబర్ భద్రతను నిర్లక్ష్యం చేసే ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు ప్రత్యేక ఆర్థిక సహాయం అందించాలి. అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులకు క్రమం తప్పని శిక్షణ ఇవ్వాలి. నకిలీ సందేశాలను గుర్తించడం, అనుమానాస్పద లింకులను తెరవకపోవడం, వ్యక్తిగత సమాచారాన్ని బహిర్గతం చేయకపోవడం వంటి జాగ్రత్తలు విద్యా సంస్కృతిలో భాగం కావాలి. డేటా చోరీ జరిగినప్పుడు విద్యార్థులకు సమాచారం అందించడం, నష్టనివారణ చర్యలు చేపట్టడం, బాధ్యులను గుర్తించడం వంటి అంశాల్లో పారదర్శకత ఉండాలి.

విశ్వవిద్యాలయాలు కేవలం పట్టాలు ప్రదానం చేసే సంస్థలు కావు; దేశ భవిష్యత్తుకు అవసరమైన జ్ఞానాన్ని, పరిశోధనలను నిర్మించే కేంద్రాలు. వాటి సమాచార భద్రత దెబ్బతింటే వ్యక్తిగత గోప్యతతోపాటు విద్యా ప్రమాణాలు, పరిశోధనా స్వేచ్ఛ, ప్రజల విశ్వాసం కూడా దెబ్బతింటాయి. డిజిటల్ పరివర్తనను విజయంగా ప్రకటించుకోవాలంటే సాంకేతిక సదుపాయాల విస్తరణతోపాటు వాటి రక్షణకూ సమాన ప్రాధాన్యం ఇవ్వాలి. సైబర్ భద్రతను అదనపు ఖర్చుగా కాకుండా విద్యా వ్యవస్థ మనుగడకు అవసరమైన పెట్టుబడిగా ప్రభుత్వం, విశ్వవిద్యాలయాలు గుర్తించినప్పుడే ఈ ముప్పును సమర్థంగా ఎదుర్కోగలవు.

డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

ఆధిపత్య రాజకీయాల మధ్య ప్రజాస్వామ్య పునర్నిర్మాణం!

"విద్యార్థి ఉద్యమాలు, భావప్రకటన స్వేచ్ఛ, ప్రజాస్వామ్య సంభాషణల నూతన ఆవిష్కరణ"

ప్రజాస్వామ్యం అనేది కేవలం ఎన్నికల ద్వారా ప్రభుత్వాలను ఎన్నుకునే రాజకీయ ప్రక్రియ మాత్రమే కాదు. అది ఒక సమాజం ఆలోచించే విధానం, భిన్నమైన అభిప్రాయాలను స్వీకరించే సంస్కారం, ప్రశ్నలను ఎదుర్కొనే పరిణతి, విభేదాలను గౌరవించే సామాజిక లక్షణం. ప్రజాస్వామ్యానికి అసలైన అర్థం అధికారంలో ఎవరు ఉన్నారనే అంశంలో మాత్రమే ఉండదు. అధికారాన్ని ప్రశ్నించే హక్కు ప్రజలకు ఎంతవరకు ఉందనే అంశంలో కూడా దాని నిజమైన స్వరూపం ప్రతిబింబిస్తుంది. అయితే సమకాలీన రాజకీయ పరిణామాలను పరిశీలిస్తే ప్రజాస్వామ్య వ్యవస్థలో మెజారిటీ ఆధిపత్య భావజాలం క్రమంగా బలపడుతున్నట్లు కనిపిస్తోంది. మెజారిటీకి లభించిన సంఖ్యాబలాన్ని సమాజంలోని అన్ని వర్గాల ఆలోచనలు, అభిప్రాయాలు, ఆకాంక్షలను నిర్ణయించే అధికారంగా భావించడం ప్రజాస్వామ్యానికి ఎదురవుతున్న ప్రధాన సవాలు.

మెజారిటీ పాలన ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక ప్రాథమిక సూత్రమే అయినప్పటికీ, మెజారిటీ అభిప్రాయమే అంతిమ సత్యమని భావించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. సంఖ్యాబలం ఆధారంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవచ్చు, కానీ సంఖ్యాబలం ఆధారంగా సమాజంలోని ఆలోచనా వైవిధ్యాన్ని నియంత్రించలేరు. ప్రజాస్వామ్యం మెజారిటీకి అధికారాన్ని కల్పించడంతోపాటు మైనారిటీలకు భద్రతను, భిన్నాభిప్రాయాలకు స్వేచ్ఛను, వ్యక్తులకు గౌరవాన్ని కల్పించాలి. ఈ సమతుల్యత దెబ్బతిన్నప్పుడు ప్రజాస్వామ్యం తన అంతర్గత జీవశక్తిని కోల్పోయే ప్రమాదం ఉంది.

ప్రస్తుత రాజకీయ వాతావరణంలో కనిపిస్తున్న మొదటి సమస్య ఆలోచనల ఏకరూపత. ఒక నిర్దిష్ట రాజకీయ భావజాలం, ఒకే విధమైన సామాజిక దృక్పథం, ఒకే రకమైన జాతీయ లేదా సాంస్కృతిక నిర్వచనం సమాజంపై ఆధిపత్యం చెలాయించడానికి ప్రయత్నించినప్పుడు భిన్నమైన ఆలోచనలకు స్థలం తగ్గిపోతుంది. ప్రశ్నించడం అనుమానాస్పదంగా మారుతుంది. విమర్శించడం వ్యతిరేకతగా పరిగణించబడుతుంది. ప్రత్యామ్నాయ అభిప్రాయాలను వ్యక్తం చేయడం రాజకీయ విధేయతకు సంబంధించిన అంశంగా మారుతుంది. ఫలితంగా స్వతంత్రంగా ఆలోచించే వ్యక్తుల సంఖ్య తగ్గి, ఒకే విధమైన ఆలోచనా ధోరణి సమాజంలో బలపడుతుంది. ఇది ప్రజాస్వామ్యానికి అవసరమైన మేధో వైవిధ్యాన్ని బలహీనపరుస్తుంది.

రెండవ సమస్య రాజకీయ కథనాల సంకుచితత్వం. రాజకీయాలను అధికారపక్షం, ప్రతిపక్షం అనే రెండు వర్గాల మధ్య జరిగే పోరాటంగా మాత్రమే చిత్రీకరించడం వల్ల సమాజంలోని అనేక సంక్లిష్టమైన సమస్యలు చర్చకు దూరమవుతున్నాయి. రైతుల జీవన పరిస్థితులు, విద్యార్థుల భవిష్యత్తు, నిరుద్యోగం, సామాజిక అసమానతలు, పర్యావరణ సంక్షోభం, వ్యక్తిగత స్వేచ్ఛ, సాంస్కృతిక వైవిధ్యం వంటి అంశాలకు రాజకీయ పార్టీల మధ్య జరిగే ఆధిపత్య పోరాటాలకంటే విస్తృతమైన చర్చ అవసరం. కానీ రాజకీయ చర్చలు పార్టీ ప్రయోజనాలు, ఎన్నికల లెక్కలు, అధికార సమీకరణాల చుట్టూ తిరిగినప్పుడు ప్రజాస్వామ్యంలోని అసలు సామాజిక సమస్యలు మరుగున పడతాయి. ఈ పరిస్థితిని అధిగమించడానికి ప్రజాస్వామ్యాన్ని తిరిగి ప్రజల అనుభవాల నుంచి అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో విద్యార్థి ఉద్యమాలు ఒక ముఖ్యమైన సామాజిక, రాజకీయ అధ్యయన అంశంగా నిలుస్తున్నాయి. విద్యార్థి ఉద్యమాల ప్రాధాన్యం కేవలం ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించడంలోనో, రాజకీయ నిర్ణయాలపై నిరసన వ్యక్తం చేయడంలోనో పరిమితం కాదు. సమాజంలో ప్రశ్నించే సంస్కృతిని పునరుద్ధరించడం, కొత్త ఆలోచనలకు వేదిక కల్పించడం, భిన్నమైన వ్యక్తులను ఒక సాధారణ సమస్య చుట్టూ సమీకరించడం వంటి లక్షణాలు వాటికి ప్రత్యేకతను ఇస్తాయి. ముఖ్యంగా విద్యార్థులు ఒక నిర్దిష్ట సిద్ధాంతానికి ముందుగానే కట్టుబడకుండా, ఒక సమస్యను అర్థం చేసుకోవడానికి, దాని పూర్వాపరాలను తెలుసుకోవడానికి, ఇతరుల అభిప్రాయాలను వినడానికి ఉద్యమాల్లో పాల్గొన్నప్పుడు ప్రజాస్వామ్యానికి ఒక కొత్త అనుభవం ఏర్పడుతుంది.

ఒక విద్యార్థి ఉద్యమంలో పాల్గొన్న యువతి అనుభవాన్ని పరిశీలిస్తే ఈ అంశం మరింత స్పష్టమవుతుంది. తనకు ఉద్యమానికి సంబంధించిన అన్ని విషయాలు ముందుగానే తెలియవని, మరింత తెలుసుకోవాలనే ఆసక్తితోనే అక్కడికి వెళ్లానని ఆమె తెలిపింది. అక్కడ తనలాంటి అన్వేషణాత్మక ఆలోచనలు కలిగిన అనేకమంది ఉన్నారని గుర్తించానని పేర్కొంది. ఈ అనుభవంలో ముఖ్యమైనది ఒకే అభిప్రాయాన్ని కలిగి ఉండటం కాదు. పరస్పరం భిన్నమైన అభిప్రాయాలు ఉన్నప్పటికీ ఒకరినొకరు వినడానికి, అర్థం చేసుకోవడానికి సిద్ధంగా ఉండటం. తెలియని విషయాలను తెలుసుకోవాలనే ఆసక్తి, సందేహాలను వ్యక్తం చేసే స్వేచ్ఛ, కొత్త ఆలోచనలను స్వీకరించే సంసిద్ధత ఉద్యమానికి ప్రజాస్వామిక స్వరూపాన్ని కల్పిస్తాయి.

ఇక్కడ గమనించాల్సిన అంశం ఉద్యమంలో కనిపించే ప్రయోగాత్మక స్వభావం. ప్రతి ఉద్యమం ఒక నిర్దిష్ట సిద్ధాంతంతోనే ప్రారంభం కావాల్సిన అవసరం లేదు. కొన్నిసార్లు ఒక సాధారణ సమస్యే అనేకమంది వ్యక్తులను ఒకచోటికి తీసుకువస్తుంది.

డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

మిగితా తరువాయి సంచికలో..

రాజ్యాంగ హక్కులను కాలరాస్తే సహించం

- ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కొంకాని విజయ్ కుమార్
- ఎస్సీ, ఎస్టీ ప్రజాప్రతినిధులను గౌరవించాలి
- మంచాలలో పౌర హక్కుల అవగాహన సదస్సు

రంగారెడ్డి, అక్టోబర్ 30 (జనంసాక్షి) : భారత రాజ్యాంగ హక్కులను కాలరాస్తే సహించబోమ్మని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కొంకాని విజయ్ కుమార్ అన్నారు. ఎస్సీ, ఎస్టీ ప్రజాప్రతినిధులను గౌరవించాలన్నారు. మంచాలలో మంచాల మండల తాసిల్దార్ ప్రసాద్ రావు ఆధ్వర్యంలో గురువారం మంచాల గ్రామంలో పౌర హక్కుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ కల్పించిన ఓటు హక్కు వల్లే నేడు సామాన్యులు కూడా ప్రజాప్రతినిధులుగా ఎదగగలుగుతున్నారని పేర్కొన్నారు. స్త్రీ, పురుష భేదం లేకుండా మహిళలకు సమాన హక్కులు కల్పించడం వల్లే మంచాల గ్రామ సర్పంచ్‌గా ఏర్పుల మానస వినయ్ విజయం సాధించారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సర్పంచులుగా ఎన్నికైన గ్రామాల్లో ఇతర కులస్తుల పెత్తనం చెల్లదని హెచ్చరించారు. రిజర్వేషన్ ద్వారా

గెలిచిన ప్రజాప్రతినిధులకే పూర్తి అధికారాలు స్పష్టం చేశారు. వారిని ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమల్లో పారిశుద్ధ్య కార్మికులకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఎస్సీ, ఎస్టీలపై కుల వివక్ష చూపితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలో అంబేద్కర్ భవన్ నిర్మిస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు నెరవేరలేదని తెలిపారు. ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేస్తున్న నేపథ్యంలో... నిరుపేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు పట్టణాల్లోని కార్పొరేట్ కోచింగ్ సెంటర్లకు వేలకు వేలు ఫీజులు చెల్లించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి కోసం మంచాల మండలంలో వెంటనే 'అంబేద్కర్ భవన్' నిర్మించి, అందులో 'స్టడీ సర్కిల్'తో పాటు సమాజహిత సమావేశాలకు వేదికగా తీర్చిదిద్దాలని తాసిల్దార్‌ను కోరారు. ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా అధికారులను, తమను సంప్రదించవచ్చని సూచించారు. అనంతరం గ్రామ సర్పంచ్ ఏర్పుల మానస వినయ్ మాట్లాడుతూ... సమాజంలో మార్పునకు, ప్రగతికి విద్యే మూలస్తంభమని, చదువు ద్వారానే ఏదైనా సాధించవచ్చని పిలుపునిచ్చారు.

అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం

ఎంతో ప్రాధాన్యత కలిగిన ఈ పౌర హక్కుల అవగాహన సదస్సుకు మండల ఎంపీడీవో, హౌసింగ్ ఏఈ, ఎలక్ట్రికల్ ఏఈ, ఏపీఓలతో పాటు పలు శాఖల అధికారులు గైర్హాజరు కావడంపై విజయ్ కుమార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో జరిగిన సదస్సులకు కూడా ఇదే తరహాలో అధికారులు ముఖం చాటేశారని ఆరోపించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న సదరు అధికారులపై ఉన్నతాధికారులు వెంటనే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, పోలీస్ ఎస్సై, సోషల్ వెల్ఫేర్ హాస్టల్ వార్డెన్, జిపిఓ, వివిధ మండల అధికారులు, గ్రామ పెద్దలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదును వేగవంతం చేయాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశం

అల్వాల్, అక్టోబరు 30 (జనంసాక్షి) : ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ సర్కిల్ నంబర్ 2 పరిధిలో జరుగుతున్న పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆయన జిల్లా కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటరు నమోదు పురోగతి, దరఖాస్తుల స్వీకరణ, ఇతర అంశాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అర్హులైన పట్టభద్రులందరికీ ఓటరు నమోదుపై అవగాహన కల్పించి, ప్రక్రియను నిర్దేశిత సమయంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్యాంప్రసాద్, అల్వాల్ తహసీల్దార్ రాములు, అల్వాల్ డిప్యూటీ కమిషనర్ భోగేశ్వరులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

వోక్సెన్ యూనివర్సిటీలో క్రీడా పోటీల ఏర్పాట్ల పరిశీలన

- క్రీడాకారులకు ఇబ్బందులు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి
- ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్

సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 30 (జనం సాక్షి) : కంకోల్‌లోని వోక్సెన్ యూనివర్సిటీలో నవంబర్ 14, 15, 16 తేదీల్లో నిర్వహించనున్న జాతీయ స్థాయి క్రీడా పోటీల ఏర్పాట్లను ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్‌తో కలిసి యూనివర్సిటీని సందర్శించి క్రీడా మైదానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... జాతీయ స్థాయి క్రీడా పోటీలను వోక్సెన్ యూనివర్సిటీలో నిర్వహించడం అభినందనీయమన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వసతి, భోజనం, రవాణా తదితర సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఏర్పాట్లలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. క్రీడాకారులకు కల్పిస్తున్న సౌకర్యాలు, పూర్తిచేసిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాండు, డీఎస్పీ సత్తయ్య గౌడ్, ఎంపీడీవో అంజయ్య, ఉప తహసీల్దార్ ప్రదీప్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలి

- పీఆర్సీ ప్రకటించాలి
- పెండింగ్ బిల్లులు చెల్లించాలి
- తపస్ సంఘం రాష్ట్ర కార్యదర్శి రమేష్

సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 30 (జనం సాక్షి) : సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర కార్యదర్శి రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తపస్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అమీన్‌పూర్, ఆర్‌సీపురం మండలాల్లోని వివిధ పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులకు సభ్యత్వం నమోదు చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నింటినీ ఒకేసారి చెల్లించాలని, పీఆర్సీని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా జీవో 25ను సవరించి, ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు దత్తాత్రి, పటాన్‌చెరు డివిజన్ అధ్యక్షుడు పెంట్యానాయక్, జహీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు శ్రీపాల్, మండల ప్రధాన కార్యదర్శి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సామ రామ్మోహన్‌రెడ్డి గెలుపే లక్ష్యం

- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- పట్టభద్రులందరినీ ఓటర్లుగా నమోదు చేయించాలి
- ఇబ్రహీంపట్నం అగ్రస్థానంలో ఉండాలి
- కాంగ్రెస్ ముఖ్యనాయకుల సమావేశం

రంగారెడ్డి, అక్టోబర్ 29 (జనంసాక్షి) : రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కంకణబద్ధులై పనిచేయాలని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి పిలుపునిచ్చారు. గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు ప్రక్రియపై శుక్రవారం ఇబ్రహీంపట్నంలోని ప్రజాభవన్‌లో 'ఏ' బ్లాక్ ముఖ్యనాయకులతో ఆయన ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...

పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియకు గడువు సమీపిస్తున్నందున, అర్హులైన ప్రతీ ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించే బాధ్యతను నాయకులు తీసుకోలని సూచించారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు జరిగిన ఎన్‌రోల్‌మెంట్ వివరాలను నాయకులను అడిగి తెలుసుకున్న ఆయన, ఓటర్ల నమోదు ప్రాధాన్యత, అర్హతలు మరియు నమోదు విధానంపై పలు సూచనలు చేశారు. ఓటరు నమోదుకు మరో వారం మాత్రమే సమయం ఉన్నందున గ్రామాలు, పట్టణాల వారీగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించు కోవాలన్నారు. అర్హులైన పట్టభద్రుల వద్దకు నేరుగా వెళ్లి ఫారమ్‌లు పూర్తి చేయించి, నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఓటర్ల నమోదుతో పాటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తిరుగులేని మెజార్టీ అందించడంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలవాలని సూచించారు. నాయకులందరూ సమన్వయంతో పనిచేసి, కాంగ్రెస్ అభ్యర్థి సామ రామ్మోహన్‌రెడ్డి విజయంలో కీలక పాత్ర పోషించాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ 'ఏ' బ్లాక్ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అర్హులైన రైతులందరికీ న్యాయం చేస్తాం

యాచారం, అక్టోబర్ 30 (జనం సాక్షి) : అర్హులైన ప్రతీ రైతుకు నష్టపరిహారం ఇప్పించడానికి తన వంతుగా పూర్తి స్థాయిలో కృషి చేస్తానని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం యాచారం మండల పరిధిలోని మొండి గౌరెల్లి గ్రామం లోని సర్వే నెంబర్లు 127, 19, 68 ల పరిధిలోని భూములకు సంబంధించి మొదటి విడత కింద ఎంపిక చేసిన 22 మంది రైతులకు దాదాపు 8 కోట్ల రూపాయలకు పైగా విలువైన నష్టపరిహారం చెక్కులను ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. రైతాంగ సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. భూములు కోల్పోయిన రైతుల బాధలను తాము అర్థం చేసుకున్నామని, అర్హత కలిగిన ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగకుండా చివరి దాకా పోరాడి పరిహారం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. మిగిలిన రైతులకు కూడా త్వరలోనే తదుపరి విడతల్లో పరిహారం అందించేందుకు అధికారులు చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్డీఓ శ్రీనివాస్ రెడ్డి, తహశీల్దార్ అయ్యప్ప, స్థానిక గ్రామ సర్పంచ్ కొలను రమాదేవి మల్లారెడ్డి, ఉపసర్పంచ్ బడే కుమార్, మాజీ సర్పంచ్ బండమీది కృష్ణ, వార్డు సభ్యులు తాండ్ర రవీందర్, మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోటె శ్రీశైలం, రైతులు పాల్గొన్నారు.

ఓటరు నమోదును వేగవంతం

కె.టి.దొడ్డి, అక్టోబర్ 30 (జనం సాక్షి) : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు పిలుపునిచ్చారు. కె.టి.దొడ్డి మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు శ్రీపాద రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ఓటరు

నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామాలు, పట్టణాల్లోని అర్హులైన పట్టభద్రులను గుర్తించి అవగాహన కల్పించాలని, ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ ఎక్బోటే, మండల నాయకులు హనిమిరెడ్డి, ఎర్ర భీమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన సాగిన రోడ్డు విస్తరణ పనులకు వేగం..!

- కలెక్టర్, ఎమ్మెల్యే సమీక్షతో కదిలిన యంత్రాంగం

వనపర్తి, అక్టోబర్ 30 (జనం సాక్షి) : వనపర్తి జిల్లాలో

ఎంతోకాలంగా నత్తనడకన సాగుతున్న రోడ్డు విస్తరణ పనులు ప్రస్తుతం వేగవంతమయ్యాయి. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి రోడ్డు విస్తరణ పనులపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, అధికారులకు ఇచ్చిన ఆదేశాల మేరకు పనుల్లో పురోగతి కనిపిస్తోంది. రోడ్డు విస్తరణ పనులు సకాలంలో పూర్తిచేసి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో సంబంధిత శాఖల అధికారులు చర్యలు చేపట్టారు. పనుల జాప్యాన్ని నివారించి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. రోడ్డు విస్తరణ పనుల కారణంగా ప్రజలకు, వాహనదారులకు రాకపోకల్లో ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పనులు వేగంగా, నాణ్యతతో పూర్తయ్యేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగుతున్నారు. కలెక్టర్, ఎమ్మెల్యే సమీక్ష అనంతరం రోడ్డు విస్తరణ పనుల్లో వేగం పెరగడంతో స్థానికంగా ఈ పనులు త్వరగా పూర్తవుతాయనే ఆశాభావం వ్యక్తమవుతోంది. పనులు పూర్తయితే పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతో పాటు ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణం అందుబాటులోకి రానుంది.

ఆదర్శ్ నగర్‌లో కమిషనర్ ఆకస్మిక తనిఖీ

- పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు
- పేరుకుపోయిన చెత్తను తక్షణమే తొలగించాలి
- క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలి
- అధికారులకు మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదేశాలు

ఉప్పల్, అక్టోబర్ 30 (జనం సాక్షి) : మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యేక దృష్టి సారించాలని మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదేశించారు. ఇందులో భాగంగా ఉప్పల్‌లోని ఆదర్శ్ నగర్ ప్రాంతంలో కమిషనర్ ఆకస్మికంగా క్షేత్రస్థాయి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్య ప్రమాణాలను స్వయంగా పరిశీలించడంతో పాటు, రామ్‌కీ సంస్థకు సంబంధించిన జీపీవీల పనితీరును సమీక్షించారు. చెత్త సేకరణ,

తరలింపు, వ్యర్థాల తొలగింపు ప్రక్రియలో ఎక్కడైనా లోపాలు ఉన్నాయా అనే అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీలోని పలు ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, పారిశుధ్య నిర్వహణ తీరును పరిశీలించిన కమిషనర్ సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా ఎక్కడైనా చెత్త పేరుకుపోయినట్లు గుర్తిస్తే వెంటనే తొలగించాలని, చెత్త పేరుకుపోయేందుకు ఆస్కారం ఉన్న ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. పారిశుధ్య పనుల్లో జాప్యం జరగకుండా నిర్దేశిత సమయంలోనే చెత్తను పూర్తిస్థాయిలో తొలగించాలని స్పష్టం చేశారు. అలాగే పారిశుధ్య సమస్యలు పునరావృతం కాకుండా క్షేత్రస్థాయి సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. కేవలం సాకులు చెప్పడం కాకుండా ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించేలా అధికారులు, పారిశుధ్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. నగర పరిశుభ్రత అనేది కేవలం పారిశుధ్య సిబ్బంది బాధ్యత మాత్రమే కాదని, ప్రతి స్థాయిలో జవాబుదారీతనం ఉండాలని కమిషనర్ ఆదేశాల ద్వారా స్పష్టం చేశారు. ఆదర్శ్ నగర్‌లో నిర్వహించిన ఈ ఆకస్మిక తనిఖీ ద్వారా పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేకుండా, సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలనే దిశగా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

భూములను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు

- సిద్దిపేట కలెక్టర్ కే. హైమావతి

చేర్యాల, అక్టోబర్ 30 (జనంసాక్షి) : ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కే. హైమావతి హెచ్చరించారు. శుక్రవారం చేర్యాల మండలం ముస్త్యాల గ్రామంలోని సర్వే నెంబర్ 1197లో గల ప్రభుత్వ భూమిని జిల్లా కలెక్టర్ కె.హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 1197 సర్వే నెంబర్ లో గతంలో ఎంత ప్రభుత్వ భూమి ఉండేది, ప్రస్తుతం ఎంత ఉంది అనే వివరాలను పాత రికార్డులన్నీ వెరిఫై చేయాలని సర్వే అధికారులను ఆదేశించారు. సర్వే పూర్తయిన వెంటనే హద్దురాళ్లు వేసి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని తహసీల్దార్ ను ఆదేశించారు. జిల్లాలో ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకొని కఠిన శిక్షలు విధిస్తామని హెచ్చరించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్రీవాస్య సందీప్, సర్వే అధికారులు, గ్రామ ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

మిడ్జిల్‌ను కరువు మండలంగా ప్రకటించాలి

మిడ్జిల్, అక్టోబర్ 30 (జనం సాక్షి) : మండలంలో వర్షాభావంతో ఎండిపోయిన పంటలను పరిశీలించిన సీపీఎం జిల్లా బృందం, మిడ్జిల్ మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా వస్పుల, దోనూర్, రైనోనికుంట తండా, మసిగుండ్లపల్లి, వేముల గ్రామాల్లోని పంట పొలాలను బృందం పరిశీలించింది. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ. రాములు, సీనియర్ నాయకులు కిల్లె గోపాల్ మాట్లాడుతూ.. సరైన వర్షాలు లేక వరి, పత్తి, వేరుశనగ, మొక్కజొన్న పంటలు ఎండిపోయాయని తెలిపారు. చెరువులు, బోర్లు అడుగంటడంతో భూగర్భ జలాలు పడిపోయి సాగునీటి సమస్య తీవ్రంగా మారిందన్నారు. అప్పులు చేసి పంటలు సాగు చేసిన రైతులకు దిగుబడులు రాక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు రూ.40 వేల వరకు పెట్టుబడి పెట్టిన పత్తి రైతులకు కేవలం రెండు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వస్తోందని, చేతికొచ్చిన వరి పంట సైతం పూర్తిగా ఎండిపోయిందని రైతులు తమ గోడును బృందానికి వివరించారు. ప్రభుత్వం వెంటనే క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేసి ప్రతి ఎకరాకు రూ.45 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని నాయకులు డిమాండ్ చేశారు. రైతు ఆత్మహత్యలు చోటుచేసుకోకముందే ప్రభుత్వం స్పందించి రైతులకు ఆర్థిక భరోసా కల్పించాలని, గ్రామాల్లో రైతులు, వ్యవసాయ కూలీలకు ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు దీప్లా నాయక్, తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గడ్డల మధు, రైతులు రాంరెడ్డి, జగదీష్, నరసింహ, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కరువు పరిస్థితులపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలి

- **జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్**

నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 30 (జనంసాక్షి) : నాగర్‌కర్నూల్ జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం 13 మండలాలను కరువు మండలాలుగా గుర్తించిన నేపథ్యంలో, ఆయా మండలాల్లో కరువు పరిస్థితులపై శాఖల వారీగా సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. కరువు ప్రభావాన్ని క్షేత్రస్థాయిలో సమగ్రంగా అంచనా వేయడంతో పాటు, గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పటిష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు బి. చెన్నయ్య, దేవసహాయం తో కలిసి ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, వ్యవసాయ, ఉద్యానవన, మిషన్ భగీరథ, నీటిపారుదల, భూగర్భ జలాలు, డీఆర్డీఏ, పంచాయతీరాజ్ తదితర శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కరువు మండలాల్లో చేపట్టాల్సిన చర్యలు, పంటల నష్టం అంచనా, తాగునీటి సరఫరా, శాఖల వారీగా రూపొందించాల్సిన నివేదికలు, కార్యాచరణ ప్రణాళికలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలో ఉర్కొండ, వెల్దండ, కల్వకుర్తి, వంగూరు, చారకొండ, అమ్రాబాద్, పదర, అచ్చంపేట, బల్మూరు, లింగాల, పెద్దకొత్తపల్లి, కోడేరు, బిజినేపల్లి మండలాలను రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలుగా గుర్తించిందని తెలిపారు. ఆయా మండలాల్లో కరువు తీవ్రతను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా శాఖల వారీగా పూర్తి స్థాయి నివేదికలు రూపొందించాలని ఆదేశించారు. అందుబాటులో ఉన్న గణాంకాలు, శాఖల రికార్డులు, క్షేత్రస్థాయి పరిశీలనల ఆధారంగా పంటల నష్టం, సాగునీటి లభ్యత, భూగర్భ జలమట్టాలు తదితర వివరాలను సేకరించాలని సూచించారు. ముఖ్యంగా వేసవి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామాల్లోని తాగునీటి వనరులు, బోరుబావులు, చేతిపంపులు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, నీటి సరఫరా పైపులైన్ల స్థితిగతులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి విధిగా నీటి సరఫరాపై పర్యవేక్షణ చేపట్టాలని, ఎక్కడైనా సరఫరాలో అంతరాయం ఏర్పడితే వెంటనే సమస్యను గుర్తించి పరిష్కరించాలని ఆదేశించారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ తాగునీటి సరఫరాకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. మిషన్ భగీరథ, పంచాయతీరాజ్, గ్రామీణ నీటిసరఫరా, భూగర్భ జల శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రతి గ్రామంలో తాగునీటి లభ్యతను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. నీటి సమస్య తీవ్రంగా ఉన్న గ్రామాలను ముందుగానే గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని, ప్రజల నుంచి ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అదేవిధంగా వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు కరువు ప్రభావంతో పంటలకు జరిగిన నష్టాన్ని సమగ్రంగా అంచనా వేయాలని, రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు అందించాలని తెలిపారు. పంటల పరిస్థితి, సాగునీటి వనరులు, భూగర్భ జలమట్టాలు తదితర అంశాలను ఎప్పటికప్పుడు పరిశీలించి వాస్తవ వివరాలతో నివేదికలు సమర్పించాలని సూచించారు. కరువు పరిస్థితులపై రూపొందించే జిల్లా నివేదికలో అన్ని శాఖలకు సంబంధించిన సమాచారాన్ని సమన్వయంతో పొందుపరచాలని కలెక్టర్ పేర్కొన్నారు. శాఖల వారీగా సమర్పించే గణాంకాలు పరస్పరం సరిపోలేలా పరిశీలించాలని, ప్రభుత్వ మార్గదర్శకాలు, నిబంధనలు, నిర్దేశిత ప్రొఫార్మాలకు అనుగుణంగా ఆధారాలు, గణాంకాలు, క్షేత్రస్థాయి వివరాలతో నివేదికలను నిర్ణీత సమయంలో సమర్పించాలని ఆదేశించారు. కరువు పరిస్థితుల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా చూడటం అధికారుల ప్రధాన బాధ్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి శాఖాధికారి తమ పరిధిలోని గ్రామాల వారీగా సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ క్షేత్రస్థాయి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని, ప్రజలకు అవసరమైన సేవలను సకాలంలో అందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్ఓ పాండు, ఆర్డీవోలు అర్చన, బన్సీలాల్, జిల్లా అధికారులు యశ్వంతరావు, చిన్న ఓబులేసు, శ్రీరాములు, సుధాకర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన అవసరం

- **జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

గద్వాల నడిగడ్డ, ఆగస్టు 30 (జనం సాక్షి) : విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు మెరుగుపడేలా ఉపాధ్యాయులు వారికి అర్థమయ్యే రీతిలో బోధించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. శుక్రవారం గద్వాల మండలం వీరాపూర్ గ్రామ సమీపంలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన పరీక్షా ఫలితాలపై ఆరా తీశారు. విద్యార్థులు వెనుకబడ్డ సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తు లక్ష్యాల గురించి అడిగి అందుకు అవసరమైన నైపుణ్యాలను మెరుగుపరుచుకునే అవకాశాలను తెలియజేశారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఏ రంగంలో రాణించాలన్న నైపుణ్యాలు అవసరమని, అందుకు విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పై తరచూ అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం డ్రగ్స్, బెట్టింగ్, తదితర వ్యసనాలు యువతను పట్టిపీడిస్తున్నాయని ఇలాంటి వ్యసనాల బారిన విద్యార్థులు పడకుండా సమస్కారంతో కూడిన విద్యను అందజేసే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. చక్కగా చదివి మంచి స్థాయిలో స్థిరపడే వయసులో వ్యసనాల బారిన పడితే విద్యార్థుల భవిష్యత్తు మొత్తం దెబ్బతింటుందని, వారిపై ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులు మానసిక వేదన అనుభవించాల్సి వస్తుందన్నారు. కాబట్టి విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దబడేలా విద్యార్థులకు దిశా నిర్దేశం చేయాలన్నారు. ఇటీవల నిర్వహించిన పరీక్షా ఫలితాల్లో తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి బోధించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. గణితం, సైన్స్ సబ్జెక్టుల్లో తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులు ఆయా సబ్జెక్టులపై ఆసక్తితో చదివేలా ప్రయోగపూర్వకంగా బోధించాలన్నారు. గతేడాది ఎస్ఎస్సి ఫలితాల్లో టాపర్లుగా నిలిచిన వారి కంటే ఈ ఏడాది పరీక్ష ఫలితాల్లో ఇంకా మంచి మార్కులు తెచ్చుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఏకరూప దుస్తులు, రాత, పాఠ్య పుస్తకాల కొరత లేకుండా అందజేయాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. గురుకులంలో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని, తాగునీరు కలుషితం కాకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. గురుకులం వాష్రూమ్స్ శుభ్రంగా ఉండాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు వస్తే అందుబాటులో ఉన్న వైద్య సేవల గురించి వాకబ్ చేశారు. ప్రథమ చికిత్స కిట్స్ ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని, విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన చేయడమే కాక వారి రక్షణ విషయంలోనూ చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. నిబంధనల ప్రకారం విద్యార్థులను కలిసేందుకు వారి తల్లిదండ్రులకు అవకాశం కల్పించాలని సూచించారు. విద్యార్థులతో ఫోన్స్ ఉండడానికి వీల్లేదని, ఈ విషయంలో తగు పర్యవేక్షణ చేస్తుండాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

పట్టభద్రులు ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలి

కొమురవెల్లి, అక్టోబర్ 30 (జనం సాక్షి) : వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని గౌరయపల్లి లో నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తిరెడ్డి మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్లకు అర్హులైన పట్టభద్రులందరూ తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఓటరు నమోదుకు భారతదేశంలోని గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ లేదా ప్రభుత్వం, ఎన్నికల సంఘం గుర్తించిన తత్సమాన విద్యార్హత పొంది ఉండాలి. 2026 నవంబర్ 1 అర్హత తేదీ నాటికి కనీసం మూడు సంవత్సరాల క్రితమే అంటే 2023 అక్టోబర్ 31 నాటికి లేదా అంతకుముందు డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. అర్హులైన వారు ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, విద్యార్హత ధ్రువపత్రాలను సమర్పించాలని సూచించారు. గతంలో పట్టభద్రుల ఓటరుగా నమోదై ఉన్నవారు సైతం ఈసారి కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఈ నమోదు ప్రక్రియకు నవంబర్ 6 చివరి తేదీగా ఉందని పట్టభద్రులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని కోరారు. ్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడగ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళారుల వలలో రైతులు పడవద్దు

కోహెడ, అక్టోబర్ 30 (జనంసాక్షి) : మండలంలోని కూరేళ్ళ గ్రామం లో సర్పంచ్ బండారి లక్ష్మి బాలరాజు ఆధ్వర్యంలో ఐకెపి వరి ధాన్యం కొనుగోలు సెంటర్ లో పూజ చేసి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అలాగే రైతులు వరి ధాన్యాన్ని దళారుల వలలో పడవద్దని అన్నారు. వారికి అమ్ముకోకుండా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు అమ్ముకుంటేనే రైతుకు లాభం స్వీకరించాలని రైతులకు సూచించారు. అలాగే రైతులకు ఎలాంటిఇబ్బందులు ఎదురవ్వకుండా చూసుకోవాలనీ ఐకెపి సిబ్బందితో అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి గా హాజరైన ఏ ఎం సీ చైర్ పర్సన్ బోయిని నిర్మల - జయరాజు మాట్లాడుతూ రైతులకు తూకం విషయం లో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూసుకోవాలని రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా చూడాలని ఏ ఎం సీ చైర్ పర్సన్ అన్నారు. రైతులు ధాన్యాన్ని తేమ శాతం తగ్గే వరకు ధాన్యం ఆరబెట్టాలన్నారు. అలాగే వరి ధాన్యం కోసిన వెంటనే సెంటర్ సిబ్బందికి తెలియచేసి తమ నంబర్‌ను నమోదు చేయించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శెట్టి సుధాకర్, స్థానిక ఉప సర్పంచ్ మార్గం తిరుపతి, వార్డు సభ్యులు, ఏఎంసీ డైరెక్టర్ శ్రీశైలం, ఐకెపి సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల నిరసన

వెల్దండ, అక్టోబర్ 30 (జనంసాక్షి) : వెల్దండ మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు తమ దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ,010 ద్వారా వేతనాలు చెల్లించడం, +.ూ 370 అమలు చేసి ప్రమోషన్లు కల్పించడం, హెల్త్ కార్డులు మంజూరు చేయడం, డీఏ బకాయిలను వెంటనే చెల్లించడం,టీజీటీలకు నోషనల్ బెనిఫిట్స్ వర్తింపజేయడం, అవర్ లీ బేస్డ్ టీచర్లకు కనీస గౌరవ వేతనం పెంచడం, సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయడం వంటి ప్రధాన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వమే మోడల్ స్కూల్స్ ను మంజూరు చేసిందని, అందులో పనిచేస్తున్న తమను పట్టించుకోకపోతే ఎలా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీధర్, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధనకు సమరశంఖం

- **హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమానికి సిద్ధం కావాలి**
- **టీయూడబ్ల్యూజే,ఐజేయూ రాష్ట్ర కార్యదర్శి మధుగౌడ్**

రేవల్లి, అక్టోబర్ 30 (జనంసాక్షి) : జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించేందుకు జర్నలిస్టులు సిద్ధం కావాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే,ఐజేయూ) రాష్ట్ర కార్యదర్శి గుండ్రాతి మధుగౌడ్ పిలుపునిచ్చారు. జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల సాధన కోసం సంఘటిత పోరాటాలే మార్గమని స్పష్టం చేశారు. శుక్రవారం వనపర్తి జిల్లా టీయూడబ్ల్యూజే,ఐజేయూ జిల్లా కమిటీ కార్యవర్గ సమావేశం రేవల్లి మండల కేంద్రంలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు మాధవరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మధుగౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలోనే అత్యంత పెద్ద జర్నలిస్టు సంఘంగా ఉన్న టీయూడబ్ల్యూజే జర్నలిస్టుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందన్నారు. జర్నలిస్టుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి సంఘం ముందుండి పోరాటాలు సాగిస్తోందని తెలిపారు. ఇందులో భాగంగా వచ్చే నెల నాలుగో తేదీన రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, భవిష్యత్తు కార్యాచరణపై కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల సమస్య తీవ్రంగా ఉందని మధుగౌడ్ పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా ప్రజా సమస్యలపై నిరంతరం వార్తలు రాస్తూ సమాజానికి సేవలందిస్తున్న జర్నలిస్టులకు సొంత ఇంటి స్థలం లేకపోవడం ఆవేదనకరమన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో జర్నలిస్టులకు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఇళ్ల స్థలాల సమస్యపై సానుకూలంగా స్పందించాలని కోరారు. స్థలాల సాధన కోసం జర్నలిస్టులంతా రాజకీయాలకు అతీతంగా ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డు మంజూరు విషయంలో కూడా యూనియన్ పోరాటం చేయాల్సి వచ్చిందన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే అత్యధికంగా వనపర్తి జిల్లాలో409 మంది జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు ఇప్పించడంలో జిల్లా కమిటీ చేసిన కృషి అభినందనీయమని కొనియాడారు. ఇంకా అక్రిడేషన్ కార్డులు పొందని అర్హులైన జర్నలిస్టులకు కార్డులు ఇప్పించేందుకు యూనియన్ కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. జర్నలిస్టులకు హెల్త్ కార్డులు అందేలా సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తామన్నారు. మండల కేంద్రాల్లో జర్నలిస్టులకు ప్రత్యేకంగా ప్రెస్ క్లబ్బులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రేవల్లి మండల కేంద్రంలో సింగిల్ విండో కాంప్లెక్స్‌లో ఖాళీగా ఉన్న షట్టర్‌లో ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేసేందుకు యూనియన్ తరపున కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. జర్నలిస్టులకు వృత్తిపరమైన సమస్యలు ఎదురైనప్పుడు సంఘం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. జర్నలిస్టులు నిజాయితీతో, ఐకమత్యంతో పనిచేసినప్పుడే తమ హక్కులను సాధించుకోగలరని మధుగౌడ్ అన్నారు. వార్తా సేకరణలో పక్షపాతానికి తావులేకుండా అన్ని రాజకీయ పార్టీలను సమాన దృష్టితో చూడాలని సూచించారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడమే జర్నలిస్టుల ప్రధాన బాధ్యతగా ఉండాలన్నారు. జిల్లా అధ్యక్షుడు మాధవరావు మాట్లాడుతూ జర్నలిస్టులు తమ వృత్తి ధర్మాన్ని పాటిస్తూ ఐక్యంగా ఉండాలని, యూనియన్ జర్నలిస్టుల కోసం ఎంతటి త్యాగానికైనా వెనకాడబోదని స్పష్టం చేశారు. జర్నలిస్టుల బలంతోనే జిల్లాలో అత్యధికంగా అక్రిడేషన్ కార్డులు సాధించుకోగలిగామని అన్నారు. ఈ సందర్భంగా ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యుడు ప్రశాంత్ మాట్లాడుతూ జర్నలిస్టులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. సమాజంలో జరిగే అన్యాయాలు, అక్రమాలు, ప్రజా సమస్యలపై ప్రశ్నించినప్పుడే వాటి పరిష్కారానికి మార్గం ఏర్పడుతుందన్నారు. జర్నలిస్టులు తమ వృత్తి విలువలను కాపాడుకుంటూ హక్కుల సాధన కోసం సంఘటితంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఎన్ శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి రాజు, కోశాధికారి మన్యం, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు అంజి.. సీనియర్ జర్నలిస్ట్ నాగేంద్రంచారీ, శ్రీనివాస్ రావు, వనపర్తి పట్టణ యూనియన్ అధ్యక్షుడు తైలం అరుణ్, పెబ్బేర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బాలవర్ధన్, శ్రీరంగాపూర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బాలరాజు, రేవల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు హరీష్, కార్యదర్శి నవీన్, టీ. శేఖర్, గణేష్, రామకృష్ణ, దామోదర్, రవీందర్, శ్రీనివాసులు, యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటు నమోదుపై ప్రతి కార్యకర్త భాగస్వామ్యం కావాలి

- **మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్**

వెల్దండ, అక్టోబర్ 30 (జనంసాక్షి) : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియలో గ్రామస్థాయి నుంచి ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త చురుగ్గా పాల్గొనాలని మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పిలుపునిచ్చారు. వెల్దండ మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పుట్ట రాంరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టభద్రుల ఓటరు నమోదును బాధ్యతగా తీసుకుని అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ఆయన విమర్శలు చేశారు. ఏటా రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్లలో ఆరు లక్షల ఉద్యోగాలు కల్పించాలనే డిమాండ్ చేశారు. ఉద్యోగులకు రావాల్సిన పదవీ విరమణ ప్రయోజనాలు,పీఎఫ్, డీఏ బకాయిలను చెల్లించాలని కోరారు. పేదల భూములను 22-ఏ నిషేధిత జాబితాలో చేర్చడంపై కూడా ఆయన ప్రభుత్వాన్ని విమర్శించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జంగిలి నిరంజన్, కల్వకుర్తి మండల పార్టీ మాజీ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ బాలయ్య, వార్డు సభ్యులు సిర్సనగండ్ల శేఖర్, పిల్లి దేవేందర్, జంగిలి యాదగిరి, గండికోట రాజు, ప్రభాకర్, ప్రసాద్, ఫరీద్, దేవేందర్, శేఖర్, నందు, ఏంజ, లచ్చిరాం నాయక్, రాజు, శివరాజు తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి ఘటనలపై సిట్ ఏర్పాటు

- వాస్తవాలను వెలికితీసే దిశగా ప్రత్యేక బృందం
- రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా

దండేపల్లి అక్టోబర్ 30 (జనంసాక్షి) : మంచిర్యాల, దండేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల చోటుచేసుకున్న ఘటనలపై పారదర్శకంగా, నిష్పక్షపాతంగా దర్యాప్తు నిర్వహించేందుకు సీసీఎస్ ఏసీపీ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసినట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. ఈ బృందం సంఘటన స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత వ్యక్తులు,సాక్షులను విచారించడంతోపాటు సాంకేతిక ఆధారాలను సేకరించి విశ్లేషించనుంది. అందుబాటులో ఉన్న ఆధారాల ఆధారంగా సంఘటనల వాస్తవాలను, సంబంధిత వ్యక్తుల పాత్రను నిష్పక్షపాతంగా నిర్ధారించనుందని తెలిపారు. దండేపల్లి, మంచిర్యాల పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు 24 గంటలూ అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అవసరమైన ముందస్తు భద్రతా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. సోషల్ మీడియాలో ప్రచారమవుతున్న ఊహాజనిత, నిర్ధారణ కాని , అసత్య సమాచారాన్ని నమ్మవద్దని,వాటి ఆధారంగా ప్రజలు ఆందోళనకు గురికావద్దని సీపీ సూచించారు. అధికారికంగా పోలీస్ శాఖ విడుదల చేసే సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని కోరారు. ప్రజల భద్రతే పోలీసుల ప్రథమ ప్రాధాన్యత. శాంతిభద్రతల పరిరక్షణకు రామగుండం పోలీస్ కమిషనరేట్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు.

17 మంది దళితులను దూషించిన కేసులో నిందితునికి 6 నెలల జైలుశిక్ష

నెన్నెల, అక్టోబర్ 30 (జనంసాక్షి) : 17 మంది దళితులను దూషించిన కేసులో నిందితునికి ఆరు నెలల జైలుశిక్ష, రెండు వేల రూపాయలు జరిమానా విధించినట్లు నెన్నెల ఎస్సై జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం 2012లో భూములు లేని దళితులకు ఖమ్మంపల్లి శివారులోని సర్వే నెంబర్ 12, 18, 20 లో ప్రభుత్వం భూమి ఇవ్వగా అట్టి భూములను ఆనుకొని ఉన్న యజమాని ఇందురి రాంమోహన్ రావు అనే గొల్లపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి బాధితులకు ఇచ్చిన భూములను ఆక్రమించి, వారి భూములకు వెళ్ళే దారి ఆయన భూమి పక్కన ఉండ బాధితులను వారి భూమిలోకి వెళ్ల కుండా అడ్డుపడ్డాడు. బాధితులు ఇచ్చిన భూములను దొబ్బి దొయ్యలు చేయించాడు. 31.1.2021 నాడు 1-30 గంటలకు అది తెలిసిన బాధితులందరు వెళ్ళి రాంమోహన్ రావ్ ని నిలదీయగా 17 మంది బాధితులను మీరెవ్వరురా, మీరు మా అయ్యకు పుట్టినారా నేతకాని, మాదిగ లంజకొడుకుల్లారా అని భూములు అడ్డు, ఇంకోసారి భూములోకి వస్తే చంపేస్తానని బెదిరించాడు. బాధితులు ఫిర్యాదు మేరకు, అప్పటి నెన్నెల ఎస్సై రమాకాంత్ కేసు నమోదు చేశారు. 19/2021 బెల్లంపల్లి ఏసీపీ రెహమాన్ దర్యాప్తు చేసి ఛార్జి షీట్ దాఖల్ చేయగా, ప్రభుత్వ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం రమణ రెడ్డి 22 మంది సాక్షులను విచారించి నేరం రుజువు చేయగా, కలెక్టర్ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి బిసి శశికమార్ తీర్పు వెలువరించి సెక్షన్స్ 290, 506 ఐపీసీ , 3(1)(ఆర్)ఎస్, ఎస్సి/ఎస్టీ చట్టం క్రింద 6 నెలల జైలుశిక్ష, రూ.2000/- జరిమానా, జరిమానా కట్టని పక్షంలో అదనంగా 6 నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారని తెలిపారు. ఇట్టి కేసులో సాక్షులను ఏఎస్సై రాఘవేందర్ కోర్టులో హాజరు పర్చారు, పిపిని, లైజన్ అధికారిఅఖ, బెల్లంపల్లి ఏసీపీని, నెన్నెల ఎస్సైను మంచిర్యాల డీసీపీ అభినందించారు.

వ్యవసాయం రంగంలో డిజిటల్ సేవలను మరింత విస్తృతం చేయాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 30 (జనంసాక్షి) : వ్యవసాయ రంగంలో డిజిటల్ సేవలను మరింత విస్తృతం చేయడంతో పాటు రైతులకు ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు సులభంగా అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అగ్రిస్టాక్ డిజిటల్ వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో అగ్రిస్టాక్ అమలుపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతు ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం అగ్రి స్టాక్ డిజిటల్ వ్యవస్థను ప్రవేశపెట్టిందని, ఇందులో రైతు గుర్తింపు సంఖ్య, భౌగోళిక సమాచారంతో కూడిన గ్రామ మ్యాపుల నమోదు, పంట సాగు నమోదు రిజిస్ట్రీలు ఉంటాయని తెలిపారు. జిల్లాలో రైతు ఐడిల నమోదులో 70.4 శాతం లక్ష్యాన్ని సాధించడం జరిగిందని, జిల్లాలోని గ్రామాల మ్యాపులను జియో రిఫరెన్స్ చేయడం జరిగిందని తెలిపారు. వానాకాలం 2026 సీజన్‌కు సంబంధించి జిల్లాలో వ్యవసాయ ప్లాట్లు డిజిటల్ క్రాప్ సర్వేకు గుర్తించగా, స్వచ్ఛంద కార్యకర్తల ద్వారా పంటల వివరాలను 88.63 శాతం నమోదు చేయడం జరిగిందని తెలిపారు. వ్యవసాయ శాఖతో పాటు మార్కెటింగ్, పౌరసరఫరాలు, ఎరువుల నిర్వహణ, విత్తన పంపిణీ, పంటల బీమా, బ్యాంకింగ్, వ్యవసాయ రుణాలు, పిఎం కిసాన్, వ్యవసాయ యాంత్రీకరణ తదితర రంగాలలో అగ్రిస్టాక్ అప్లికేషన్‌ను వినియోగించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. రైతుల వివరాల ఆధారంగా ఎరువుల బుకింగ్, విక్రయాలు, విత్తనాల పంపిణీ, ధాన్యం, పత్తి, మొక్కజొన్న కొనుగోళ్లు, పంటల బీమా, వ్యవసాయ రుణాలు వంటి సేవలను మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు ఈ వ్యవస్థ ఉపయోగపడుతుందని వివరించారు. అగ్రిస్టాక్ ద్వారా వివిధ శాఖల మధ్య సమన్వయం పెంపొందించి రైతులకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

హట్టి ఆశ్రమ పాఠశాలలో డిప్యూటీ డైరెక్టర్ ఆకస్మిక తనిఖీ

- విద్యార్థుల హాజరు, పదో తరగతి ప్రత్యేక ప్రణాళికపై సమీక్ష

కెరమెరి, అక్టోబర్ 30 (జనంసాక్షి) : కెరమెరి మండలం హట్టి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలను గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యా ప్రమాణాలు, విద్యార్థుల హాజరు, పదో తరగతి పరీక్షల సన్నద్ధతను ఆయన పరిశీలించారు. వసతి గృహ సముదాయాలను పరిశుభ్రంగా ఉంచాలని విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. దసరా సెలవుల అనంతరం పాఠశాల పునఃప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించి, విద్యార్థులందరూ క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని సిబ్బందికి సూచించారు. పదో తరగతి విద్యార్థుల కోసం రూపొందించిన వంద రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు తీరును సమీక్షించారు. సబ్జెక్టుల వారీగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రణాళికాబద్ధంగా బోధన సాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎడారిని తలపిస్తున్న తల్లి గోదావరి!

- అన్నారం బ్యారేజీ సమీపంలో అడుగంటిన జలాలు..
- గతంలో ఒడ్డులను తాకిన గోదావరి.. నేడు ఇసుక తిన్నెలే దర్శనం
- రెండు పంటలకు నీరందక రైతన్న వెన్నులో వణుకు

కాటారం, అక్టోబర్ 30: (జనం సాక్షి): ఒకప్పుడు గలగల పారుతూ ఇరువైపులా ఒడ్డులను తాకుతూ నిండుకుండలా కనిపించిన తల్లి గోదావరి.. నేడు ఎడారిని తలపిస్తోంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల పరిధిలోని దామరకుంట వద్ద, అన్నారం బ్యారేజీకి అతి సమీపంలోనే అక్టోబర్ చివరి నాటికే గోదావరిలో నీటి జాడలు కనుమరుగవుతుండటంతో స్థానిక రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కొన్నేళ్లుగా ఇదే ప్రాంతంలో గోదావరి నిండుగా ప్రవహించేది. అన్నారం బ్యారేజీ నుంచి సుందిళ్ల బ్యారేజీ వరకు నీరు ఒడ్డుల సమానంగా నిలిచి ఉండేది. గోదావరిలో కలిసే మానేరు నది పరిసర ప్రాంతాల్లోనూ నీటి కళకళ కనిపించేది. ఆ నీటిని మంచిర్యాల, భూపాలపల్లి జిల్లాల పరిధిలోని రైతులు వినియోగించుకుని సమృద్ధిగా పంటలు సాగు చేసుకునేవారు. అయితే ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారిపోయింది.

నీరు లేక వెలవెలబోతున్న గోదావరి

అన్నారం బ్యారేజీ వద్ద నీరు నిల్వ లేకపోవడంతో గోదావరి పరివాహక ప్రాంతం వెలవెలబోతోంది. దామరకుంట నుంచి మంథని మండలం ఆరెంధ ప్రాంతం వైపు మానేరు సంగమించే ప్రదేశాల్లోనూ నీటి మట్టం గణనీయంగా పడిపోయి ఎడారి వాతావరణాన్ని తలపిస్తోంది. తలాపునే గోదావరి ఉన్నా తమ పంటలకు నీరు అందని పరిస్థితి నెలకొనడంపై రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్లుగా గోదావరిలో సమృద్ధిగా నీరు ఉండటంతో సాగుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంటలు పండించుకున్నామని, ఇప్పుడు దరిదాపుల్లోనే నీరు మాయమవుతుండటంతో తమ పరిస్థితి దయనీయంగా మారిందని రైతులు వాపోతున్నారు. అన్నారం బ్యారేజీ వద్ద కొంతమేర నీటిని నిల్వ ఉంచేలా చర్యలు తీసుకుంటే ఈ ప్రాంత రైతాంగానికి ఎంతో ప్రయోజనం కలుగుతుందని స్థానికులు చెబుతున్నారు. బ్యారేజీ పరిధిలో నీరు నిల్వ ఉండటంతో భూగర్భజలాలు పెరిగి బోర్లు, బావులకు నీటి లభ్యత మెరుగుపడుతుందని, పంటలకు సాగునీటి భరోసా ఏర్పడుతుందని పేర్కొంటున్నారు. నీరు అందుబాటులో లేకపోవడంతో రబీ పంటల సాగుపై రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పంటలు వేయకముందే ప్రభుత్వం రబీ సీజన్‌పై నిబంధనలు విధించడం, మరోవైపు గోదావరిలో నీరు లేకపోవడం రైతులకు మరింత భారంగా మారిందని వారు అంటున్నారు.

ఒక పంటతో కుటుంబం గడిచిన రోజులు పోయాయి

గతంలో ఒక పంట పండితేనే కుటుంబ అవసరాలు కొంతమేర తీరేవని రైతులు గుర్తుచేస్తున్నారు. విద్య, వైద్యం వంటి ఖర్చులు కూడా అప్పట్లో తక్కువగా ఉండేవని, ప్రస్తుతం వాటి వ్యయం భారీగా పెరిగిందని చెబుతున్నారు. నేటి పరిస్థితుల్లో కనీసం రెండు పంటలు పూర్తిస్థాయిలో పండితేనే కుటుంబాన్ని నెట్టుకురావడం సాధ్యమవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సాగునీటి ఆధారంగా జీవిస్తున్న రైతాంగానికి గోదావరిలో నీరు లేకపోవడం మరింత సంక్షోభాన్ని సృష్టిస్తోంది. కళ్లముందే గోదావరి నీరు కనుమరుగవుతుండటంతో రైతుల ఆశలు కన్నీళ్లుగా మారుతున్నాయి. తల్లి గోదావరి ఒడ్డునే ఉండి కూడా సాగునీటి కోసం తాము ఇబ్బందులు పడాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్నారం బ్యారేజీ వద్ద నీటి నిల్వకు చర్యలు తీసుకుని, రబీ పంటలకు సాగునీటి భరోసా కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. "గోదావరి మా తలాపునే ఉంది.. కానీ మా పొలాలకు మాత్రం నీరు లేదు. బ్యారేజీలో ఎంతో కొంత నీరు నిల్వ ఉంటే మా పంటలకు ప్రాణం పోసినట్టే" అని రైతులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి గోదావరి నీటి లభ్యతపై శాశ్వత పరిష్కారం చూపాలని, ఈ ప్రాంత రైతాంగాన్ని ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

పోలీస్ అమరవీరుల స్ఫూర్తితో ప్రజాసేవకు పెద్దపీట

- కోటపల్లి పోలీస్ స్టేషన్‌లో ఘనంగా మెగా రక్తదాన శిబిరం, ఉచిత కంటి పరీక్షలు
- 134 యూనిట్ల రక్త సేకరణ.. సుమారు 100 మందికి కంటి పరీక్షలు

చెన్నూర్ అక్టోబర్ 30(జనం సాక్షి) : పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని సమాజ రక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి సేవా స్ఫూర్తిని కొనసాగించే లక్ష్యంతో రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు, మంచిర్యాల డీసీపీ, జైపూర్ ఏసీపీ పర్యవేక్షణలో చెన్నూరు రూరల్ సర్కిల్ పోలీసుల ఆధ్వర్యంలో కోటపల్లి పోలీస్ స్టేషన్‌లో మెగా రక్తదాన శిబిరం, ఉచిత కంటి పరీక్షల కార్యక్రమాన్ని నిర్వహించారు. చెన్నూరు రూరల్ సర్కిల్ కార్యాలయ ఆవరణతో పాటు కోటపల్లి పోలీస్ స్టేషన్ వేదికగా నిర్వహించిన ఈ సామాజిక సేవా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్ ఐపీఎస్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలీస్ అమరవీరుల సేవలను, త్యాగాలను స్మరించుకుంటూ అధికారులు వారి అంకితభావాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి యువత, స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రమాదాలు, అత్యవసర వైద్య పరిస్థితులు, శస్త్రచికిత్సలు, ఇతర అనారోగ్య సమస్యల సమయంలో రక్తం ఎంతోమంది ప్రాణాలను కాపాడుతుందని అధికారులు తెలిపారు. అదేవిధంగా ప్రజల ఆరోగ్య పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 100 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి అవసరమైన వైద్య సలహాలు అందించారు. పోలీస్ శాఖ విధులు కేవలం నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకే పరిమితం కావని, ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములవుతూ, వారి ఆరోగ్యం, సంక్షేమం, సామాజిక అభివృద్ధికి తోడ్పడటం కూడా పోలీసుల సామాజిక బాధ్యతలో భాగమని ఈ కార్యక్రమం మరోసారి చాటిచెప్పింది. ఈ కార్యక్రమంలో జైపూర్ ఏసీపీ శ్రీ వెంకటేశ్వర్లు, చెన్నూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.కృష్ణ,కోటపల్లి ఎస్సై రాజశేఖర్, నిల్వాయి ఎస్సై నాగరాజు,రెడ్‌క్రాస్ మంచిర్యాల జిల్లా జనరల్ సెక్రటరీ మహేందర్, తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కాసర్ల రంజిత్ కుమార్,ఉత్తమ్, కోటపల్లి మండల సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు,పోలీస్ సిబ్బంది, యువకులు,పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- జిల్లా కలెక్టర్ కె.హరిత

ఆసిఫాబాద్ , అక్టోబర్ 30 (జనం సాక్షి) : ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో విద్య అభ్యసించే విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ శాఖ పోస్ట్ మెట్రిక్ వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి వంటగది, వంట సామాగ్రి, సరుకుల నిల్వల గదిని పరిశీలించారు. వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థినులు, పనిచేస్తున్న వంట సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, వసతి గృహ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. వంటగది మూత్రశాలలు స్నానపు గదులు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి జాదవ్ అంబాజీ, వసతి గృహ సంక్షేమ అధికారి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి

ములుగు,అక్టోబర్30(జనం సాక్షి): ములుగు మండలం ఇంచర్ల గ్రామ శివారులో యంగ్ ఇండియా స్కూల్ భవన నిర్మాణ పనుల కూలీలుగా పని చేస్తున్న కూలీ విద్యుద్ఘాతంతో మృతి చెందాడు. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాకు చెందిన పునేమ్ సునీల్ (25) అతను భార్య సంగీత, ఇద్దరు పిల్లలతో కలిసి ఇంచర్లలో నివసిస్తూ కూలీ పని చేస్తున్నాడు. స్కూల్ వెనుక అడవి పందులు సంచరిస్తుండటంతో పునేమ్ సునీల్ అతని స్నేహితుడు మడకం దేబా ఇద్దరు కలిసి 29 అక్టోబర్ 2026 సాయంత్రం 4గంటలకు బైండింగ్ వైరు, ఎలక్ట్రికల్ వైర్లతో అడవి జంతువుల వేటకు వల వేయడానికి వెళ్లారు.33 కెవి విద్యుత్ స్తంభం నుండి నేరుగా కరెంటు తీసుకొని బైండింగ్ వైరుకు అనుసంధానం చేస్తుండగా సుమారు 6గంటలకు విద్యుదాఘాతం తగిలి పునేమ్ సునీల్ కిందపడిపోయాడు.

రైతులకు నీళ్లివ్వడం చేతకాదా..?

- కరువు మండలంగా ప్రకటించ డానికి ఎందుకీ నిర్లక్ష్యం
- ప్రభుత్వంపై పల్లా సుందర్ రాంరెడ్డి ఆగ్రహం

దేవరుప్పుల అక్టోబర్ 30 (జనంసాక్షి) : దేవరుప్పుల మండలంలో నెలకొన్న తీవ్ర కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని దేవరుప్పుల మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని బీఆర్ఎస్ పార్టీ జనగామ జిల్లా నాయకులు పల్లా సుందర్ రాంరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు తక్షణమే సాగునీరు అందించి ఎండిపోతున్న పంటలను కాపాడాలని కోరారు. శుక్రవారం దేవరుప్పుల తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు తీగల దయాకర్ గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో కలిసి ఆయన ధర్నా నిర్వహించగా జిల్లానాయకులు పల్లా సుందర్ రాంరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పల్లా సుందర్ రాంరెడ్డి మాట్లాడుతూ సాగునీరు అందక పంటలు ఎండిపోతూ రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు నీళ్లు అడిగితే కేసులు నమోదు చేస్తారా అని ప్రశ్నించారు. రైతుల పక్షాన నిలబడి పోరాటం చేస్తున్న తమపై ఎన్ని కేసులు పెట్టినా వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి వెంటనే స్పందించి దేవరుప్పుల మండల రైతుల సాగునీటి సమస్యలను పరిష్కరించి కరువు మండలంగా ప్రకటించాలని కోరారు. పక్క నియోజకవర్గాల్లో అందిస్తున్న సాగునీటి సౌకర్యాలను పరిశీలించి, అదే విధంగా దేవరుప్పుల రైతులకు కూడా నీటి వసతి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.రైతుల కష్టాలను పట్టించుకోకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తే ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించడంతో పాటు రైతులకు అవసరమైన సహాయ, సహకారాలు అందించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బస్వ మల్లేశం,జెలేందర్ రెడ్డి,ఏల సుందర్ ,చింత రవి మైదం జోగేశ్వర్ ,హనుమంతు,మహేష్ ,కోతి ప్రవీణ్,నవీన్,నర్సింహులు, విజయ్ ,మల్లారెడ్డి,బిఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- మంత్రి శ్రీధర్ బాబు
- రూ. 2.2 కోట్లతో వడితలలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం
- జిల్లాలో రెండున్నరేళ్లలో 12 కొత్త సబ్‌స్టేషన్లు ఏర్పాటు
- హాజరైన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, కలెక్టర్ రాహుల్ శర్మ

చిట్యాల, అక్టోబర్ 30(జనం సాక్షి) : రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం వడితల గ్రామంలో ఎన్‌పీడీసీఎల్ ఆధ్వర్యంలో రూ. 2.2 కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఆయన ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ... వ్యవసాయానికి ఎలాంటి ఆటంకం లేకుండా నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. గత రెండున్నరేళ్ల కాలంలో ఉప ముఖ్యమంత్రి చొరవతో జిల్లాలో 12 కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్లను అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. భూగర్భ జలాల ఆధారంగా సాగు చేసే అన్నదాతలకు బోర్లకు అవసరమైన విద్యుత్ సౌకర్యాలను మెరుగుపరుస్తున్నామన్నారు. నిరంతరాయ విద్యుత్ అందిస్తున్న సిబ్బందిని ఈ సందర్భంగా మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. గోదావరి జలాలను డీబీఎం-38 ద్వారా రైతులకు చేరవేసే పనులను వేగవంతం చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఎల్‌నినో ప్రభావం, వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, పేదలకు సన్నబియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు విజయవంతంగా అమలవుతున్నాయని వివరించారు. పేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యను అందించేందుకు రూ. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు.

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 14,000 మెగావాట్ల నుంచి 21,000 మెగావాట్లకు పెంచిందని తెలిపారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని గాంధీనగర్ గుట్టలో మరో 33/11 కేవీ సబ్‌స్టేషన్ మంజూరు చేయాలని మంత్రిని కోరారు. డీబీఎం-38 ద్వారా 44,770 ఎకరాలకు, ఎస్సారెస్పీ ద్వారా మరో 70,000 ఎకరాలకు సాగునీరు అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ, వడితల సబ్‌స్టేషన్ ప్రారంభంతో పరిసరాల్లోని 5 గ్రామాల ప్రజలకు లో-వోల్టేజీ సమస్య తీరి నాణ్యమైన విద్యుత్ లభిస్తుందన్నారు. విద్యుత్‌ను వృథా చేయకుండా ప్రతి ఒక్కరూ పొదుపుగా వాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్ మోహన్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజబాబు, మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, ఎస్ఈ సదానందం, స్థానిక సర్పంచ్ భగవాన్ పాల్గొన్నారు.

ఎద్దులగూడెంలో భూ రీ సర్వే ప్రారంభం

మల్దకల్, అక్టోబర్ 30 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీ సర్వే కార్యక్రమాన్ని శుక్రవారం మల్దకల్ మండలంలోని ఎద్దులగూడెం గ్రామంలో మండల తహసీల్దార్ ఝాన్సీ రాణి ప్రారంభించారు. గ్రామ రైతులతో కలిసి కొబ్బరికాయ కొట్టి రీ సర్వే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఝాన్సీరాణి మాట్లాడుతూ మండలంలోని ఎద్దులగూడెంతో పాటు అన్ని గ్రామాల్లో వ్యవసాయ భూములు, నాలాలకు సంబంధించి రీ సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. భూముల కొలతల ఆధారంగా సరిహద్దులను నిర్ధారించి ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ సభ్యుడు కురుమన్న, మండల సర్వేయర్ బీచుపల్లి, జీపీఓ లక్ష్మణ్, శేఖర్, జిల్లామాజీ ఉపసర్పంచుల సంఘం అధ్యక్షుడు రంజిత్ కుమార్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఎల్‌నినో నేపథ్యంలో బియ్యం ధరలు తగ్గించాలి

- రైస్ మిల్లర్లకు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సూచన

మిర్యాలగూడ, అక్టోబర్ 30 (జనంసాక్షి) : ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రైస్ మిల్లర్లు బియ్యాన్ని తక్కువ ధరలకు విక్రయించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సూచించారు. శుక్రవారం మిర్యాలగూడ సమీపంలోని దాక్షాయిని పారాబాయిల్డ్ రైస్ మిల్లును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బియ్యం మిల్లింగ్, ప్యాకింగ్, రవాణా ప్రక్రియలను పరిశీలించారు. మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ సంఘం అధ్యక్షుడు గౌరి శ్రీనివాస్, కార్యదర్శి బాబీ, మిల్లు యజమానులు జేవీ రమణ, తిరుపతిరావులతో మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో బియ్యం ధరలను తగ్గించి విక్రయించాలని కోరారు. మార్కెట్లో నాణ్యమైన బియ్యం అందుబాటులో ఉండేలా చూడాలని, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులకు సైతం ఈ విషయాన్ని తెలియజేయాలని సూచించారు. అనంతరం బియ్యం బస్తాల బరువు, ఖాళీ సంచులు, లేబుళ్లు, ప్యాకింగ్ విధానం, ధరలను పరిశీలించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ఆర్డీవో రమణారెడ్డి, డీఎస్ఓ వెంకటేశ్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రాంపతి నాయక్ తదితరులు ఉన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదుకు నవంబర్ 6 చివరి తేదీ

- ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఫారం-18 దరఖాస్తుల స్వీకరణ
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట, అక్టోబర్ 16 (జనంసాక్షి) : శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేందుకు నవంబర్ 6 చివరి తేదీ అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. అర్హులైన పట్టభద్రులు నిర్ణీత గడువులోగా ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రానున్న శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం చేపడుతున్నట్లు వెల్లడించారు.

మూడేండ్ల క్రితం డిగ్రీ పూర్తి చేసి ఉండాలి

2026 నవంబర్ 1వ తేదీని అర్హత తేదీగా పరిగణిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. 2023 అక్టోబర్ 31నాటికి గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ పూర్తి చేసిన వారు పట్టభద్రుల ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. ఇందుకోసం ఫారం-18 సమర్పించాల్సి ఉంటుందని చెప్పారు.

ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

పట్టభద్రులు తెలంగాణ ముఖ్య ఎన్నికల అధికారి వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆఫ్‌లైన్‌లో ఫారం-18ను విద్యార్హత ధ్రువపత్రాలతో జతచేసి సంబంధిత సహాయ ఎన్నికల నమోదు అధికారి, నియమిత అధికారి కార్యాలయాల్లో అందజేయవచ్చన్నారు. పోస్టు ద్వారా కూడా దరఖాస్తులు పంపే అవకాశం ఉందని వివరించారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ఏ విధానంలో దరఖాస్తు చేసినా విద్యార్హత ధ్రువపత్రాలు, ఇతర అవసరమైన పత్రాలు తప్పనిసరిగా సమర్పించాలని స్పష్టం చేశారు.

అర్హులందరూ నమోదు చేసుకోవాలి

జిల్లాలో అర్హత కలిగిన పట్టభద్రులెవరూ ఓటరు నమోదుకు దూరం కావొద్దని కోరారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, పట్టభద్రుల సంఘాలు, విద్యాసంస్థలు, ఉద్యోగ సంఘాలు, ప్రజాప్రతినిధులు ఓటరు నమోదుపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. దరఖాస్తులతో వచ్చిన విద్యార్హత ధ్రువపత్రాలను అధికారులు నిబంధనల ప్రకారం పరిశీలించి, అర్హత కలిగి ఉన్న దరఖాస్తులను గడువులోగా పరిష్కరిస్తారని తెలిపారు. దరఖాస్తుల పరిశీలన, క్షేత్రస్థాయి ధ్రువీకరణ, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఓటరు నమోదు ప్రక్రియపై సందేహాలు, అభ్యంతరాలు, ఫిర్యాదులు ఉంటే సంబంధిత ఎన్నికల నమోదు అధికారి, సహాయ ఎన్నికల నమోదు అధికారి కార్యాలయాలను సంప్రదించాలని సూచించారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని కోరారు.

భట్టి డైరెక్షన్‌లో సీపీ కట్టుకథలు

- అసలు హంతకులను కాపాడేందుకు సీపీ సునీల్ దత్ డ్రామా
- ప్రజా భవన్‌లో స్క్రిప్ట్ తయారు
- భట్టి డైరెక్షన్‌లో సీపీ అమలు
- రామారావు మర్డర్ ను పక్కదారి పట్టించే కుట్ర
- సీపీని వెంటనే సస్పెండ్ చేయాలి
- బాధితులకు న్యాయం జరిగే వరకు రాజీలేని పోరాటం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు

ఖమ్మం, అక్టోబర్ 30 (జనంసాక్షి) : ఖమ్మం సీపీ డైరెక్షన్ లో సామినేని రామారావు హత్య కేసు దర్యాప్తు పూర్తిగా పక్కదారి పట్టించేలా సాగుతోందని, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క డైరెక్షన్ లోనే ఈ డ్రామా స్క్రిప్ట్ నడుస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఖమ్మంలోని సుందరయ్య భవన్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రామారావు హత్యలో అసలు హంతకులను, రౌడీలను, గూండాలాను కాపాడేందుకు పోలీస్ కమిషనర్ అన్ని ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. మొదటి నుంచి తాము చెబుతున్నట్లుగానే రామారావు రిమాండ్ రిపోర్ట్ లో 14 మంది సాక్షులను విచారించామని చెప్పినప్పటికీ, అందులో ఇద్దరు ఉద్యోగులు మినహా మిగిలిన వాళ్ళంతా వేరే పేర్లు చెబుతున్నారని స్పష్టం చేశారు. భట్టి విక్రమార్క చెబితే సీపీ సునీల్ దత్ ఈ కట్టు కథ అల్లుతున్నారని విమర్శించారు. హత్య వెనుక అసలు మోటివ్ ను పక్కన పెట్టి, సంబంధం లేని అంశాలను తెరపైకి తెస్తూ తప్పుడు కథలు అల్లుతున్నారని ధ్వజమెత్తారు. రామారావు హత్యకు కారణమైన హంతకులను శిక్షించే వరకు అసలు దోషులు పట్టబడే వరకు సీపీఎం పార్టీ తరఫున న్యాయపోరాటం చేస్తామని, రాజీలేని పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ హత్యపై సమగ్ర విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సీపీ ఖమ్మం జిల్లా ప్రజల ముందు పెద్ద నాటకం చూపించారని అన్నారు. భట్టి మధిర నియోజకవర్గంలో హత్యాకాండ ద్వారా రాజకీయాలు చేస్తున్నారని, ఇప్పటి వరకు సీపీఎం కు చెందిన ముగ్గుర్ని హత్య చేశారని చెప్పారు. భట్టి అన్యాయాలు, అవినీతిని, అక్రమాలు ప్రశ్నించినందుకే సామినేని రామారావు ను హత్య చేశారని ఆరోపించారు. హత్యకు నెల రోజుల ముందు రామారావు పెద్ద ఎత్తున పాదయాత్ర చేశారని పేర్కొంటూ అ సందర్భంగా రామారావు ప్రసంగం ఆడియో ను విలేకరులకు వినిపించారు. భట్టికి సీపీ మొదట నుంచి ఊడిగం చేస్తున్నారని ధ్వజమెత్తరు. ప్రజాభవన్‌లో భట్టి సమక్షంలో తయారు చేసిన స్క్రిప్ట్ ను సీపీ అమలు చేస్తున్నారని, కానీ నాటకం అట్టర్ ప్లాప్ కాక తప్పదని అన్నారు.

సీపీని తక్షణమే సస్పెండ్ చేయాలి

సీపీఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ఐపీఎస్ వ్యవస్థకే కళంకం తెచ్చేలా వ్యవహరిస్తున్న పోలీస్ కమిషనర్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. రామారావు హత్య కేసులో ఏడాది గడిచినా హంతకులను అరెస్ట్ చేయకుండా, పోలీసు శాఖ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు సీపీ కొత్త నాటకాలకు తెరలేపారని విమర్శించారు. సీఎంను కలిసి సిట్ ప్రత్యేక దర్యాప్తు కోరినా ఫలితం లేకుండా పోయిందని, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను కూడా అమలు చేయకుండా భట్టి అడ్డుకున్నారని ఆరోపించారు. సీపీ చెబుతున్న అబద్ధపు కథలను రామారావు కుటుంబ సభ్యులు, ప్రజలు, చివరికి పోలీసు అధికారులే నమ్మలేక నవ్వుకుంటున్నారని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్, బండి పద్మ, కళ్యాణం వేంకటేశ్వరరావు, మాదినేని రమేష్, విక్రమ్, పార్టీ సీనియర్ నాయకులు చింతలచెర్వు కోటేశ్వరరావు, మధిర డివిజన్ కార్యదర్శి ఎం. గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు స్కిల్ ట్రైనింగ్

- నైపుణ్యాలను గుర్తించి ప్రత్యేక కోర్సుల రూపకల్పన
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట, అక్టోబర్ 30 (జనంసాక్షి) : జిల్లాలోని పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చి, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను సర్వే ద్వారా గుర్తించి, వాటికి అనుగుణంగా ప్రత్యేక శిక్షణ కోర్సులు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఎన్‌ఐఈఎల్‌ఐటి, ఆర్సెట్టి, సిఐటీడీ, టాస్క్ తదితర సంస్థల సమన్వయంతో యువతకు శిక్షణ, ధ్రువీకరణ అందించి ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. స్థానిక పరిశ్రమలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ రంగాల్లో యువతకు ఉపాధి కల్పించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. టాస్క్ సమన్వయంతో జిల్లాలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. స్కిల్ డెవలప్మెంట్ కేంద్రం అందుబాటులోకి వస్తే యువతకు విస్తృతంగా నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో డిఆర్వో డి. ప్రేమ్ రాజ్, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం ఎంఎ. భారతి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ సత్యనారాయణ రెడ్డి, ఎన్‌ఐఈఎల్ ఐటి ప్రతినిధి డాక్టర్ లక్ష్మణ్, ఎన్ఎస్డీసి ప్రతినిధి ప్రతాప్ చారి, ఎస్బిఐ ప్రతినిధి వాల్యా నాయక్, సూర్యాపేట పాలిటెక్నిక్ కళాశాల సీనియర్ లెక్చరర్ వజ్రయ్య, హుజూర్‌నగర్ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎన్. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏదులాపురాన్ని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం

ఖమ్మం రూరల్, అక్టోబర్ 30 (జనం సాక్షి) : కొత్తగా ఏర్పడిన ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇప్పటికే రూ.100 కోట్లకు పైగా నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, మరో రూ.100 కోట్లను మౌలిక సదుపాయాల కల్పనకు కేటాయించేలా కృషి చేస్తానని వెల్లడించారు. శుక్రవారం పాలేరు నియోజకవర్గంలోని ఏదులాపురం మున్సిపాలిటీ ఆరో వార్డు సింగరేణి కాలనీలో రూ.4.96 కోట్లతో చేపట్టనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి, 8వ వార్డు కోట నారాయణపురం నుంచి కోదాడ రోడ్డును కలుపుతూ నిర్మించనున్న ఆర్అండ్‌బీ రహదారికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ దివాకర టీఎస్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మద్దినేని స్వర్ణకుమారి, మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనితతో కలిసి మాట్లాడారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు తప్పకుండా వస్తాయని, పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ఒక్కో ఇందిరమ్మ ఇంటికి రూ.5 లక్షలు కేటాయిస్తోందని మంత్రి తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 8 లక్షల ఇందిరమ్మ ఇళ్ల కోసం రూ.40 వేల కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. ఇంకా అర్హులైన పేదలు ఉంటే మూడో, నాలుగో విడతల్లోనూ ఇళ్లు మంజూరు చేస్తామని భరోసా ఇచ్చారు. హైదరాబాద్‌లో పేదలు పనిచేసే ప్రాంతాల్లోనే లక్ష ఇళ్లను కేటాయించనున్నట్లు తెలిపారు. ఉచిత విద్యుత్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సహా సంక్షేమ పథకాలను రాజకీయాలకు అతీతంగా అర్హులైన వారికి అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏదులాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు బానోత్ కిషోర్ నాయక్, పలువురు కౌన్సిలర్లు, డివిజన్ అధ్యక్షులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మియాపూర్ భూముల విజయం సీఎం రేవంత్ కృషి ఫలితమే..

- మంత్రి పొంగులేటి

ఖమ్మం రూరల్, అక్టోబర్ 30 (జనం సాక్షి) : హైదరాబాద్ మియాపూర్‌లోని రూ.35 వేల కోట్లకు పైగా విలువైన 550 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వానికి దక్కేలా చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిదేనని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గత పాలకుల భూదోపిడీకి సుప్రీంకోర్టు తీర్పు చెంపపెట్టులాంటిదని వ్యాఖ్యానించారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని పీవీఆర్ గార్డెన్స్‌లో శుక్రవారం ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీకి చెందిన 176 మంది లబ్ధిదారులకు రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను జిల్లా కలెక్టర్ దివాకర టీ ఎస్ తో కలిసి మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. మియాపూర్‌లోని సర్వే నంబర్లు 100, 101లో ఉన్న 550 ఎకరాల భూమిని గత బీఆర్ఎస్ పాలకులు నమస్తే తెలంగాణ ఎండీ దామోదర్‌కు, బెంజ్ కారు బహుమతిగా ఇచ్చిన మరో రియల్ ఎస్టేట్ వ్యాపారికి కట్టబెట్టేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. నాటి ఎంపీ, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ భూములను కాపాడేందుకు పోరాటం చేశారని తెలిపారు. ముఖ్యమంత్రి అయ్యాక సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేసి, ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వచ్చేలా కృషి చేశారని పేర్కొన్నారు. ప్రజా పాలనలో ప్రభుత్వ ఆస్తులను కాపాడటం తమ నైతిక బాధ్యతగా భావిస్తున్నామని అన్నారు.

పేదల ఇళ్లపై మొసలి కన్నీరు..

కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో లక్షల కోట్లు ఖర్చు చేసి, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన గత పాలకులకు పేదల సొంతింటి కల గుర్తుకు రాలేదని పొంగులేటి విమర్శించారు. ఇప్పుడు ఓటమి తర్వాత పేదలపై మొసలి కన్నీరు కారుస్తున్నారని అన్నారు. దోచుకున్న సొమ్ములో కొంతైనా పేదల ఇళ్లకు కేటాయించి ఉంటే గ్రామాల్లో గుడిసెలు ఉండేవి కావని వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రెండు విడతల్లో రూ.40 వేల కోట్లు కేటాయించామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు అందించేందుకు అవసరమైతే మూడో, నాలుగో విడతల్లోనూ మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ఏదులాపురం మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్ పర్సన్ తమ్మినేని నవీన్, రూరల్ మండలం తహసీల్దార్ వినయేందర్ రెడ్డి, మున్సిపాలిటీ కమిషనర్ ఆళ్ళ శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు భానోత్ కిషోర్ నాయక్, ఖమ్మం రూరల్ మండలం కాంగ్రెస్ అధ్యక్షుడు తోట వీరభద్రం, స్థానిక కౌన్సిలర్లు బానోత్ భాస్కర్ నాయక్, బానోత్ దివ్య, కడవ నవీన్, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

కరువు నివారణలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం

- నాగర్‌కర్నూల్‌లో మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ డిమాండ్

నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 30 (జనంసాక్షి) : రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులను ఎదుర్కోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన రాష్ట్ర ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పెంట్లవెల్లి ప్రాంతంలో వందల ఎకరాల్లో పంటలు ఎండిపోయినా కరువు మండలంగా ఎందుకు ప్రకటించలేదని ప్రశ్నించారు. నవాబుపేటలో అన్ని రకాల పంటలు ఎండిపోయాయని, అక్కడ కాలువలు, నదులు లేకపోయినా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 15 మండలాలను కరువు మండలాల జాబితాలో చేర్చకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, రైతులతో మాట్లాడి వాస్తవ పరిస్థితులను అంచనా వేసిన తర్వాతే కరువు మండలాలను ప్రకటించాల్సి ఉందని అన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అధికారులు గ్రామాల్లో పర్యటించి రైతులతో చర్చించి కరువు పరిస్థితులను అంచనా వేసేవారని గుర్తుచేశారు. ప్రస్తుతం గ్రామాల్లో పశువులకు తాగునీరు కూడా అందుబాటులో లేక రైతులు తమ పశు సంపదను అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు వేయవద్దని ఆదేశాలు జారీ చేయడం తప్ప రైతులకు ప్రత్యామ్నాయ ఉపాధి, సహాయక చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. అచ్చంపేట నియోజకవర్గంలోని మారుమూల ప్రాంతాలు, పెంటల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. 2015-16లో ఎల్‌నినో ప్రభావంతో కరువు ఏర్పడిన సమయంలో అప్పటి కేసీఆర్ ప్రభుత్వం చెరువుల నిర్మాణం, మిషన్ భగీరథ ద్వారా శాశ్వత తాగునీటి పరిష్కారం, సాగునీటి కాలువల ద్వారా నీటి సరఫరా వంటి చర్యలు చేపట్టిందని వివరించారు. ఉపాధి హామీ పథకం కింద పనిదినాలను 100 నుంచి 150 రోజులకు పెంచడంతో పాటు కలెక్టర్ వద్ద రూ.50 కోట్ల నిధులను ప్రజల అవసరాల కోసం అందుబాటులో ఉంచామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల నీటి అవసరాల కోసం రూ.100 కోట్లకు పైగా అదనపు నిధులు విడుదల చేశామని, పశుగ్రాసానికి 50 శాతం సబ్సిడీ, రైతులకు సబ్సిడీ విత్తనాలు అందించామని పేర్కొన్నారు. రైతులకు రుణమాఫీ, రైతుబంధు పథకాల ద్వారా అండగా నిలిచామని తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా 14 లక్షల కిలోమీటర్ల పైప్‌లైన్ నిర్మించి ప్రజలకు తాగునీరు అందించామని, కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి సాగునీటి రంగంలో తెలంగాణను ముందుకు తీసుకెళ్లామని అన్నారు. ఆర్‌బీఐ గణాంకాల ప్రకారం తెలంగాణలో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగిందని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావంపై కేంద్ర ప్రభుత్వం ముందుగానే హెచ్చరించి నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోలేదని విమర్శించారు. రైతులు పంటలు వేయాలంటే డిక్లరేషన్ ఇవ్వాలనే నిబంధన విధించడం మూర్ఖత్వమని మండిపడ్డారు. కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతోందని శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. శ్రీశైలం జలాశయంలో గతంలో 180 టీఎంసీల నీరు ఉండగా ప్రస్తుతం 55 టీఎంసీలకు తగ్గిందని, ఈ నీటిలో తెలంగాణకు దక్కాల్సిన వాటాను సక్రమంగా వినియోగించుకోలేకపోతున్నామని అన్నారు. పోతిరెడ్డిపాడు, వెలిగొండ ప్రాజెక్టుల ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు భారీగా నీటిని తరలిస్తున్నారని ఆరోపించారు. కృష్ణా బేసిన్ నుంచి పెన్నా బేసిన్‌కు నీటిని తరలిస్తుండగా, మరోవైపు పాలమూరు ప్రాంత ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం

- కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్

పెద్దకొత్తపల్లి, అక్టోబర్ 30 (జనంసాక్షి) : నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతోందని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ అన్నారు. శుక్రవారం పెద్దకొత్తపల్లి మండలం చెన్నపురావుపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన లబ్ధిదారురాలు పెబ్బేటి నిర్మలమ్మ ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థిక సహాయంతో నిర్మించుకున్న నూతన ఇంటి గృహప్రవేశ వేడుకలో కలెక్టర్ పాల్గొని రిబ్బన్ కట్ చేశారు. నిర్మలమ్మ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రయోజనం అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. మంజూరైన ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు నాణ్యతా ప్రమాణాలు పాటించేలా పర్యవేక్షించాలని సూచించారు. లబ్ధిదారులకు నిర్మాణ సమయంలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొల్లాపూర్ ఆర్డీఓ బన్సీలాల్, పెద్దకొత్తపల్లి తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ, గ్రామ సర్పంచ్ వెంకటమ్మ, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అడిగింది శాశ్వత పట్టాలు.. ఇచ్చింది అసైన్మెంట్ పట్టాలు

అంతటి ఘనత చరిత్ర చందర్‌ది..

డిసిసి అధికార ప్రతినిధి పెండ్యాల మహేష్..

గోదావరిఖని,జనంసాక్షి: శాశ్వత పట్టాలు అడుగుతే అసైన్మెంట్ పట్టాలు ఇప్పించిన ఘనత మాజీ ఎమ్మెల్యే కోరుకొంటూ చందర్ ది అని డిసిసి అధికార ప్రతినిధి పెండ్యాల మహేష్ అన్నారు.గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీపీ గుర్మిట్ల రాజలింగంతో కలిసి ఆయన మాట్లాడారు. నిరాదరమైన ఆరోపణలు చేసిన కోరుకంటి చందర్ వాఖ్యలను ఖండిస్తున్నామని ఆయన పేర్కొన్నారు .కోరుకంటి చందర్ నిరాధారమైన, అవగాహన రాహిత్య ఆరోపణలను ఖండిస్తున్నామని, పెద్దంపేట రైల్వే ఓవర్ బ్రిడ్జి కి సంబంధించి పనులు మొదలయ్యాయి అని, చందర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి కోసం నిరాహార దీక్ష చేస్తా అని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.బిఆర్ఎస్ నాయకుల హయాంలో ఆర్ ఎఫ్ సి ఎల్ లో ఉద్యోగాల పేరుతో జరిగిన కుంభకోణం విషయంలో బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాలు విసిరారు. ఈ విలేకరుల సమావేశంలో డిసిసి అధికార ప్రతినిధి పెండ్యాల మహేష్ అంతర్గ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగం కిరణ్ గౌడ్ , మాజీ ఎంపీపీ ఉరిమెట్ల రాజలింగం, డిసిసి ప్రధాన కార్యదర్శి పూదరి సత్తయ్య గౌడ్, సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు ముక్కెర మొగిలి, రాయదండి సర్పంచ్ సాదుల సదానందం, యూత్ కాంగ్రెస్ మాజీ మండలాధ్యక్షులు మగ్గిడి రాకేష్, ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు రాకేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇండిపెల్లి రవి, మేడి ఒదేలు, సంగణ విని శేఖర్, అబ్దుల్ దాసుద్దీన్, పాల్గొన్నారు.

ఆరుతడి పంటలు మేలు

- తేమ సంరక్షణ చర్యలు చేపట్టాలి
- జిల్లా నోడల్ అధికారి డా ఓదెల సంపత్

పెద్దపల్లి,అక్టోబర్ 30(జనంసాక్షి) : రబీ సీజన్‌లో పెద్దపల్లి జిల్లాలో సాగునీటి లభ్యత, నేల లోని తేమ, వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు పంటల వైవిధ్యీకరణ (క్రాప్ డైవర్సిఫికే షన్)చేపట్టాలని, అందుబాటులో ఉన్న తేమను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు తేమ సంరక్షణ చర్యలు పాటించాలని రైతు విజ్ఞాన కేంద్రం, పెద్దపల్లి శాస్త్రవేత్త, సమన్వయకర్త, ఎల్‌నినో జిల్లా నోడల్ అధికారి డా. ఓదెల సంపత్ సూచించారు.ఎల్నినో పరిస్థితి నేపథ్యంలో యాసంగి సీజన్ లొ వరికి ప్రత్యామ్నాయంగా జొన్న, మొక్కజొన్న , శనగ, పెసర, మినుము, వేరుశనగ, నువ్వులు, కంది తదితర స్వల్పకాలిక వంగడాలను సాగునీటి లభ్యత, నేల పరిస్థితులకు అనుగుణంగా ఎంపిక చేసుకోవాలని తెలిపారు. పప్పుధాన్యాలు, నూనెగింజల సాగు ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించడంతో పాటు నేల సారాన్ని మెరుగు పరచుకోవచ్చని పేర్కొన్నారు. ప్రస్తుతం వాతావరణంలో అనిశ్చిత పరిస్థితులు, వర్షపాతం మార్పులు, నీటి లభ్యతలో వ్యత్యాసాలను దృష్టిలో ఉంచుకుని రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా సాగు ప్రమాదాలను తగ్గించుకోవచ్చని డా. సంపత్ తెలిపారు.రైతులు తమ గ్రామంలోని వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు మరియు రైతు విజ్ఞాన కేంద్రం, పెద్దపల్లిను సంప్రదించి తమ ప్రాంతానికి అనువైన రబీ పంటలు, విత్తనాలు, ఎరువుల యాజమాన్యం, నీటి నిర్వహణపై సాంకేతిక సలహాలు పొందాలని సూచించారు.

ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్

- సూపర్ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో
- తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి: జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి,అక్టోబర్ 30(జనంసాక్షి) : సుల్తానాబాద్ మున్సిపాలిటీల పరిధిలో రానున్న 15 రోజుల పాటు ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించి పట్టణాల్లో సంపూర్ణ పారిశుధ్యం సాధించాలని లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం అనంతరం పట్టణాల్లో ఎక్కడా ప్లాస్టిక్ కవర్లు, చెత్తాచెదారం,రోడ్లపై మురుగునీటి నిల్వలు కనిపించకూడదని స్పష్టం చేశారు.శుక్రవారం సమీకృత జిల్లా కార్యా లయాల సముదాయంలో పెద్దపల్లి, సుల్తానాబాద్ మున్సిపాలిటీల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టణంలోని అన్ని వార్డుల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ రోడ్లపై మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ రానున్న 15 రోజుల పాటు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి పెద్దపల్లి, సుల్తానాబాద్ పట్టణాల్లో పారిశుధ్య కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని సూచించారు. రోడ్లు, వీధులు, కాలనీలు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త పేరుకుపోకుండా చూడాలని, ప్లాస్టిక్ వ్యర్థాలను పూర్తిస్థాయిలో తొలగించాలని తెలిపారు. డ్రైనేజీల్లో పూడిక తొలగించి మురుగునీరు సాఫీగా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని, ప్రత్యేక డ్రైవ్ అనంతరం పట్టణాల్లో సంపూర్ణ పరిశుభ్రత కనిపించాలని ఆదేశించారు.

తాగునీటి సరఫరాకు ప్రాధాన్యత : సూపర్ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రానున్న రోజుల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. మున్సిపాలిటీల పరిధిలో తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, నీటి వృథాను తక్షణమే అరికట్టాలని ఆదేశించారు. పెద్దపల్లి, సుల్తానాబాద్ పట్టణాల్లో నీటి సరఫరా పైప్‌లైన్ల లీకేజీలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని, నీటి వృథా నివారణకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. నీటిని వృథా చేసే వారిని గుర్తించి జరిమానాలు విధించాలని తెలిపారు. రానున్న రెండు నెలల్లో మున్సిపాలిటీల పరిధిలో పన్నుల వసూళ్లను గణనీయంగా పెంచాలని ఆదేశించారు. నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పన్నుల వసూళ్లు చేపట్టాలని, వసూళ్ల పురోగతిని నిరంతరం సమీక్షించాలని సూచించారు.

అక్రమ నిర్మాణాలను అరికట్టాలి : పట్టణ ప్రాంతాల్లో ఎక్కడా అనధికార నిర్మాణాలు జరగకుండా టౌన్ ప్లానింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, అక్రమ నిర్మాణాలను గుర్తించి నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాలని తెలిపారు.(టి యు ఎఫ్ ఐ డి సి) నిధులతో పాటు ఇతర గ్రాంట్ల కింద ప్రతిపాదించిన అన్ని అభివృద్ధి పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, పనుల్లో జాప్యం జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు.మున్సిపాలిటీల పరిధిలోని డంప్ యార్డుల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. చెత్త సేకరణ, తరలింపు, నిర్వహణ ప్రక్రియలను పకడ్బందీగా చేపట్టాలని, డంప్ యార్డుల పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతకు భంగం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో పెద్దపల్లి, సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్లు వెంకటేష్, రమేష్, సంబంధిత అధికారులు,పాల్గొన్నారు.

కదం తొక్కిన కాంగ్రెస్ సైనికులు

న్యూఢిల్లీ ఇండియా కూటమి ర్యాలీకి బస్సును ప్రారంభించిన కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్

కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 30 (జనంసాక్షి): ఏఐసీసీ పిలుపు మేరకు, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో "ఛలో ఢిల్లీ – ఓటు బచావో.. దేశ్ బచావో.. సేవ్ డెమోక్రసీ.. సేవ్ ఇండియా" నినాదంతో నవంబర్ 1న న్యూఢిల్లీలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో జరగనున్న ర్యాలీలో పాల్గొనడానికి కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కరీంనగర్ పట్టణం నుండి దాదాపు 40 మందితో కూడిన బస్సు ఢిల్లీకి బయలుదేరింది. ఈ బస్సును కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ..."ఛలో ఢిల్లీ ఓట్ బచావో, దేశ్ బచావో ఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో జరిగే గొప్ప బహిరంగ సభకు కరీంనగర్ నుంచి బయలుదేరుతున్న కాంగ్రెస్ సైనికులం ఢిల్లీకి బయలుదేరడం జరుగుతుంది అని తెలిపారు. ఈ దేశంలో గతంలో స్వాతంత్ర్యం కొరకు పోరాటం చేసిన స్వాతంత్ర్య సమరయోధులు ఏ రకంగా అయితే దేశ స్వేచ్ఛ కొరకు పోరాటం చేశారో, నేడు ఓటు స్వేచ్ఛ కొరకు రాహుల్ గాంధీ నాయకత్వంలో జరుగుతున్న ఈ మహా బహిరంగ సభకు ఇండియా కూటమికి మద్దతుగా కరీంనగర్ నుంచి మా కరీంనగర్ కాంగ్రెస్ నాయకులం అందరం బై రోడ్ బస్సు ద్వారా బయలుదేరడం జరుగుతుంది. ఈ దేశంలో జ్ఞానేష్ కుమార్ ను తొలగించే వరకు ఈ ఉద్యమం ఆగదు. ఆనాడు సైమన్ కమిషన్ కు వ్యతిరేకంగా స్వాతంత్ర్య పోరాటం ఏ విధంగా అయితే లాలా లజపత్ రాయ్, భగత్ సింగ్ లు తీసుకున్న నిర్ణయం ప్రకారంగా స్వాతంత్ర్యం వచ్చిందో, నేడు 'జ్ఞానేష్ కుమార్ గో బ్యాక్' కార్యక్రమం ద్వారా ఈ భారతదేశానికి ఓటు హక్కు స్వతంత్రాన్ని కల్పించాలని తీసుకున్న కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని తెలిపారు.

విద్యతోపాటు విభిన్న అంశాల్లో విద్యార్థుల ప్రతిభచాటాలి

ఉత్తమ చిత్రాలు గీసిన విద్యార్థులను అభినందనందించిన కలెక్టర్ గరిమ అగ్రవాల్

రాజన్న సిరిసిల్ల బ్యూరో(జనంసాక్షి): ప్రభుత్వ విద్యాలయాల లోని విద్యార్థులు విద్యతో పాటు విభిన్న అంశాల్లో ప్రతిభ చూపుతున్నారని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు.బోయినపల్లిలోని టీజీఎస్ డబ్ల్యూఆర్ఎస్ జేసీ విద్యాలయానికి చెందిన పదో తరగతి విద్యార్థులు కె. వెంకటేష్ బాబు, కె. కార్తీక్ కె. శ్రీవాస్తవ్, యు.రాణాప్రతాప్ గీసిన చిత్రాలను శుక్రవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా కలెక్టర్ పరిశీలించి ఆ విద్యార్థులను అభినందించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యాసంస్థల్లోని విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్, మ్యూజిక్ లో ప్రతిభ చూపుతున్నారని కొనియాడారు. టీజీఎస్ డబ్ల్యూఆర్ఎస్ జేసీ బోయినపల్లి విద్యార్థులు గురుకుల విద్యాసంస్థల రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపారని తెలిపారు. అలాగే టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ లో సైతం అర్హత సాధించారని వెల్లడించారు. క్రీడలు లేదా ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్, మ్యూజిక్ లో నిత్యం సాధన చేయాలని సూచించారు.మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, కళాశాల ప్రిన్సిపాల్ విశ్వనాథం, ఆర్ట్ టీచర్ వీణా దేవి విద్యార్థులు ఉన్నారు.

నీటిని వృధా చేస్తే జరిమానా

మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య,మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్

పెద్దపల్లి,అక్టోబర్ 30(జనంసాక్షి): ప్రస్తుతం కొనసాగుతున్న ఎల్ నినో వాతావరణ పరిస్థితులను అర్థం చేసుకొని పెద్దపల్లి పట్టణ ప్రాంత ప్రజలు నీరు వృధా చేయకూడదని మున్సిపల్ చైర్మన్ నూగిళ్ళ మల్లయ్య ,కమిషనర్ ఆకుల వెంకటేష్ పేర్కొన్నారు. పెద్దపల్లి మున్సిపల్ పట్టణ ప్రాంతంలో నీటి సరఫరా ప్రతిరోజు జరుగుతుందని.. కానీ ప్రస్తుత కరువు పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని పట్టణ ప్రజలు నీటిని ఆధా చేయాలని,అనవసరంగా నీరు వృధా చేయకూడదు మరియు నల్ల నీటిని డ్రైనేజీలో వదలరాదని,ఎవరైనా నీటిని వృధా చేస్తే మున్సిపల్ ఆక్ట్ 2019 ప్రకారం గరిష్టంగా ఐదు వేల రూపాయల వరకు జరిమానా విధిస్తామని అదేవిధంగా నల్ల కనెక్షన్ తొలగిస్తామని పేర్కొన్నారు.

డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి

సంఘీభావం తెలిపిన బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష

పెద్దపల్లి,అక్టోబర్ 30(జనంసాక్షి) : నేషనల్ హెల్త్ మిషన్ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని నేటికీ 18 రోజులు గడిచిన స్పందించని ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకురాలు,బీసీ జేఏసీ నియోజకవర్గ ఇన్చార్జి దాసరి ఉష డిమాండ్ చేశారు.జిల్లా కేంద్రంలో గత 18 రోజులుగా శాంతియుతంగా సమ్మె చేస్తున్న ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల ధర్నా శిబిరాన్ని శుక్రవారం ఆమె సందర్శించి సంపూర్ణ సంఘీభావం ప్రకటించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష మాట్లాడుతూ ప్రజారోగ్యం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న వైద్య సిబ్బంది పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం శోచనీయమన్నారు.ఇతర రాష్ట్రాల్లో మహిళా ఉద్యోగులకు ప్రత్యేక సెలవులు ఇస్తుంటే,ఇక్కడ పనిచేస్తున్న మహిళా సిబ్బందికి చట్టబద్ధంగా రావాల్సిన 180 రోజుల ప్రసూతి సెలవులను కూడా నిరాకరించడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు.రాష్ట్రంలో ప్రచారాలు, సమ్మిట్ల పేరిట పత్రికా ప్రకటనల కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 17 వేల మంది ఎన్‌హెచ్ఎం సిబ్బందికి ఈఎస్ఐ,ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించడానికి మాత్రం వెనకడుగు వేస్తోందని విమర్శించారు. హర్యానా, రాజస్థాన్,పంజాబ్ వంటి రాష్ట్రాల్లో ఎన్‌హెచ్ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తుంటే, తెలంగాణలో మాత్రం ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగులను ఔట్‌సోర్సింగ్ లోకి నెట్టి వారి హక్కులను కాలరాయాలని చూస్తున్నారని మండిపడ్డారు.కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి సేవలందించిన వైద్య సిబ్బందికి రాజ్యాంగబద్ధంగా సమాన పనికి సమాన వేతనం.చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన స్థానిక ప్రజాప్రతినిధులు,మంత్రులు వెంటనే స్పందించి ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.ఎన్‌హెచ్ఎం కార్మికులు ఎవరి బెదిరింపులకూ భయపడాల్సిన అవసరం లేదని,వారి న్యాయమైన పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ అన్ని వేళలా అండగా ఉంటుందని,రాబోయే అసెంబ్లీ సమావేశాల్లోనూ ఈ సమస్యపై గళమెత్తుతామని దాసరి ఉష స్పష్టం చేశారు.

కూలిన హెలికాప్టర్..

హౌస్ మార్గంలోని పర్వత ప్రాంతంలో హెలికాప్టర్ కుప్పకూలినట్లు అధికారులు గుర్తించారు. ఘటనా స్థలం నుంచి పొగ వస్తున్నట్లు గుర్తించి.. సహాయక బృందాలను పంపించారు. రాష్ట్ర విపత్తు నిర్వహణ బృందాలతో పాటు ఆర్మీ బృందాలు.. రెస్క్యూ, రిలీఫ్ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి. ప్రతికూల వాతావరణం ఉన్నప్పటికీ ఆపరేషన్ కొనసాగుతోంది.జోషిమఠ్ సమీపంలోని చాయిూ గ్రామ సమీపంలో హెలికాప్టర్ కూలిపోయిన విషయాన్ని ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీ ధ్రువీకరించారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించేందుకు తక్షణమే ఎయిర్‌లిఫ్ట్ చేయాలని ఆదేశించారు.

అక్రమనిల్వలపై ఉక్కుపాదం

బియ్యం బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడితే క్రిమినల్ కేసులు : అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు

పెద్దపల్లి,అక్టోబర్ 30(జనంసాక్షి) : సన్న బియ్యం ధరల నియంత్రణలో భాగంగా బియ్యం వ్యాపారులు పారదర్శకత పాటించాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు ఆదేశించారు.శుక్రవారం ఐడీఓసీలోని తన ఛాంబర్‌లో హోల్‌సేల్ బియ్యం వ్యాపారులతో ఆయన సమావేశం నిర్వ హించి, బియ్యం ధరలు,నిల్వలు,విక్రయాల నిర్వహణపై పలు సూచనలు చేశారు.ఈ సం దర్భంగా అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు మాట్లా డుతూ, ప్రతి బియ్యం దుకాణంలో నిల్వల వివరా లను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని,అన్ని రికా ర్డులను పారదర్శకంగా,సక్రమంగా నిర్వహిం చాలని సూచించారు.బియ్యం కొరత ఉందంటూ ప్రజల్లో ఆందోళన సృష్టించే ప్రయత్నాలు చేయకూడదని స్పష్టం చేశారు. అక్రమంగా బియ్యం నిల్వ చేయడం,కృత్రిమ కొరత సృష్టించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రతి బియ్యం దుకాణంలో నోటీసు బోర్డు ఏర్పాటు చేసి, విక్రయించే బియ్యం బ్రాండ్లు, రకాలు, వాటి ధరల వివరాలను స్పష్టంగా ప్రదర్శించాలని ఆదేశించారు.బియ్యం బస్తాల బరువును కచ్చితంగా పాటించా లని, వినియోగదా రులకు నిర్ణీత బరువుకు అనుగుణంగా బియ్యం అందించాలని తెలిపారు.26 కిలోల బియ్యం బస్తాలో 25 కిలోల బియ్యం మాత్రమే ఉంటున్నట్లు ఫిర్యా దులు అందుతున్నాయని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా వ్యాపారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.బియ్యం దుకాణాల్లో అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తారని తెలిపారు. .రాష్ట్రంలో బియ్యం సమృద్ధిగా అందుబాటులో ఉందని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బియ్యం వ్యాపారులు నిబంధనలకు అనుగుణంగా వ్యాపార కార్యకలాపాలు నిర్వహించాలని అదనపు కలెక్టర్ సూచించారు.నిబంధనలను ఉల్లంఘించే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ ఎం శ్రీకాంత్,బియ్యం దుకాణాల యజమానులు, సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాస్

పెద్దపల్లి,అక్టోబర్ 30(జనంసాక్షి) : పెద్దపల్లి జిల్లా కేంద్రంలో కమాన్ చౌరస్తా వద్ద శుక్రవారం ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాస్ నేతృత్వంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు.నిబంధనలు పాటించని వాహనదారులపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధించారు. ట్రాఫిక్ ఉల్లంఘించిన వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఏసిపి శ్రీనివాస్ మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పతి వాహనానికి నంబర్ ప్లేట్లు కంపల్సరీ కలిగి ఉండాలని,ప్రతి వాహనానికి అన్ని పేపర్లు కలిగి ఉండాలఅన్నారు. .ట్రాఫిక్ సిఐ బి శ్రీనివాస్, గోదావరిఖని సిఐ రాజేశ్వర్ రావు, మంచిర్యాల సిఐ, ఎం డి అన్నాన్,ఎస్ ఐ లు,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే 'దాసరి'కి ఘనస్వాగతం

విదేశీ పర్యటన ముగించుకుని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన మనోహర్ రెడ్డి

పెద్దపల్లి(జనంసాక్షి): పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే,బిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జి దాసరి మనోహర్ రెడ్డి విదేశీ పర్యటన ముగించుకొని హైదరాబాదులో లో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ అభినందనలు తెలిపారు. వారితో పెద్దపల్లి మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ దాసరి మమత– ప్రశాంత్ రెడ్డి ఉన్నారు.విమానాశ్రయంలో దాసరి మనోహర్ రెడ్డి పుష్పలతకు కి నియోజకవర్గ బి ఆర్ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు.

'ఆయిల్‌పామ్'తో అధిక ఆదాయం

ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించాలి

- 800 మెగావాట్ల విద్యుత్ నిల్వ సామర్థ్యంతో బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు
- డ్రిప్, స్ప్రింక్లర్ సాగు పరికరాలపై ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని రైతులు సద్వినియోగం చేసుకోవాలి:ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

గోదావరిఖని, జనంసాక్షి: పెద్దపల్లి జిల్లా ఈసాల తక్కలపల్లి గ్రామంలో ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన, శిక్షణ కార్యక్రమానికి రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయిల్ పామ్ సాగు విధానాలు, పంట ద్వారా రైతులకు కలిగే ఆర్థిక ప్రయోజనాలు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అధికారులతో కలిసి రైతులకు అవగాహన కల్పించారు. రైతులు సంప్రదాయ పంటలతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు.

రామగుండంలో విద్యుత్ నిల్వ సామర్థ్యం పెంపునకు చర్యలు..

రామగుండం ప్రాంతంలో 800 మెగావాట్ల విద్యుత్‌ను నిల్వ చేసుకునే లక్ష్యంతో బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ ప్లాంట్ ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అదేవిధంగా కుక్కలగూడూరు, మద్దిరాల, ధర్మారం ఎక్స్ రోడ్, కుందన్‌పల్లి ప్రాంతాల్లో రూ.12.64 లక్షల వ్యయంతో సబ్‌స్టేషన్ల ఏర్పాటు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

రైతులకు సబ్సిడీ పథకాలపై అవగాహన కల్పించాలి..

ఉద్యానవన శాఖ ద్వారా డ్రిప్, స్ప్రింక్లర్ సాగు పరికరాలపై ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోందని, రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం ఉన్న నేపథ్యంలో రైతులు సాగు విషయంలో అప్రమత్తంగా ఉండాలని, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని నీటిని పొదుపుగా వినియోగిస్తూ వ్యవసాయం చేయాలని కోరారు.రామగుండం నియోజకవర్గంలో ఇప్పటికే 22 మంది రైతులు 35 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేపట్టడం అభినందనీయమని పేర్కొంటూ, మరింత మంది రైతులు ఆయిల్ పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై ఆసక్తి చూపాలని పిలుపునిచ్చారు.రైతులకు అవసరమైన ప్రభుత్వ పథకాలు, సాంకేతిక పరిజ్ఞానం మరియు సాగు విధానాలపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉద్యానవన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారులు, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి.. సంక్షేమమే సర్కార్ లక్ష్యం..

అంతర్గాం, జనంసాక్షి: అంతర్గం మండలంలోని రైతు వేదికలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలానికి చెందిన మొత్తం 29 మంది అర్హులైన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ అందజేశారు. పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు ఆడపిల్లల వివాహాలకు అండగా నిలవడమే ఈ పథకాల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో, మార్కెట్ కమిటీ చైర్మన్, మండల అధ్యక్షుడు, సర్పంచులు, ఉప సర్పంచులు, మండల నాయకులు, ముఖ్య కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

పట్టుపురుగుల పెంపకం కేంద్రాన్ని సందర్శించిన ఆల్ఫోర్స్ విద్యార్థులు

క్షేత్ర పర్యటనతో వ్యవసాయం, పట్టు పరిశ్రమపై అవగాహన

హుజూరాబాద్, అక్టోబర్ 30 (జనం సాక్షి): విద్యార్థులకు పుస్తక పరిజ్ఞానంతో పాటు క్షేత్రస్థాయిలో ప్రత్యక్ష అనుభవం కల్పించేందుకు విజ్ఞాన పర్యటనలు దోహదపడతాయని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి. నరేందర్ రెడ్డి అన్నారు. హుజూరాబాద్‌లోని ఆల్ఫోర్స్ జీనియస్ పాఠశాల విద్యార్థులు ఫీల్డ్ ట్రిప్‌లో భాగంగా తుమ్మనపల్లి గ్రామంలోని పట్టుపురుగుల పెంపకం కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. తరగతి గదుల్లో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలించడం ద్వారా విద్యార్థులకు వాటిపై మరింత అవగాహన కలుగుతుందన్నారు. పరిశీలనా శక్తి, జిజ్ఞాస, ఆచరణాత్మక పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఇలాంటి పర్యటనలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.పర్యటనలో భాగంగా విద్యార్థులు మల్బరీ సాగు, పట్టుపురుగుల జీవన చక్రం, గుడ్ల నుంచి పురుగులుగా ఎదిగే దశలు, గూళ్ల తయారీ, వాటి నుంచి పట్టుదారాన్ని సేకరించే విధానాన్ని ఆసక్తిగా తెలుసుకున్నారు. పట్టు ఉత్పత్తిలో రైతులు అనుసరించే పద్ధతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతు బొక్కల వేణుగోపాల్ విద్యార్థులకు పట్టుపురుగుల పెంపకంలోని వివిధ దశలను ప్రత్యక్షంగా వివరించారు. అనుకూల వాతావరణం, పురుగులకు అందించే ఆహారం, సంరక్షణ, గూళ్ల తయారీ నుంచి పట్టుదారం ఉత్పత్తి వరకు జరిగే ప్రక్రియలను తెలియజేశారు. సెరికల్చర్ ద్వారా రైతులకు లభించే ఉపాధి అవకాశాలు, వ్యవసాయ అనుబంధ రంగంగా పట్టు పరిశ్రమ ప్రాధాన్యతను వివరించారు. విద్యార్థులు తమ సందేహాలను నివృత్తి చేసుకుంటూ పుస్తకాల్లో చదివిన అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లి అభివృద్ధికి రూ.4.63 కోట్లు

- పలు కాలనీల్లో సీసీ రోడ్లు, పార్కుల అభివృద్ధికి శ్రీకారం
- గచ్చిబౌలి డివిజన్‌లో మరో రూ.1.20 కోట్ల పనులు
- నాణ్యతలో రాజీ వద్దు.. పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ
- స్మశానవాటికలు, డే కేర్ సెంటర్, స్టీల్ బ్రిడ్జి నిర్మాణాలు

శేరిలింగంపల్లి, అక్టోబర్ 30 (జనంసాక్షి): శేరిలింగంపల్లి నియోజకవర్గం లోని కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తున్నట్లు రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ (పీఏసీ) చైర్మన్ ఆరెకపూడి గాంధీ తెలిపారు. శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలో రూ.4.63 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శుక్రవారం తాజా మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. దూబే కాలనీ, డొయన్స్, అలిండ్ ఎంప్లాయిస్ కాలనీ, మసీదు బండ, ప్రభుపాద లేఅవుట్, సెంట్రల్ పార్క్ ఫేజ్-1, శిల్పా వ్యాలీ, స్ప్రింగ్ వ్యాలీ, తెలంగాణ హౌసింగ్ బోర్డు కాలనీల్లో సీసీ రోడ్లు, పార్కులు, స్మశానవాటికల అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.
దూబే కాలనీలో రూ.45 లక్షలు, డొయన్స్ కాలనీలో రూ.50 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించనున్నారు. అలిండ్ ఎంప్లాయిస్ హౌసింగ్ కాలనీలో రూ.72 లక్షలతో సీనియర్ సిటిజన్ల డే కేర్ సెంటర్, అలిండ్ కాలనీలో రూ.50 లక్షలతో పార్కులో వాటర్ సంప్, మల్టీపర్పస్ కోర్టు ఏర్పాటు చేయనున్నారు. మసీదు బండ, ప్రభుపాద లేఅవుట్‌లలో చెరో రూ.50 లక్షలతో హిందూ స్మశానవాటికలను అభివృద్ధి చేయనున్నారు. శిల్పా వ్యాలీలో రూ.50 లక్షలు, సెంట్రల్ పార్క్ ఫేజ్-1లో రూ.20 లక్షలు, స్ప్రింగ్ వ్యాలీలో రూ.30 లక్షలతో సీసీ రోడ్లు, తెలంగాణ హౌసింగ్ బోర్డు కాలనీలో రూ.46 లక్షలతో పార్కు ప్రహరీ నిర్మించనున్నారు.
అనంతరం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గుల్మోహర్ పార్క్, నేతాజీ నగర్, డాక్టర్స్ కాలనీల్లో మరో రూ.1.20 కోట్లతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేశారు. గుల్మోహర్ కాలనీలో రూ.45 లక్షలతో సీసీ రోడ్లు, నేతాజీ నగర్‌లో రూ.25 లక్షలతో నాలాపై స్టీల్ బ్రిడ్జి, డాక్టర్స్ కాలనీలో రూ.50 లక్షలతో పార్కు ప్రహరీ, వాకింగ్ ట్రాక్, ఇంకుడు గుంత నిర్మించనున్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మార్గదర్శకత్వంలో, మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామన్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని, పార్కుల్లో పిల్లలు, వృద్ధులు, వాకింగ్ చేసేవారికి అనువైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. స్మశానవాటికల్లో ప్రహరీ, స్నానపు గదులు, విశ్రాంతి గదులు నిర్మించి అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు మారబోయిన రాజు యాదవ్, గౌరవ అధ్యక్షుడు వీరేశంగౌడ్, ప్రధాన కార్యదర్శి చింతకింది రవీందర్ గౌడ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, నాయకులు, కార్యకర్తలు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

సన్నబియ్యం పంపిణీతో పేదలకు ప్రయోజనం

కాంగ్రెస్ నాయకులు మొలుగూరి సదయ్య, బుడిగె శ్రీకాంత్

జమ్మికుంట, అక్టోబర్ 30 (జనం సాక్షి): జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని మోతుకులగూడెం గ్రామం 8, 9, 10, 11 వార్డుల ప్రజలకు స్థానిక రేషన్ దుకాణం వద్ద కాంగ్రెస్ నాయకులు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు మొలుగూరి సదయ్య, యూత్ కాంగ్రెస్ జమ్మికుంట మండల అధ్యక్షుడు బుడిగె శ్రీకాంత్ మాట్లాడుతూ.. స్మార్ట్ రేషన్ కార్డులు పేదల ఆత్మగౌరవానికి ప్రతీకలని అన్నారు. గత పదేళ్లలో కొత్త రేషన్ కార్డుల జారీ, కుటుంబ సభ్యుల పేర్ల నమోదులో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శించారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు స్మార్ట్ రేషన్ కార్డులు అందిస్తోందని తెలిపారు. తొమ్మిది రకాల భద్రతా లక్షణాలతో రూపొందించిన ఈ కార్డుల ద్వారా పారదర్శకంగా రేషన్ సరుకులు అందుతాయని పేర్కొన్నారు. పేద, ధనిక తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ నాణ్యమైన సన్నబియ్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పంపిణీ కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. స్మార్ట్ రేషన్ కార్డులు, సన్నబియ్యం సరఫరా పేదల సంక్షేమానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యాన్ని తెలియజేస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట పీఏసీఎస్ చైర్మన్ పొనగంటి సంపత్, మోతుకులగూడెం రేషన్ డీలర్ మొలుగూరి మొగిలి (వసంత్), ఆయా వార్డుల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీ

ఇద్దరు మృతి.. ఇద్దరికి తీవ్ర గాయాలు

మల్దకల్ అక్టోబర్ 30 (జనంసాక్షి) : మండల పరిధిలోని శేషంపల్లి స్టేజ్ సమీపంలో మల్దకల్ - అయిజ ప్రధాన రహదారిపై శుక్రవారం ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు మృతి చెందారు.ఇద్దరు తీవ్రంగా గాయపడగా, మరొక్కరికి స్వల్ప గాయాలయ్యాయి. మల్దకల్ ఎస్ఐ శ్రీహరి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అయిజ మండలం చిన్న తాండ్రపాడు గ్రామానికి చెందిన కిరణ్ కుమార్, మహేష్ (25),ఇద్దరూ కలిసి బైక్‌పై గద్వాలకు వస్తున్నారు.అదే సమయంలో కర్నూల్ జిల్లాకు చెందిన లోకేష్, రవికుమార్,అయిజకు చెందిన ఏసన్న ముగ్గురు కలిసి మల్దకల్ మండలం నీలిపల్లి గ్రామంలో జరిగిన ఓ గృహప్రవేశ కార్యక్రమానికి హాజరై తిరుగు అదే బైక్ పై అయిజ వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో శేషంపల్లి స్టేజ్ సమీపంలో ఎదురెదురగా వస్తున్న రెండు బైకులు బలంగా ఢీకొట్టాయి. ఈ ఘోర ప్రమాదంలో బైక్‌లపై ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు.మల్దకల్ పోలీసులు, స్థానికులు గాయపడిన వారిని వెంటనే చికిత్స కోసం ఆంబులెన్స్ లో గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో మహేష్ (25) లోకేష్ (25) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు.తీవ్రంగా గాయపడిన కిరణ్ కుమార్,రవికుమార్, ఏసన్నలకు ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం కర్నూలు జిల్లా ఆసుపత్రికి తరలించారు. అయిజ మండలం చిన్న తాండ్రపాడుకు చెందిన కిరణ్ కుమార్ బైక్‌ను నడుపుతూ ముందుగా వస్తున్న బస్సును ఓవర్ టేక్ క్రమంలో ఈ ఘటన చోటు చేసుకుందని పోలీసులు, బాధితులు తెలిపారు. మల్దకల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గట్టు ఎత్తిపోతల బాధితులకు ఎకరాకు రూ.30 లక్షల పరిహారం ఇవ్వాలి

గద్వాల, అక్టోబర్ 30 (జనం సాక్షి) : నల్ల సోమనాద్రి (గట్టు) ఎత్తిపోతల కాలువల నిర్మాణంలో భూములు కోల్పోతున్న నిర్వాసిత రైతులకు భూమికి భూమి కేటాయించాలని లేదా ఎకరాకు రూ.30 లక్షల నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ. వెంకటస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన పార్టీ నేత వి.వి.నరసింహ మరియు బాధిత రైతులతో కలిసి జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.
ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ, గట్టు మరియు కేటీదొడ్డి మండలాల్లోని ఏడు గ్రామాల పరిధిలో దాదాపు 250 ఎకరాల వ్యవసాయ భూమిని సేకరించేందుకు అధికారులు నోటీసులు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్టుల పేరుతో నిరుపేద రైతుల నోట్లో మట్టి కొట్టడం సరికాదని, తగిన పరిహారం ఇవ్వకుండా బలవంతపు భూసేకరణ చేయవద్దని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుత మార్కెట్ ధరలకు అనుగుణంగా నష్టపరిహారం చెల్లిస్తేనే రైతులు భూములు ఇవ్వడానికి సిద్ధంగా ఉంటారని స్పష్టం చేశారు. నిరుపేదలు సాగు చేసుకుంటున్న అసైన్డ్ భూములకు కూడా పట్టా భూములతో సమానంగా పరిహారం అందజేయాలని, కాలువల నిర్మాణంలో ఇళ్లు, ఆస్తులు కోల్పోయే వారికి ప్రత్యామ్నాయంగా ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. పరిహారం చెల్లింపులో ఆలస్యం చేయకుండా, నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోనే నగదు జమ చేయాలన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులకు న్యాయం చేయకపోతే బాధితులందరినీ ఏకం చేసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని సీపీఎం నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు సీపీఎం ప్రతినిధులు, భూములు కోల్పోతున్న ఏడు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యాన్ని విక్రయించాలి

- పట్టిన వడ్లను 40 కేజీల 600 మాత్రమే తూకం వేయాలి
- ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ

బెజ్జంకి,అక్టోబర్ 30,(జనం సాక్షి): మండలంలోని దేవక్కపల్లి,దాచారం గ్రామాల్లో శుక్రవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రైతుల కోసం ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పిస్తోందని,రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే తమ ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు.రైతులు పట్టిన వడ్ల ను 40 కేజీల 600 గ్రాములు మాత్రమే తూకం వేయాలని అంతకంటే ఎక్కువ వేయకూడదని సెంటర్ల నిర్వాహకులకు సూచించారు.రైతులు వడ్లను పట్టడం కోసం అత్యాధునిక వడ్లను పట్టే యంత్రాలను అందుబాటులోకి తీసుకొచ్చామని వాటిని రైతులు ఉపయోగించుకోవాలి అనీ అన్నారు.కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు తాగునీరు,టెంట్ల వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఒగ్గు దామోదర్,మార్కెట్ కమిటీ చైర్మన్ మాతంగి శిరీష అనిల్,ఏఎంసీ వైస్ చైర్మన్ పర్శ సంతోష్,మాజీ ఏఎంసి చైర్మన్ పులి కృష్ణ, ఏఎంసి డైరెక్టర్లు,పీఏసీఎస్ డైరెక్టర్లు,దాచారం సర్పంచ్ మానస సంతోష్,దేవక్కపల్లి సర్పంచ్ నేరెళ్ల వెంకటలక్ష్మి రాజయ్య,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్,సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గూడెల్లి శ్రీకాంత్,మాజీ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి,ఒంటెల సంపత్ రెడ్డి,చిలువేరి శ్రీనివాస్ రెడ్డి,సర్పంచ్ గండికోట సురేష్,కుంట హరికృష్ణ, కుక్కల రాములు,మాతంగి భాస్కర్,మెండే నవీన్,జెల్ల ప్రభాకర్,గుర్రం రాజిరెడ్డి,సెంటర్ల నిర్వహకులు మరియు రైతులు పాల్గొన్నారు.

గుట్టల బేగంపేటలో ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రా

శేరిలింగంపల్లి, అక్టోబర్ 30 (జనంసాక్షి) : రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం, గుట్టల బేగంపేట రెవెన్యూ విలేజ్ పరిధి సర్వే నంబరు 63లోని ప్రభుత్వ భూమిని శుక్రవారం హైడ్రా కాపాడింది. ఈ సర్వే నంబరులో మొత్తం ప్రభుత్వ భూమి 78 ఎకరాలుండగా.. ఇందులో ఎకరాల భూమి ఇప్పటికే కబ్జాలపాలై భారీ సంఖ్యలో అక్రమ నిర్మాణాలు, నివాసాలు వెలిశాయి. ఈ నేపథ్యంలో సదరు భూమి తమ పూర్వీకులదని కొంతమంది వ్యక్తులు ఇష్టానుసారంగా అమ్ముకుంటూ వస్తున్నారు. దీనికితోడు మరి కొంతమంది అడ్డగోలుగా కబ్జాలు పెట్టి ఏకంగా ప్రహరీలు నిర్మించుకుని భూమిని కాపలా కాస్తున్నారు. పలు ఫిర్యాదులు, మీడియా కథలాల ఫలితంతో ఈ వివాదం హైకోర్టుకు వెళ్లింది. దీంతో ఆధారాలను పరిశీలించిన రాష్ట్ర హైకోర్టు స్టే ఉత్తర్వులను ఇచ్చింది. అయినప్పటికీ ఈ స్టేటస్ కో ఉత్తర్వులను బే ఖాతరు చేస్తూ పట్టించుకోకుండా సదరు వివాదాస్పద స్థలంలో ప్లాట్ల అమ్మకాలు, కొత్తగా నిర్మాణాలు ఇష్టానుసారంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో గత్యంతరంలేక రెవెన్యూ అధికారులు హైడ్రాను ఆశ్రయించారు. కోర్టు ఉత్తర్వుల ప్రకారం అక్కడ యథాస్థితి కొనసాగేలా కఠిన చర్యలు తీసుకోవాలని హైడ్రాను రెవెన్యూ కోరింది. ఈ మేరకు శుక్రవారం గుట్టల బేగంపేటలోని సర్వే నంబరు 63లో హైడ్రా ఫెన్సింగ్ వేసింది. 500ల మీటర్లకు పైగా ఫెన్సింగ్ వేసి ఆక్రమణలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకుంది. రెవెన్యూ అధికారుల సమక్షంలో హైడ్రా ఈ చర్యలు తీసుకుంది. దీంతో రెవెన్యూ అధికారుల అక్రమాలకు సైతం, దళారులకు కొమ్ముగాసే ద్వంద్వనీతికి కొంత తెరపడినట్లయ్యిందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలను, షీల్టును తొలగిస్తున్నాం

మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళా చక్రపాణి

సిరిసిల్ల టౌన్ అక్టోబర్ 30 (జనం సాక్షి) : సిరిసిల్ల మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ చక్రపాణి పర్యవేక్షించారు.
ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ చక్రపాణి మాట్లాడుతూ సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో మురికి కాలువల వెంట పెరిగిన పిచ్చి మొక్కలను బహిరంగ ప్రదేశాలలో పేరుకుపోయిన చెత్తకుప్పలను తొలగిస్తూ మురికి కాల్వలలో పూడిక తీస్తూ నిర్వహిస్తున్న ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ కార్యక్రమంలో భాగంగా గత శనివారం నాడు నెహ్రూ నగర్, సుభాష్ నగర్, గాంధీనగర్ ల మీదుగా ప్రవహిస్తున్న ప్రధాన మురికి కాలువలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను, మురికి షీల్డ్ ను, కాల్వ వెంట పెరిగిన పిచ్చి మొక్కలను తొలగిస్తూ పారిశుధ్య నిర్వహణ పనులను చేపట్టడం జరిగిందని అన్నారు.ఈ ప్రధాన మురుకి నీటి కాలువ పూడికతీత పనులు ప్రారంభించిన నుండి ఇప్పటివరకు కాలువలో నీటి ప్రవాహ వ్యవస్థ కాస్త మెరుగుపడిందని సాధ్యమైనంత త్వరలోనే పూర్తిస్థాయిలోనే కాలువలో మురికినీటి ప్రవాహానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా ప్లాస్టిక్ వ్యర్థాలను షిల్ట్ తొలగిస్తామని అన్నారు.. ఈ పర్యటనలో వైస్ చైర్మన్ దార్ల సందీప్ , కౌన్సిలర్ సభ్యులు దార్ణం అరుణ లక్ష్మీనారాయణ , గుండ్లపల్లి నీరజ పూర్ణ చందర్, మెరుగు మంజుల శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ దార్ణం లక్ష్మీనారాయణ, బిఆర్ఎస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ జిందం చక్రపాణి, ప్రధాన కార్యదర్శి మ్యాన రవి, గుండ్లపల్లి గౌతమ్, మున్సిపల్ డి,ఈ, వాణి,ఏ,ఈ, నరసింహస్వామి, మున్సిపల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఉప్పల్ ప్రభుత్వ పాఠశాలకు ఐదు అదనపు తరగతి గదులు

- రూ.67.75 లక్షలతో నిర్మాణానికి నిధుల మంజూరు
- నాబార్డ్ ఆర్ఐడీఎఫ్ 28వ విడతలో కేటాయింపు
- విద్యార్థులకు మెరుగైన బోధనా వసతులు
- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కృషితో ముందడుగు



ఉప్పల్, అక్టోబర్ 30 (జనం సాక్షి): ఉప్పల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐదు అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.67.75 లక్షల నిధులు మంజూరయ్యాయి. నాబార్డ్ ఆర్ఐడీఎఫ్ 28వ విడత పథకం కింద పాఠశాల కోడ్ 36210990201కు ఈ నిధులు కేటాయించారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కృషితో నిధులు మంజూరైనట్లు సమాచారం. కొత్త తరగతి గదుల నిర్మాణంతో విద్యార్థులకు మరింత మెరుగైన బోధనా వసతులు అందుబాటులోకి రానున్నాయి. నిధుల మంజూరుకు సహకరించిన రాష్ట్ర ప్రభుత్వం, అధికారులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తతే రక్షణ

- గాంధీ చౌరస్తాలో మొబైల్ ఫ్లాష్ ర్యాలీ
- 'పాజ్.. థింక్.. వెరిఫై' పాటించాలని సీపీ సూచన
- ఓటీపీ, పిన్, వ్యక్తిగత వివరాలు వెల్లడించవద్దని హెచ్చరిక
- మోసానికి గురైతే 1930కు ఫిర్యాదు చేయాలి

గోదావరిఖని, అక్టోబర్ 30 (జనంసాక్షి): సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో గోదావరిఖని గాంధీ చౌరస్తాలో శుక్రవారం రాత్రి మొబైల్ ఫ్లాష్ ర్యాలీ నిర్వహించారు. సైబర్ సెక్యూరిటీ అవేర్‌నెస్ నెల ముగింపు సందర్భంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ప్రారంభించారు. పోలీసులు, యువత మొబైల్ ఫ్లాష్‌లైట్లు వెలిగిస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. సైబర్ మోసాల నుంచి రక్షణకు ప్రతి ఒక్కరూ 'పాజ్.. థింక్.. వెరిఫై' సూత్రాన్ని పాటించాలని సూచించారు. తెలియని లింకులు, యాప్‌లు, క్యూఆర్ కోడ్‌లను తెరవవద్దని, ఓటీపీ, పిన్, సీవీవీ, పాస్‌వర్డ్ వంటి వివరాలను ఎవరికీ చెప్పవద్దని హెచ్చరించారు. నకిలీ పెట్టుబడి పథకాలు, డిజిటల్ అరెస్ట్, ఉద్యోగాలు, పార్సెల్స్ పేరుతో జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. యువత తమ కుటుంబ సభ్యులకు, ముఖ్యంగా వృద్ధులకు సైబర్ భద్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, సైబర్ క్రైమ్ ఏసీపీ రంగారెడ్డి, పలువురు సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, యువత, ప్రజలు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో.. వివాహిత ఆత్మహత్య

రంగారెడ్డి, అక్టోబర్ 30 (జనంసాక్షి): కుటుంబ కలహాల కారణంతో ఓ వివాహిత ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన విషాద సంఘటన ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని రంగన్నగూడకు చెందిన సమ స్నేహ (29) అనే మహిళకు ఆరేళ్ల క్రితం సుందర్ రెడ్డితో వివాహమైంది. కొంతకాలంగా కుటుంబంలో ఏర్పడిన సమస్యల కారణంతో తీవ్ర మనస్తాపానికి గురైన స్నేహ, శుక్రవారం ఉదయం తన నివాసంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఘటనపై సమాచారం అందుకున్న ఆదిభట్ల పోలీసులు క్షేత్రస్థాయికి చేరుకుని పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ చట్టం 2012పై పాఠశాలల్లో దేశవ్యాప్త అవగాహన ప్రచారం

"సురక్షిత బచ్‌పన్ అభియాన్"

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 30 జనం సాక్షి: లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ చట్టం 2012 ఫోక్సో యాక్ట్‌పై పాఠశాలల్లో దేశవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయని సురక్షిత బచ్పన్ అభియాన్ కార్యక్రమం ద్వారా పిల్లల రక్షణకు పాటుపడాలని సీనియర్ సివిల్ జడ్జి ఉల్లం అజయ్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నీలిమ ముద్దసాని లు పేర్కొన్నారు. సుప్రీంకోర్టు న్యూఢిల్లీ, హైకోర్టు హైదరాబాద్ తెలంగాణ స్టేట్ ఆదేశాల మేరకు,నిజామాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు పై విషయానికి సంబంధించి, నాల్సా (చీఫూబూా) నుండి అందిన "సురక్షిత బచ్‌పన్ అభియాన్" లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ చట్టం, 2012 పై పాఠశాలల్లో దేశవ్యాప్త అవగాహన సదస్సును నిర్వహించడం జరిగింది. శుక్రవారం ముగ్పాల్ మండలంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ బోర్గాం (పి) లో విద్యార్థులకు సురక్షిత బచ్పన్ అభియాన్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ ఎఫెక్ట్ యాక్ట్ 2012 ద్వారా చట్టాలపై అవగాహన సదస్సును నిర్వహించారు.ఫోక్సో యాక్ట్ గురించి అవగాహన ఉండాలని జిల్లా న్యాయ సలహాల పై వాల్ పోస్టర్లను ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమం రాజ్ కమార్ సుబేదార్ చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్, మహిపాల్ అసిస్టెంట్ డిఫెన్స్ కౌన్సిల్ సుహానా లిల్లీ అడ్వకేట్ ప్రతిభ అసిస్టెంట్ డిఫెన్స్ కౌన్సిల్ శంకర్ ప్రధానోపాధ్యాయుడు సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యక్తిగత భద్రతపై అవగాహన కలిగి ఉండాలి

- పోక్సో చట్టంపై ప్రత్యేక జిల్లా న్యాయమూర్తి రాధిక జైస్వాల్ అవగాహన
- వేధింపులపై నిర్భయంగా ఫిర్యాదు చేయాలి
- బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

సిరిసిల్ల టౌన్, అక్టోబర్ 30 (జనంసాక్షి): విద్యార్థులు వ్యక్తిగత భద్రత, బాలల హక్కులు, రక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పోక్సో కోర్టు ప్రత్యేక జిల్లా న్యాయమూర్తి రాధిక జైస్వాల్ సూచించారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 'సురక్షిత్ బచ్పన్ అభియాన్'లో భాగంగా విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మంచి స్పర్శ, చెడు స్పర్శ మధ్య తేడాను గుర్తించాలని, వేధింపులు ఎదురైతే భయపడకుండా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. పోక్సో చట్టంలోని నిబంధనలు, శిక్షలు, బాలలకు కల్పించిన హక్కులు, ఉచిత న్యాయ సహాయంపై వివరించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పెట్టెను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం విద్యార్థులకు అవగాహన కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎన్. రమాదేవి, ప్రభుత్వ న్యాయవాది కల్యాణ్ చక్రవర్తి, లోక్ అదాలత్ సభ్యుడు చింతోజు భాస్కర్, న్యాయవాదులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల మాయంపై సమగ్ర విచారణ జరిపించాలి

- నిరాధార ఆరోపణలు మానుకోవాలి.. బీఆర్ఎస్ నాయకులకు చైర్‌పర్సన్ వర్గం హితవు
- ప్రతి వార్డుకు రూ.6 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టడమే లక్ష్యం

కామారెడ్డి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 30 (జనం సాక్షి): కామారెడ్డి మున్సిపాలిటీలో సీసీ కెమెరాల మాయం, సిబ్బందిపై అవినీతి ఆరోపణలు, కౌన్సిల్ సమావేశాల నిర్వహణ తదితర అంశాలపై రాజకీయ వివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు నిరాధారమని మున్సిపల్ చైర్‌పర్సన్ వర్గానికి చెందిన కౌన్సిలర్లు ఖండించారు. వాస్తవాలు తెలుసుకోకుండా వ్యక్తిగత విమర్శలు చేయడం మానుకోవాలని సూచించారు. శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు.

మున్సిపల్ కార్యాలయంలో గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కొన్ని నెలల క్రితం కనిపించకుండా పోయాయని, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని కమిషనర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కెమెరాలతో పాటు కీలక ఫైళ్లు, రికార్డులు మాయమయ్యాయా అనే అంశాలను కూడా పరిశీలించాలని కోరినట్లు వెల్లడించారు. కెమెరాల యాక్సెస్ చైర్‌పర్సన్ భర్త వద్ద ఉందంటూ ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఈ వ్యవహారంపై నిజాలు తేల్చేందుకు బీఆర్ఎస్ నాయకులు, వైస్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు కలిసి ఎస్పీ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేద్దామని సవాల్ విసిరారు.

మున్సిపల్ కార్యాలయంలో బెదిరింపులు, వ్యక్తిగత విమర్శలకు తావివ్వకుండా పట్టణ అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరారు. కౌన్సిల్ సమావేశాలు, వారానికోసారి అధికారులతో సమీక్షలు నిర్వహించాలని సెప్టెంబర్ 9, అక్టోబర్ 19 తేదీల్లో కమిషనర్‌కు లిఖితపూర్వకంగా కోరినప్పటికీ సమావేశాలు జరగలేదని తెలిపారు. ఈ విషయంపై కమిషనర్‌ను ప్రశ్నించాల్సింది పోయి తమపై ఆరోపణలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. పార్టీలకు అతీతంగా ప్రతి వార్డుకు రూ.6 లక్షల చొప్పున నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు.

16వ వార్డులో ఇంటి నిర్మాణ అనుమతుల కోసం మున్సిపల్ సిబ్బంది డబ్బులు అడిగినట్లు ఫిర్యాదులు అందాయని, బాధితులు స్వయంగా కార్యాలయానికి వచ్చి వివరించారని కౌన్సిలర్లు తెలిపారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపి ఆరోపణలు ఎదుర్కొంటున్న చైన్‌మెన్‌తో పాటు సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరినట్లు వెల్లడించారు. అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించబోమని, డబ్బులు వసూలు చేసి అనుమతులు ఇచ్చే విధానాన్ని సహించబోమని స్పష్టం చేశారు.

మున్సిపల్ ఉద్యోగులను వ్యక్తిగత పనులకు వినియోగించుకుంటున్నారన్న ఆరోపణలను ఖండిస్తూ, ఆధారాలు ఉంటే బహిరంగంగా నిరూపించాలని సవాల్ చేశారు. అలాగే వసూళ్లకు పాల్పడుతున్నారంటూ ఆరోపణలు చేస్తున్న వ్యక్తుల పేర్లను వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఆరోపణలకు ఆధారాలుంటే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. మున్సిపాలిటీలో పారదర్శక పాలన, పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రాధాన్యమని కౌన్సిలర్లు పేర్కొన్నారు. రాజకీయ విమర్శలకు బదులుగా అభివృద్ధి కార్యక్రమాలకు అందరూ సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు కొత్తపల్లి లలిత చిట్టిబాబు, సుల్తానా యూనుస్, సావిత్రి సత్యం, తహిసున్నిసా లడ్డు, వాజిద్, బబ్లు, జావీద్, అంజాద్, గంగాధర్, కోఆప్షన్ సభ్యుడు అలీ భీన్ అబ్దుల్లా, గొనె సునీత శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు ముందస్తు చర్యలు చేపట్టాలి

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

రాజన్న సిరిసిల్ల బ్యూరో, అక్టోబర్ 30 (జనం సాక్షి); ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రాబోయే వేసవి కాలం ముగిసే వరకూ జిల్లాలో తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.వేసవి కాల సన్నద్ధత, తాగునీటి సరఫరాకు చేపట్టాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం మిషన్ భగీరథ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. అగ్రహారం, రుద్రవరం పంప్‌హౌస్‌లలోని పంపుసెట్లను ఎప్పుడూ సిద్ధంగా ఉంచాలని, ఇంకా కావలసిన యంత్రాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. తాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా ముందస్తుగా ఏర్పాట్లు చేయాలని సూచించారు.ఈ సమావేశంలో మిషన్ భగీరథ ఎస్ ఈ రాములు, ఈఈ లు ముజాహిద్ అన్వర్, సుమలత, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రాము, విశ్వన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చట్టాల పట్ల అవగాహన ఉండాలి

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం పూజిత

బోధన్, అక్టోబర్ 30 (జనంసాక్షి) : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సాలూరలో శుక్రవారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం పూజిత ఆధ్వర్యంలో న్యాయ చైతన్య సదస్సు, " సురక్షి త్ బచ్పన్ అభియాన్ నిర్వహించారు. ఫోక్సో చట్టం 2012 గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది. బాల బాలికల మీద జరిగే లైంగిక వేధింపులకు ఈ చట్టం రక్షణ కల్పిస్తుంది అని తెలియజేయడం జరిగింది. వ్యక్తి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. పోక్సో బాధితులకు ఉచిత న్యాయ సలహా మరియు న్యాయవాదిని ఏర్పాటు చేయడం జరుగుతుందనీ సైబర్ సేఫ్టీ మరియు ఫోన్ ఉపయోగం మంచి పనుల కోసం వాడాలన్నారు. ఇటీవల సైబర్ నేరాలు పెరుగుతున్నాయని ఇంటర్నెట్ మాధ్యమాల ద్వారా దొంగలు ఆన్లైన్ ద్వారా డబ్బులు కాజేస్తున్నారని తెలిపారు. ఈ విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్త పడాలని సూచించడం జరిగింది. ప్రధానోపాధ్యాయురాలు రాజీ మంజూష మాట్లాడుతూ, న్యాయశాఖ అధికారులు జడ్జిలు పాఠశాలను సందర్శించడం మొదటిసారిగా చూసామని తెలియజేశారు గత మూడు సంవత్సరాల నుండి పోక్సో చట్టంపై అవగాహన, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి విద్యార్థినులకు అవగాహన కల్పించామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఎం రాజశేఖర్. ఏజిపి రవీందర్. రెటైనర్ లాయర్ అజయ్ కుమార్, లీగల్ ఎయిడ్ కౌన్సిలర్ పి రామేశ్వరి. ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

డీఎంఎఫ్‌టీ నిధులు రూ.760 కోట్లు ఎక్కడికి మళ్లించారు?

- పెద్దపల్లి జిల్లాకు రావాల్సిన నిధులు ఇతర ప్రాంతాలకు తరలింపు
- 453 అభివృద్ధి పనులకు రూ.135.80 కోట్ల బిల్లులు పెండింగ్
- డిప్యూటీ సీఎం జోక్యంపై విచారణ జరిపించాలి.. ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేష్

గోదావరిఖని, అక్టోబర్ 30 (జనంసాక్షి): సింగరేణి రామగుండం-1, 2, 3 బొగ్గు గనుల ద్వారా పెద్దపల్లి జిల్లాకు రావాల్సిన డీఎంఎఫ్‌టీ నిధులు సుమారు రూ.760 కోట్లు ఎక్కడికి వెళ్లాయని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేష్ ప్రశ్నించారు. జిల్లాకు చెందాల్సిన నిధులు ఇతర ప్రాంతాలకు, ప్రభుత్వ కార్యక్రమాలకు మళ్లుతున్నాయనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దినేష్ మాట్లాడుతూ.. 2022 నుంచి ఇప్పటివరకు పెద్దపల్లి జిల్లాకు రావాల్సిన డీఎంఎఫ్‌టీ నిధులు సుమారు రూ.760 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. డిప్యూటీ సీఎం, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క జోక్యంతో జిల్లాకు రావాల్సిన నిధులు దారి మళ్లుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. జిల్లా డీఎంఎఫ్‌టీ కమిటీకి చైర్మన్‌గా ఉన్న కలెక్టర్‌తో పాటు జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలకు తెలియకుండానే నిధులు ఇతర ప్రాంతాలకు కేటాయిస్తున్నారనే ఆరోపణలపై స్పష్టత ఇవ్వాలని కోరారు. జిల్లాలో ఇప్పటికే 453 అభివృద్ధి పనులకు సంబంధించి రూ.135.80 కోట్ల విలువైన మెజర్‌మెంట్ బుక్ (ఎంబీ) రికార్డులు పూర్తయినా బిల్లులు చెల్లించలేదన్నారు. 2023 తర్వాత చేపట్టిన 269 పనులకు రూ.107.14 కోట్లు, అంతకు ముందు చేపట్టిన 184 పనులకు రూ.28.65 కోట్లు చెల్లించాల్సి ఉందని వివరించారు. నియోజకవర్గాల వారీగా చూస్తే పెద్దపల్లి పరిధిలో రూ.70 కోట్లకు పైగా, మంథని పరిధిలో సుమారు రూ.51 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. 2023కు ముందు చేపట్టిన పనుల్లో పెద్దపల్లి నియోజకవర్గంలోని 28 పనులకు రూ.21.12 కోట్లు, రామగుండం నియోజకవర్గంలోని 94 పనులకు రూ.3.43 కోట్లు, మంథని నియోజకవర్గంలోని 27 పనులకు రూ.60 లక్షలు చెల్లించాల్సి ఉందన్నారు. సింగరేణి బొగ్గు తవ్వకాలపై వచ్చే రాయల్టీలో భాగంగా డీఎంఎఫ్‌టీకి నిధులు జమ కావాల్సి ఉంటుందని, బొగ్గు నాణ్యతను బట్టి టన్నుకు రూ.32 నుంచి రూ.180 వరకు రాయల్టీ రూపంలో చెల్లించాల్సి ఉంటుం దని వివరించారు. మూడేళ్లుగా ఈ నిధులు సక్రమంగా విడుదల కాకపోవడంతో జిల్లాలో అభివృద్ధి పనులు నిలిచిపోతున్నా యని ఆవేదన వ్యక్తం చేశారు. డీఎంఎఫ్‌టీ నిధుల్లో వందల కోట్లు యంగ్ ఇండియా స్కూళ్లతో పాటు ఇతర ప్రభుత్వ కార్యక్రమాలకు, పక్క జిల్లాల అభివృద్ధి పనులకు మళ్లించారనే ఆరోపణలు ఉన్నాయని దినేష్ పేర్కొన్నారు. జిల్లాకు చెందిన మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింత కుంట విజయరమణారావు, రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ ఈ అంశంపై స్పందించాలని కోరారు. సింగరేణి ప్రభావిత ప్రాంతమైన పెద్దపల్లి జిల్లాకు రావాల్సిన డీఎంఎఫ్‌టీ నిధులను ఇతర ప్రాంతాలకు మళ్లించకుండా, జిల్లా అభివృద్ధికే కేటాయించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న రూ.135. 80 కోట్ల బిల్లులను వెంటనే చెల్లించి, నిలిచిపోయిన 453 అభివృద్ధి పనులను పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. నిధుల మళ్లింపుపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మద్దెల దినేష్ విజ్ఞప్తి చేశారు.

బోరబండలో నిషేధిత టాపెంటడాల్ మాత్రలు స్వాధీనం

అమీర్‌పేట్పో /బోరబండ / జనంసాక్షి: బోరబండ పంకా ప్రాంతంలో నిషేధిత టాపెంటడాల్ మాత్రలను అక్రమంగా విక్రయిస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారంతో పోలీసులు దాడి చేసి భారీగా మాత్రలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ వై. కాశయ్య పోలీసు సిబ్బందితో కలిసి నిర్వహించిన ఈ దాడిలో మహమ్మద్ కాశిఫ్ మిస్బా (26) వద్ద 690 టాపెంటడాల్ మాత్రలు, ఒక ఇంజెక్షన్‌ను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో పాటాన్ సలీం, సంజయ్ కుమార్ జైన్ అనే మెడికల్ షాపుల నిర్వాహకుల వద్ద ఎలాంటి ప్రిస్క్రిప్షన్ లేకుండా మాత్రలను కొనుగోలు చేస్తున్నట్లు నిందితుడు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. ఒక్కో షీట్‌ను సుమారు రూ.1,000 చొప్పున ప్రణయ్‌తో పాటు ఇతరులకు విక్రయిస్తున్నట్లు, కొన్నింటిని తానే వినియోగిస్తున్నట్లు విచారణలో వెల్లడైందని పేర్కొన్నారు. నిందితుడిపై గతం లోనూ పలు క్రిమినల్ కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం

చిగురుమామిడి, (జనంసాక్షి): చిన్నముల్కనూర్ ఆదర్శ పాఠశాలలో జిల్లా చట్టసేవాధికార సంస్థ, కరీంనగర్ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. న్యాయవాదులు ఆవునూరి వరుణ్ కుమార్, మనువాడ రామాంజనేయులు, తోట మనోహర్ పటేల్, కొండ్ర లక్ష్మణ్ విద్యార్థులకు పోక్సో చట్టం, ర్యాగింగ్ నిషేధం, బాలల హక్కులపై వివరించారు. చదువుతో పాటు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ హర్జిత్ కౌర్, ప్యారా లీగల్ వాలంటీర్ ములుగురు వైశాలి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలి

- భూగర్భ జలాల పెంపుతో వ్యవసాయ ఉత్పాదకతను పెంచాలి
- అధికారులకు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆదేశం

జగిత్యాల బ్యూరో, అక్టోబర్ 30 (జనం సాక్షి): గ్రామీణ ప్రాంతాల్లో నీటి సంరక్షణ పనులను విస్తృతంగా చేపట్టి భూగర్భ జలాల మట్టాన్ని పెంచడంతో పాటు వ్యవసాయ ఉత్పాదకతను మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం గొల్లపెల్లి మండలంలోని అగ్గిమల్ల, గంగాదేవిపల్లి గ్రామాల్లో పర్యటించి నీటి సంరక్షణ పనులు, ఫామ్ పాండ్లు, ఇంకుడు గుంతలు, గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం పెగడపెల్లి మండలం నంచర్ల గ్రామంలో ఫామ్ పాండ్ నిర్మాణ పనుల పురోగతిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా ప్రతి గ్రామ పంచాయతీలో జలసిరి కార్యక్రమం కింద నీటి సంరక్షణ పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు. ఫామ్ పాండ్లు, ఇంకుడు గుంతలు, స్టోన్ ట్రెంచెస్, కాంటూర్ కందకాలు వంటి పనులను అవసరమైన ప్రాంతాల్లో గుర్తించి చేపట్టాలన్నారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచడంతో పాటు భూమిలో తేమ శాతం తగ్గకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

వీబీజీ రామ్‌జీ పథకం కింద రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన పనులను ముందుగానే గుర్తించి గ్రామాల అవసరాలకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. నీటి సంరక్షణ, భూసార పరిరక్షణ, గ్రామీణ ఆర్థికాభివృద్ధికి దోహదపడే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఉపాధి హామీ నిధులను సమర్థవంతంగా వినియోగిస్తూ పనుల నాణ్యత, పురోగతిపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో డీఆర్‌డీఓ రఘువరన్, ఆర్డీఓ మధుసూదన్, ఈఈ, డీఈ, రెండు మండలాల ఎంపీడీఓలు, పీఆర్ఏఈలు, ఏపీఓలు, ఉపాధి హామీ పథకం సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పీఆర్సీ వేతన బకాయిలను వెంటనే చెల్లించాలి

బోధన్, అక్టోబర్ 30 (జనంసాక్షి) : పిఆర్సి వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని కోరుతూ శుక్రవారం తెలంగాణ ప్రగతి శీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ) ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి ర్యాలీ, ధర్నా నిర్వహించారు. తెలంగాణ ప్రతి శీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ) ఆధ్వర్యంలో మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ మరియు డైలీ వైస్ కార్మికులతో కలిసి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా చేసి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఏవోకు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ ప్రగతి శీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ) రాష్ట్ర నాయకులు బి.మల్లేష్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను ఒక వైపు పొగుడుతూనే పారిశుధ్య రంగంలో ఇటువంటి పని ఎవ్వరు చేయరని కొనియాడుతూ మరొకవైపు వారికి ఇవ్వాల్సినటువంటి పి.ఆర్.సి బకాయిలను బోధన్ మున్సిపల్ అధికారులు ఇవ్వకుండా వేధింపులకు గురి చేస్తున్నారని తీవ్రంగా తీయబట్టారు. దేవుడు కరుణించినా పూజారి కనికరించినట్లు 2021 లోనే ప్రభుత్వం జీవో విడుదల చేసినప్పటికీ ఇప్పటివరకు కార్మికులకు ఇవ్వాల్సిన పిఆర్సి బకాయిల ను ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఇదే కాకుండా ప్రతి నెల నెలా కార్మికుల వేతనాల నుండి కట్ చేసినటువంటి పీఎఫ్, ఈఎస్ఐ డబ్బులను కార్మికుల ఎకౌంట్లో వెంటనే జమ చేయకుండా నెలల తరబడి పెండింగ్లో పెడుతున్నారని దీని మూలంగా కార్మికులకు రావలసిన ప్రయోజనాలు పొందలేక పోతున్నారని వారి నిర్లక్ష్యం మూలంగా మరణించినటువంటి వారికి గాని ఏదైనా ప్రమాదాలకు గురైనటువంటి వారికి గాని ఇన్సూరెన్స్ లాంటి ప్రయోజనాలు పొందలేక పోతున్నారని వీటిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఈఎస్ఐ ప్రతి నెల ఒక్కొక్కరి నుండి 1000 నుండి 1500 రూపాయల వరకు కట్ అవుతున్న ప్పటికీ ఈఎస్ఐ ఆసుపత్రి నిజామాబాదులో ఉన్నందున అక్కడికి వెళ్లి చూయించుకోలేక పోతున్నారని దాన్ని బోధన్ జనరల్ ఆసుపత్రికి ట్రాన్స్ఫర్ చేసే ఈ ఎస్ ఐ వైద్య సేవలను అందే విధంగా చేయాలని కోరారు.అట్లాగే పారిశుధ్య రంగంలో పనిచేస్తున్న కార్మికులకు పనిముట్లు ఇవ్వకపోవడంతో కార్మికుల వారి సొంత డబ్బులుతో కొనుగోలు చేస్తూ ఆర్థికంగా ఇబ్బందుల పాలవుతున్నారని అట్లాగే కార్మికులకు గ్లౌజులు, మాస్కులు, లాంటివి కూడా ఇవ్వకపోవడంతో అనారోగ్యాలకు గురవుతున్నారని చెప్పులు బట్టలు నూనె వీటిని వెంటనే కార్మికులకు ఇవ్వాలని ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు ఈ సమస్యలను పరిష్కారం చేసేంతవరకు పోరాటం కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ మున్సిపల్ కార్మిక నాయకులు బి. పర్వయ్య, కే. గంగమని, జి. రాజు, బి. గంగారాం, లావణ్య, కృష్ణ, ప్రభాస్, పోశెట్టి, జి. రాజు, షేక్ బాబు, కళావతి, తుక్కాబాయి, గంగమని, పరమేష్ తదితరుల తో పాటు అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

నవంబర్ 1న ఎస్ఆర్ఆర్ కళాశాలలో మెగా జాబ్ మేళా

కరీంనగర్ టౌన్, అక్టోబర్ 30, (జనం సాక్షి) : నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నవంబర్ 1న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని యువతకు సూచించారు. కళాశాల విద్యార్థులతో పాటు కరీంనగర్, పరిసర ప్రాంతాల నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నవంబర్ 1వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కళాశాల ప్రాంగణంలో జాబ్ మేళా జరగనుంది. ఇందులో 500కు పైగా ఉద్యోగ ఖాళీలతో అమర రాజా, రేడియంట్, రెసొల్యూట్, ఓరియంట్ ఎలక్ట్రిక్, సైయెంట్, ష్నైడర్ ఎలక్ట్రిక్, ప్రీమియర్ ఎనర్జీస్, రెన్యూసిస్, రాపిస్కాన్ సిస్టమ్స్ తదితర ప్రముఖ కంపెనీలు పాల్గొననున్నాయి.

కాలుష్యరహిత పరిశ్రమల ఏర్పాటుకు ప్రాధాన్యం

- స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తాం
- మొండి గౌరెల్లి భూ నిర్వాసితులకు పరిహారం చెక్కుల పంపిణీ
- 19 మంది రైతులకు రూ.8.07 కోట్ల పరిహారం.. 26 ఎకరాల 36 గుంటల భూమికి చెల్లింపులు



రంగారెడ్డి, అక్టోబర్ 30 (జనంసాక్షి): ప్రభుత్వం సేకరించిన భూముల్లో కాలుష్యరహిత పరిశ్రమలు ఏర్పాటు చేసి, స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. యాచారం మండలం మొండి గౌరెల్లి గ్రామంలో భూసేకరణలో భూములు కోల్పోతున్న రైతులకు గురువారం ఎమ్మెల్యే, సర్పంచ్ రమాదేవితో కలిసి పరిహారం చెక్కులను పంపిణీ చేశారు. మొత్తం 26 ఎకరాల 36 గుంటల భూమికి సంబంధించి 19 మంది రైతులకు రూ.8.07 కోట్ల పరిహారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ.30 లక్షల నగదు పరిహారంతో పాటు, ప్రతి ఎకరానికి 121 గజాల చొప్పున హెచ్ఎండీఏ లేఅవుట్‌లో ఇంటి స్థలాలు కేటాయిస్తోందన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో ఈ ప్రాంతంలో పారిశ్రామిక అభివృద్ధి వేగవంతం కావడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. మొండి గౌరెల్లి రెవెన్యూ పరిధిలో మొత్తం 677 ఎకరాల 26 గుంటల భూమిని సేకరించాల్సి ఉందని తెలిపారు. ఇందులో ఎలాంటి అభ్యంతరాలు లేని 432 ఎకరాల 30 గుంటలకు సర్వే ప్రక్రియ పూర్తయిందన్నారు. మరో 177 ఎకరాలకు సంబంధించి వివాదాలు, అభ్యంతరాలు రావడంతో పరిహారం చెక్కుల పంపిణీని తాత్కాలికంగా నిలిపివేసినట్లు వివరించారు. గ్రామం నుంచి మొత్తం 112 ఫిర్యాదులు అందాయని, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. భూముల సాగు, స్వాధీన హక్కులకు సంబంధించి సమస్యలు ఎదుర్కొంటున్న రైతులకు మరోసారి సర్వే నిర్వహించి న్యాయం చేయాలని సూచించారు. అనంతరం ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. భూ నిర్వాసితులందరికీ వరుసక్రమంలో పరిహారం చెక్కులు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు, భూ నిర్వాసిత రైతులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

- తంగళ్ళపల్లి పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే

రాజన్న సిరిసిల్ల బ్యూరో, అక్టోబర్ 30 (జనం సాక్షి); రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ రికార్డుల నిర్వహణ, పెట్రోలింగ్ వ్యవస్థ అమలు, రౌడీషీటర్లు మరియు నేరస్తులపై నిఘా అంశాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలకు మరింత మెరుగైన పోలీస్ సేవలు అందించేందుకు సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందిస్తూ పారదర్శకమైన సేవలు అందించాలని సూచించారు.ప్రజల్లో భద్రతాభావం కల్పించడంలో విజిబుల్ పోలీసింగ్ కీలక పాత్ర పోషిస్తుందని,అధికారులు,సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాలను తరచూ సందర్శిస్తూ ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తు వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు.

గ్రామాల్లో రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేయాలని, చోరీలు, గంజాయి అక్రమ రవాణా, ఇతర అసాంఘిక కార్యకలాపాలపై నిరంతరం నిఘా కొనసాగిస్తూ కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. యువత మాదకద్రవ్యాలు, సైబర్ నేరాల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకునేలా విస్తృత స్థాయిలో గ్రామాల్లో, విద్యాసంస్థలు, కళాశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు.రోడ్డు ప్రమాదాల నివారణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతిరోజూ వాహన తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించడంతో పాటు హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగంపై ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టాలని ఆదేశించారు.ఎస్పీ వెంట డీఎస్పీ నాగేంద్రచారి, సి.ఐ నాగేశ్వరరావు, ఎస్.ఐ అశోక్ సిబ్బంది పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
31 అక్టోబర్ 2026

దుబాయ్‌లో చిక్కుకుపోయిన తెలంగాణ వాసి

- సీఎం ప్రజావాణి చొరవతో సురక్షితంగా స్వదేశానికి
- గద్వాల్ విజయలక్ష్మికి ధన్యవాదాలు తెలిపిన బాధితులు

హైదరాబాద్ (జనంసాక్షి) : సీఎం ప్రజావాణి ద్వారా తెలంగాణకు చెందిన మరో ప్రవాసి కార్మికుడు సురక్షితంగా స్వదేశానికి తిరిగి వచ్చారు. నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలం, బినోలా గ్రామానికి చెందిన బుద్ధ పెంటాజీ ఉపాధి నిమిత్తం దుబాయ్‌లోని అరోమా ఇంటర్నేషనల్ బిల్డింగ్ కాంట్రాక్టింగ్ ఎల్ఎల్‌సీ సంస్థలో భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నారు. సరైన శిక్షణ, అనుభవం లేకుండా కఠినమైన పనులు చేయాల్సి రావడంతో పాటు, అధిక పని గంటల కారణంగా ఆయన తీవ్ర అనారోగ్య సమస్యలు, నీరసం, అధిక చెమటతో బాధపడుతూ ఉద్యోగం కొనసాగించలేని పరిస్థితి ఏర్పడింది. అంతేకాకుండా, స్వదేశానికి తిరిగి రావడానికి రూ.90,000కు పైగా ఖర్చు అవుతుందని తెలియడంతో, ఆర్థికంగా వెనుకబడిన ఆయన కుటుంబం ఆ మొత్తాన్ని భరించలేక ఇబ్బందులు ఎదుర్కొంది. ఆయన భార్య బుద్ధ పుష్ప 2026 అక్టోబర్ 9న సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్ పర్సన్ గద్వాల్ విజయలక్ష్మిని ఆశ్రయించి, తన భర్తను సురక్షితంగా స్వదేశానికి తీసుకురావాలని కోరారు. ఈ ఫిర్యాదుపై విజయలక్ష్మి ప్రత్యేక చొరవ తీసుకుని, తెలంగాణ ఎన్ఆర్ఐ విభాగం, దుబాయ్‌లోని భారత కాన్సులేట్ సహకారంతో అవసరమైన చర్యలు చేపట్టారు. వారి సమన్వయంతో బుద్ధ పెంటాజీ 2026 అక్టోబర్ 23న సురక్షితంగా హైదరాబాద్‌కు చేరుకున్నారు. సీఎం ప్రవాసి ప్రజావాణి ద్వారా విదేశాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తెలంగాణ ప్రవాసులకు ప్రభుత్వం అందిస్తున్న సహాయానికి ఈ ఘటన ఒక విజయవంతమైన ఉదాహరణగా నిలిచింది. తమ సమస్యను పరిష్కరించి తన భర్తను సురక్షితంగా స్వదేశానికి తీసుకురావడంలో సహకరించిన ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికి, సీఎం ప్రజావాణి స్టేట్ ఇంచార్జ్ గద్వాల్ విజయలక్ష్మి, అధికారులకు, ఎన్ఆర్ఐ విభాగానికి, దుబాయ్‌లోని భారత కాన్సులేట్‌కు బుద్ధ పుష్ప, పెంటాజీ కృతజ్ఞతలు తెలిపారు. కాగా 265వ సీఎం ప్రజావాణిలో శుక్రవారం 105 దరఖాస్తులు అందాయి. స్టేట్ ఇంచార్జ్ గద్వాల్ విజయలక్ష్మి, స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్ దరఖాస్తులు స్వీకరించారు.

పంటలు వేయొద్దన్న సీఎంకు పదవి ఎందుకు?

- ఇంద్రవెల్లి పాంచజన్య సంకల్ప సభలో కల్వకుంట్ల కవిత విమర్శలు

మావల, అక్టోబర్ 31 (జనంసాక్షి) : రైతులను పంటలు వేయొద్దని చెప్పే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పదవిలో ఎందుకు ఉండాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. వ్యవసాయంపైనే ఆధారపడి జీవించే రైతులకు పంటలు వేయవద్దని సూచించడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. కరువు వస్తుందని తెలిసినా ముందస్తు చర్యలు తీసుకోకుండా ఇల్లు అంటుకున్న తర్వాత బావి తవ్విన చందంగా ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్నారని విమర్శించారు. శుక్రవారం ఇంద్రవెల్లిలో నిర్వహించిన పాంచజన్య సంకల్ప సభలో ఆమె మాట్లాడారు. ఆదిలాబాద్ జిల్లాకు గోదావరి, ప్రాణహిత వంటి నదులు ఉన్నప్పటికీ రైతులకు సాగునీరు అందించడంలో పాలకులు విఫలమయ్యారని అన్నారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును నిర్మించి ఉంటే రెండున్నర లక్షల ఎకరాలకు సాగునీరు అందేదని పేర్కొన్నారు. 12 ఏళ్లుగా బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రాజెక్టు పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నాయని ఆరోపించారు. కరువు పరిస్థితులు ఏర్పడిన తర్వాత మహారాష్ట్ర ముఖ్యమంత్రిని కలవడం ఏమిటని ప్రశ్నించారు. ఆదిలాబాద్ జిల్లాలో ప్రకృతి సంపద పుష్కలంగా ఉన్నప్పటికీ అభివృద్ధి జరగడం లేదని, 750 గ్రామాలకు కనీసం పాఠశాలలు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులన్నీ పెండింగ్‌లో ఉన్నాయని విమర్శించారు. రైతులకు నీళ్లు, విద్యుత్, యూరియా అందించాలని డిమాండ్ చేశారు. తమ పాంచజన్య సంకల్పంలో ఐదు ప్రధాన అంశాలకు ప్రాధాన్యమిస్తున్నామని, ప్రైవేటు రంగంలోనూ మెరుగైన ఉచిత విద్య, వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. యువతకు రూ.2 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు వ్యాపార రుణాలు అందిస్తామని తెలిపారు. గోదావరి, ప్రాణహిత నదులు ఉన్న ఆదిలాబాద్ జిల్లాలో రైతులకు సాగునీరు అందించలేని పాలకులు ఏ ముఖం పెట్టుకుని మాట్లాడుతున్నారని నిలదీశారు. శుక్రవారం ఇంద్రవెల్లిలో నిర్వహించిన పాంచజన్య సంకల్ప సభలో ఆమె మాట్లాడారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మించి ఉంటే రెండున్నర లక్షల ఎకరాలకు సాగునీరు అందేదని కవిత అన్నారు. 12 ఏళ్లుగా బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రాజెక్టు పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నాయని ఆరోపించారు. బీఆర్ఎస్ నిర్వహించనున్న రైతు గర్జన గర్జన కాదని, తర్జనభర్జన అని ఎద్దేవా చేశారు. సిరిసిల్ల, సిద్దిపేట నేతల మధ్య ఆధిపత్య పోరుతో కార్యకర్తలు అయోమయంలో ఉన్నారని విమర్శించారు. కేసీఆర్ హామీ ఇచ్చిన కొమురం భీమ్ విశ్వవిద్యాలయాన్ని ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. సీసీఐ, బోధన్ షుగర్ ఫ్యాక్టరీలను ఎందుకు తెరిపించలేదని నిలదీశారు.

ప్రభుత్వ హాస్పిటల్స్‌లో పీపీపీ మోడ్‌లో ఎంఆర్ఐ సేవలు

- మహబూబ్‌నగర్ జీజీహెచ్‌లో పైలట్ ప్రాజెక్ట్
- పేషెంట్లకు ఉచితంగానే కొనసాగనున్న ఎంఆర్ఐ సేవలు
- ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష

హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్రంలోని ప్రభుత్వ హాస్పిటల్స్‌లో ఎంఆర్ఐ సేవలను విస్తరించేందుకు పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానాన్ని అమలు చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. తొలుత మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో పైలట్ ప్రాజెక్టుగా ఈ విధానాన్ని ప్రారంభించి, ఆ తర్వాత రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్స్‌కు విస్తరించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. పీపీపీ విధానంలో ఎంఆర్ఐ సేవలు అందుబాటులోకి వచ్చినప్పటికీ ప్రభుత్వ హాస్పిటల్స్‌కు వచ్చే పేషెంట్లకు ఈ పరీక్షలు పూర్తిగా ఉచితంగా అందుతాయని మంత్రి స్పష్టం చేశారు. శుక్రవారం కోఠిలోని టీజీఎంఎస్ఐడీసీ కార్యాలయంలో ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఇతర రాష్ట్రాల్లో ఎంఆర్ఐ సేవల నిర్వహణకు అనుసరిస్తున్న విధానాలపై డాక్టర్లు, అధికారుల బృందం ఇతర రాష్ట్రాల్లో పర్యటించి, అక్కడ అవలంభిస్తున్న పద్ధతులపై స్టడీ చేసింది. ఆ స్టడీ వివరాలు, పీపీపీ విధానంతో పేషెంట్లకు కలిగే ప్రయోజనం, రాష్ట్రవ్యాప్తంగా ఈ సేవలను విస్తరించే అవకాశాలపై చర్చించారు. ప్రస్తుతం అమలవుతున్న విధానంతో పోలిస్తే పీపీపీ విధానంలో ప్రభుత్వానికి సుమారు 20 శాతం మేర ఖర్చు తగ్గుతుందని అధికారులు మంత్రికి వివరించారు. ఈ విధానం ద్వారా ఎంఆర్ఐ యంత్రాల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను అధిగమించడంతో పాటు పేషెంట్లకు ఎలాంటి అంతరాయం లేకుండా సేవలు అందించవచ్చని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో హైదరాబాద్‌లోని గాంధీ, ఉస్మానియా, నిమ్స్, డాక్టర్ మర్రి చెన్నారెడ్డి టిమ్స్, ఎంఎన్‌జే కేన్సర్ హాస్పిటల్‌తో పాటు వరంగల్‌లోని ఎంజీఎం, ఆదిలాబాద్ రిమ్స్, భూపాలపల్లి జీజీహెచ్‌లలో మాత్రమే ఎంఆర్ఐ సేవలు అందుబాటులో ఉన్నాయి. కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్గొండ వంటి ఉమ్మడి జిల్లా కేంద్రాల్లోని ప్రభుత్వ హాస్పిటల్స్‌లో ఈ సదుపాయం లేదు. మరోవైపు, ఎంఆర్ఐ యంత్రాల కొనుగోలు, నిర్వహణకు అధిక వ్యయం కావడం, సాంకేతిక సమస్యలు తలెత్తడం వల్ల ఇప్పటికే ఈ సేవలు అందుబాటులో ఉన్న హాస్పిటల్స్‌లోనూ అప్పుడప్పుడు అంతరాయం ఏర్పడుతోంది. ఫలితంగా పేషెంట్లు ప్రైవేటు హాస్పిటల్స్‌ను ఆశ్రయించాల్సి వస్తోంది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు ఇతర రాష్ట్రాల్లో అనుసరిస్తున్న విధానాలపై వైద్యులు, ఆరోగ్యశాఖ అధికారులతో కూడిన ప్రత్యేక బృందం అధ్యయనం చేసింది. తమిళనాడు సహా పలు రాష్ట్రాల్లో విజయవంతంగా అమలవుతున్న పీపీపీ విధానాలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది.

జర్మనీతో తెలంగాణ బంధం మరింత బలోపేతం కావాలి

- అంతర్జాతీయ పెట్టుబడులు, పర్యాటకం, సాంకేతిక రంగాల్లో అపార అవకాశాలు
- జర్మన్ ఐక్యతా దినోత్సవ వేడుకల్లో మంత్రి వాకిటి శ్రీహరి

హైదరాబాద్ (జనంసాక్షి) : భారత్, జర్మనీ దేశాల మధ్య 75 ఏళ్లుగా కొనసాగుతున్న స్నేహ సంబంధాలు భవిష్యత్తులో మరింత బలోపేతం కావాలని రాష్ట్ర క్రీడా , యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆకాంక్షించారు. వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, పర్యాటకం, సాంస్కృతిక మార్పిడి రంగాల్లో ఇరు దేశాల మధ్య పరస్పర సహకారాన్ని మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ హోటల్ లో జరిగిన జర్మన్ ఐక్యతా దినోత్సవ వేడుకల్లో మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా జర్మనీ కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్‌కు, జర్మనీ ప్రభుత్వానికి, ప్రజలకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఐక్యత, పరస్పర అవగాహన, ఉమ్మడి భవిష్యత్తు కోసం కలిసి పనిచేయాలనే సందేశాన్ని జర్మన్ ఐక్యతా దినోత్సవం ప్రపంచానికి అందిస్తోందన్నారు. భారత్‌కు జర్మనీ ముఖ్యమైన ఆర్థిక భాగస్వామ్య దేశమని, ఇంజినీరింగ్, ఆటోమొబైల్ తయారీ, ఐటీ, పరిశోధన, పునరుత్పాదక ఇంధన రంగాల్లో ఇరు దేశాల మధ్య మంచి సహకారం కొనసాగుతోందన్నారు. 2024లో ఇరు దేశాల మధ్య వస్తువులు, సేవల వాణిజ్యం 50 బిలియన్ అమెరికన్ డాలర్లను దాటిందని పేర్కొన్నారు.

ప్రపంచ పెట్టుబడులకు తెలంగాణ గమ్యస్థానం

నైపుణ్యం కలిగిన మానవ వనరులు, బలమైన సాంకేతిక వ్యవస్థలతో హైదరాబాద్ అంతర్జాతీయ కంపెనీలకు ప్రధాన గమ్యస్థానంగా ఎదిగిందని మంత్రి తెలిపారు. హైదరాబాద్‌లో డాయిష్ బోర్స్ సంస్థ కార్యకలాపాలు నిర్వహించడం అంతర్జాతీయ సంస్థలకు నగరంపై ఉన్న నమ్మకానికి నిదర్శనమన్నారు. ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించడం, అంతర్జాతీయ వ్యాపార భాగస్వామ్యాలను పెంపొందించడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. డిసెంబర్‌లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ద్వారా రాష్ట్రంలోని పెట్టుబడి అవకాశాలను ప్రపంచ పారిశ్రామికవేత్తలకు పరిచయం చేయనున్నట్లు తెలిపారు. అధునాతన తయారీ, ఆటోమొబైల్ ఇంజినీరింగ్, ఐటీ, లైఫ్ సైన్సెస్, పునరుత్పాదక ఇంధనం, ఆధునిక సాంకేతిక రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు జర్మనీ కంపెనీలను తెలంగాణకు ఆహ్వానించారు. జర్మనీలోని థ్యూరింగియా రాష్ట్రంతో నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞానం, స్టార్టప్‌లు, లైఫ్ సైన్సెస్ రంగాల్లో సహకారం పెరుగుతోందని వివరించారు.

తెలంగాణ సంస్కృతి, పర్యాటకానికి ప్రపంచవ్యాప్త గుర్తింపు

తెలంగాణకు గొప్ప చరిత్ర, విశిష్టమైన సాంస్కృతిక వారసత్వం ఉందని మంత్రి పేర్కొన్నారు. కాకతీయుల నిర్మాణ వైభవం, యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం, హైదరాబాద్ చారిత్రక కట్టడాలు రాష్ట్ర పర్యాటక ప్రత్యేకతను చాటుతున్నాయన్నారు. బతుకమ్మ, బోనాలు వంటి పండుగలు, చేనేత, హస్తకళలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకలని చెప్పారు. హైదరాబాద్ బిర్యానీ, ఇరానీ చాయ్, ఉస్మానియా బిస్కెట్లు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందాయని, జర్మనీతో వంటకాల పండుగలు, చెఫ్‌ల మార్పిడి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సాంస్కృతిక సంబంధాలను మరింత పెంపొందించవచ్చన్నారు. హైదరాబాద్‌తో పాటు వరంగల్ కాకతీయ వారసత్వ సంపద, రామప్ప దేవాలయం, ఆధ్యాత్మిక క్షేత్రాలు, సరస్సులు, జలపాతాలు, అటవీ ప్రాంతాలు, సంప్రదాయ గ్రామాలను సందర్శించాలని జర్మనీ పర్యాటకులకు మంత్రి ఆహ్వానం పలికారు.

50 వేల కోట్ల పర్యాటక పెట్టుబడులే లక్ష్యం

తెలంగాణను దేశంలోని ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. తెలంగాణ టూరిజం పాలసీ 2025-2030 ద్వారా ఐదేళ్లలో రూ.50 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం, ఐదు లక్షల ఉద్యోగ అవకాశాలను కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. పాలసీ తొలి సంవత్సరంలోనే 22,174 కోట్ల విలువైన పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయని, వాటిని కార్యరూపంలోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. హోటళ్లు, రిసార్టులు, వారసత్వ పర్యాటకం, పర్యావరణ పర్యాటకం, వెల్‌నెస్ టూరిజం, ఆతిథ్య రంగ విద్యలో పెట్టుబడులు పెట్టాలని జర్మనీ సంస్థలకు పిలుపునిచ్చారు. భారత్-జర్మనీ మధ్య 75 ఏళ్ల స్నేహబంధాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. యువతకు కొత్త అవకాశాలు కల్పిస్తూ, ఇరు దేశాల ప్రజల మధ్య సంబంధాలను మరింత దృఢపరుచుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి ఆహ్వానించిన జర్మనీ కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్‌కు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

సేవాభావం, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసమే స్కౌట్స్ అండ్ గైడ్స్ లక్ష్యం

- ఇతరులకు ఉపయోగపడేలా మనల్ని మనం సిద్ధం చేసుకోవాలి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్ (జనంసాక్షి) : విద్యార్థుల్లో క్రమశిక్షణ, సమయపాలన, సేవాభావం, నాయకత్వ లక్షణాలతో పాటు నైతిక విలువలను పెంపొందించడంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కీలక పాత్ర పోషిస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. జీవితంలో వ్యక్తిగత విజయాలు సాధించడంతోపాటు ఇతరులకు ఉపయోగపడేలా తమను తాము తీర్చిదిద్దుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. నాయకత్వమంటే ఎంతమంది మనకు సేవ చేస్తున్నారనేది కాదని, మనం ఎంతమందికి సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నామనేదే అసలైన నాయకత్వ లక్షణమని పేర్కొన్నారు. దోమలగూడలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ మోడల్ హైస్కూల్ నవీకరణ పనుల శంకుస్థాపన కార్యక్రమానికి శుక్రవారం రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల తో కలిసి హాజరైన ఉప ముఖ్యమంత్రి మాట్లాడారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ నినాదమైన 'ఎప్పుడూ సిద్ధంగా ఉండండి' అనే రెండు పదాల వెనుక గొప్ప జీవిత తత్వం దాగి ఉందన్నారు. పరీక్షలు, ఉద్యోగాలు, పదోన్నతులు, వ్యక్తిగత విజయాల కోసం సిద్ధమవడం కంటే కష్టాల్లో ఉన్నవారికి సహాయం చేయడానికి సిద్ధంగా ఉండటమే గొప్ప లక్షణమని చెప్పారు. ప్రస్తుత కాలంలో కృత్రిమ మేధస్సు, గవర్నర్ మార్గదర్శకత్వంలో తెలంగాణలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమం గణనీయంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. ఏడాది కాలంలో సభ్యుల సంఖ్య దాదాపు 70 వేల స్థాయికి చేరిందని చెప్పారు. ఈ కార్యక్రమాలను 3,200కు పైగా ప్రభుత్వ పాఠశాలలకు విస్తరించి, సుమారు 1.3 లక్షల మంది విద్యార్థులకు చేరువ చేయాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందన్నారు. విద్యార్థులు మరింత ధైర్యవంతులు, దయగలవారు, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడమే ఈ ఉద్యమం సాధించిన అసలైన విజయమని పేర్కొన్నారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ మోడల్ హైస్కూల్ పునరుద్ధరణ, అభివృద్ధి పనుల కోసం సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద రూ.2.5 కోట్లు అందించడం అభినందనీయమని అన్నారు. విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన బొగ్గును వెలికితీసే సింగరేణి సంస్థ, ఇప్పుడు పిల్లల్లోని ప్రతిభను వెలికితీసి వారి భవిష్యత్తును ప్రకాశవంతం చేసేందుకు తోడ్పడటం సంతోషకరమని పేర్కొన్నారు. తరగతి గదులు, క్రీడా సౌకర్యాలు, కంప్యూటర్లు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధితో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. స్కౌట్ లేదా గైడ్‌గా ఉండటానికి అసలైన పరీక్ష యూనిఫాం ధరించడం కాదని, ఎవరూ చూడనప్పుడు కూడా ఆ సంస్థ విలువలు, నియమాలను ఎంత నిబద్ధతతో పాటిస్తున్నామన్నదే ముఖ్యమని విద్యార్థులకు హితవు పలికారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సమాజ సేవ, విద్యా రంగ అభివృద్ధి విషయంలో గవర్నర్ మార్గదర్శకత్వాన్ని అనుసరిస్తుందని హామీ ఇచ్చారు. గాంధేయ సిద్ధాంతాల పట్ల నిబద్ధతతో పాటు పాఠశాలలు, స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న గవర్నర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సింగరేణి కార్మికుల హక్కుల సాధన టీబీజీకేఎస్‌తోనే సాధ్యం

- టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి

రెబ్బెన, అక్టోబర్ 30 (జనంసాక్షి): సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, ఏఐటీయూసీ యూనియన్ కార్మికులను నమ్మించి మోసం చేసిందని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) రాష్ట్ర ప్రధాన అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ఆరోపించారు. శుక్రవారం బెల్లంపల్లి ఏరియా గోలేటి సీహెచ్‌పీ, జీఎం కార్యాలయంలో నిర్వహించిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే సింగరేణి కార్మికులు అనేక హక్కులు, ప్రయోజనాలు సాధించుకున్నారని రాజిరెడ్డి పేర్కొన్నారు. తండ్రి, కొడుకులకు ఉద్యోగాలు, తెలంగాణ ఇంక్రిమెంట్, ఉచిత విద్యుత్, గృహ నిర్మాణానికి రూ.10 లక్షల వడ్డీ లేని రుణం, తల్లిదండ్రులకు వైద్య సదుపాయాలు వంటి ప్రయోజనాలు కల్పించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులకు అన్యాయం జరుగుతోందని, ఉద్యోగ భద్రతకు ముప్పు ఏర్పడుతోందని, మెడికల్ బోర్డు నిలిపివేసిందని ఆయన ఆరోపించారు. సమ్మె పేరుతో ఏఐటీయూసీ నాటకాలు ఆడుతూ, గొప్ప ఒప్పందం కుదిరిందని ప్రచారం చేసి కార్మికులను మభ్యపెట్టిందని విమర్శించారు. ప్రస్తుతం ధర్నాల పేరుతో మరోసారి కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు.

రూ.600 కోట్లతో ఇన్ఫోసిస్ కొత్త సాఫ్ట్‌వేర్ అభివృద్ధి కేంద్రం

- 11 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం.. 10 వేల సీట్ల సామర్థ్యం
- ప్రపంచ ఐటీ, ఆవిష్కరణల కేంద్రంగా హైదరాబాద్: మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్ (జనంసాక్షి) : ప్రపంచ సాంకేతిక రంగంలో హైదరాబాద్ తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంటోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఇన్ఫోసిస్ సంస్థ హైదరాబాద్‌లోని పోచారం ప్రాంగణంలో రూ.600 కోట్ల పెట్టుబడితో నిర్మించిన నూతన సాఫ్ట్‌వేర్ అభివృద్ధి భవనాన్ని ప్రారంభించడం రాష్ట్ర ఐటీ రంగ ప్రగతిలో మరో కీలక మైలురాయని ఆయన పేర్కొన్నారు. ఈ విస్తరణ హైదరాబాద్‌పై అంతర్జాతీయ సంస్థలకు ఉన్న నమ్మకానికి నిదర్శనమని తెలిపారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఇన్ఫోసిస్ ఉన్నతాధికారులు, ఐటీ రంగ ప్రతినిధులు హాజరయ్యారు. కొత్త భవనం ద్వారా అదనంగా 11 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం అందుబాటులోకి వచ్చిందని, ఇందులో 10 వేల సీట్ల సామర్థ్యం ఉందని మంత్రి వివరించారు. సుమారు 450 ఎకరాల్లో విస్తరించిన పోచారం ఇన్ఫోసిస్ ప్రాంగణ అభివృద్ధికి ఇప్పటివరకు రూ.3,200 కోట్లకు పైగా పెట్టుబడి పెట్టినట్లు తెలిపారు. కొత్త భవనం కేవలం మౌలిక సదుపాయాల విస్తరణ మాత్రమే కాదు.. తెలంగాణ యువతకు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు, ప్రపంచ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో రాష్ట్ర భాగస్వామ్యాన్ని పెంచేందుకు దోహదపడుతుందని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. 1981లో ప్రారంభమైన ఇన్ఫోసిస్ సంస్థ నేడు 59 దేశాల్లో సేవలందిస్తూ, 3.25 లక్షలకు పైగా ఉద్యోగులతో అంతర్జాతీయ సాంకేతిక సేవలు, కన్సల్టింగ్ రంగంలో అగ్రగామిగా ఎదిగిందని గుర్తుచేశారు. భారతీయ ప్రతిభ, నైపుణ్యం, పారిశ్రామిక దృక్పథం ప్రపంచ స్థాయిలో ఎలాంటి విజయాలు సాధించగలవో ఇన్ఫోసిస్ ప్రస్థానం చాటిచెబుతోందన్నారు. హైదరాబాద్‌తో ఇన్ఫోసిస్‌కు సుదీర్ఘ అనుబంధం ఉందని మంత్రి తెలిపారు. 2001 నుంచి కార్యకలాపాలు సాగిస్తున్న గచ్చిబౌలి ప్రాంగణంతో పాటు పోచారం కేంద్రం కూడా రాష్ట్ర ఐటీ రంగ అభివృద్ధికి గణనీయమైన తోడ్పాటునందిస్తున్నాయని చెప్పారు. ఉద్యోగాల కల్పన, ఐటీ ఎగుమతులు, పెట్టుబడులు, నైపుణ్యాభివృద్ధి, ఆవిష్కరణలకు ఈ సంస్థ దోహదపడుతోందని వివరించారు. ప్రతిభావంతులైన యువత, ప్రముఖ విద్యాసంస్థలు, మెరుగైన మౌలిక సదుపాయాలు, ఆవిష్కరణలకు అనువైన వాతావరణం హైదరాబాద్ బలాలని పేర్కొన్నారు. ఐటీతో పాటు ఔషధాలు, జీవసాంకేతికత, ఆర్థిక సేవలు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ) రంగాల్లో నగరం సాధిస్తున్న పురోగతి అంతర్జాతీయ పెట్టుబడులకు ఆకర్షణగా నిలుస్తోందన్నారు. కృత్రిమ మేధ (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ భద్రత, ఇంజినీరింగ్ సేవలు, నూతన తరం డిజిటల్ సాంకేతికతలు భవిష్యత్తులో హైదరాబాద్ ఐటీ రంగ వృద్ధికి కీలకంగా మారనున్నాయని శ్రీధర్‌బాబు అన్నారు. బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, రిటైల్, లైఫ్ సైన్సెస్, తయారీ రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా మారుతున్న అవసరాలకు అనుగుణంగా ఈ సాంకేతికతలు సేవలందించనున్నాయని చెప్పారు. పరిశ్రమలు, విశ్వవిద్యాలయాలు, యువ పారిశ్రామికవేత్తల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచ సాంకేతిక, ఆవిష్కరణల కేంద్రంగా హైదరాబాద్‌ను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లడమే తమ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యమివ్వడం, విద్యాసంస్థలతో పరిశ్రమల అనుసంధానాన్ని పెంచడం, యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం ద్వారా ఈ లక్ష్యాన్ని సాధించవచ్చని పేర్కొన్నారు.

కొత్త సాఫ్ట్‌వేర్ అభివృద్ధి కేంద్రంలో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమివ్వడం అభినందనీయమని మంత్రి అన్నారు. రేడియంట్ కూలింగ్ వ్యవస్థ, స్మార్ట్ లైటింగ్, వర్షపు నీటి సంరక్షణ, మురుగునీటి పునర్వినియోగం, సహజ కాంతి వినియోగం వంటి సదుపాయాలు ఇందులో ఉన్నాయని తెలిపారు. ఆర్థికాభివృద్ధితో పాటు పర్యావరణ బాధ్యతను కూడా సమానంగా పరిగణించాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా వనరులను సమర్థంగా వినియోగించే మౌలిక సదుపాయాల నిర్మాణం కీలకమని పేర్కొన్నారు.

కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, ఇన్ఫోసిస్ సీఎఫ్ఓ జయేశ్ సంఘరాజ్కా, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్లు సునీల్ కుమార్ ధారేశ్వర్, రాజనీష్ మాల్వియా, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నిలాద్రి ప్రసాద్ మిశ్రా, డెవలప్‌మెంట్ సెంటర్ హెడ్ ప్రణబ్ భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370